ఆంధ్రమహిళ

am-Mar-1956-13-3



MARCH '56 ANDHRA MAHILA ANNAS 8

ఆంధ్ర మహిళ

సంపుటి 13 :: మార్చి '56 :: సంచిక 3

వ్యవస్థాపకురాలు : శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

సంపాదకురాలు : శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ :

ఆంధ్ర మహిళా ప్రెస్

విషయ సూచిక

ముఖచిత్రం : కథకళీ నాయకీ నాయకులు

ఆంధ్రమహిళ

సంపుటి 13 :: మార్చి 56 :: సంచిక 3

బూడిదలో పోసిన పన్నీరు

మద్రాసు పట్టణములోని విద్యార్థుల తుంటరితనమును గురించి వార్తాపత్రికలేగాక న్యాయాధికారులు, విద్యా మంత్రులు కలుగచేసుకొనవలసివచ్చినది. ఇతర పట్టణములలోని విద్యార్థు లిట్టితుంటరిచేష్టలుచేయుటలో మంచి నైపుణ్యమే సంపాదించినప్పటికీ ఇప్పటివరకూ మద్రాసు విద్యార్థులు గుడ్డిలో మెల్లవలే కొంచెము మెరుగేనేమో ననిపించుతూవచ్చారు. కాని ఇటీవలవీరికి చదువుసంధ్యలయందు శ్రద్ధతగ్గి తుంటరితనము, రౌడీపనులయందు ఆసక్తి చూపుచున్నట్లు వ్యక్తమౌతున్నదని మద్రాసు విద్యామంత్రులే మొన్న తమ విచారమును వెలిబుచ్చారు. వీరి తుంటరితనము రౌడీచేష్టలవల్ల బాధపడేవారు విద్యార్థినులు యువతులు గాబట్టి మేము (మహిళలు, మహిళా సంస్థలు) కలుగ చేసుకొనవలసివచ్చుచున్నది.

మొన్న పత్రికలలో ప్రకటితమైన వివరములలో ఏమాత్రము అతిశయోక్తి లేదు. ఆడపిల్లల ప్రతి కళాశాల గేటువద్ద గుమిగూడే గుంపు, సమీపములోనున్న బస్సుస్టాండులవద్ద చేరే అల్లరిమూక, బీచిలో ఆడపిల్లలు వెళ్ళుతూవుంటే వాళ్ళకు రాసుకునివెళ్ళేవారు, ఇసుకలోకూర్చునివుంటే సువిశాలమైన సముద్రతీరమున చోటులేనట్టుగా వారిదగ్గరగా వెళ్ళేవారు విద్యావిహీనులు అజ్ఞానులు అనాగరికులుకాదు. వారందరు కళాశాలలలో తమ తలితండ్రులు కష్టపడిచెప్పించే విద్యనుపొందే విద్యార్థులే. నాగరికులు—అన్ని ఫాషన్లువారికి కరతలామలకములు-మన భావిపౌరులు. మనదేశ భాగ్యభోగ్యములను, రూపలావణ్యములను దిద్దనున్నవారు. ఇట్టివారు ప్రస్తుతమింతటి తుంటరిపనులలో నిమగ్నులగుటకు కారణమేమి ?

ఇంతేకాదు. సహవిద్యగల కళాశాలలలో ఆడపిల్లల అగచాట్లు చెప్పనవసరములేదు. ఆడపిల్లలకందరికీ ఒక పేరుపెట్టి ఆనామధేయముతో పిలుచుట, పాడుట, గోడలమీద డెస్కులమీద అసభ్యమైన వ్రాతలు ్రలువేయుట, అసభ్యమైన వ్రాతలువ్రాసిన చీట్లు జాబులు అందచేయుట, ఏమిపని లేకపోయినా ఏదో ఒకపని ంచుకొని విద్యార్థినులను పలుకరించుట, చీవాట్లుతిన్నా గొప్పగా తోటి విద్యార్థులతో తనతో ఆ అమ్మాయి ువుగా మాట్లాడినదనో, ఏవో కల్లబొల్లికబుర్లు కల్పించి చెప్పి తోడి విద్యార్థులకు ఈర్ష్యకలిగించుటకు పాట్లు ఒడుట. ఆ అమ్మాయి యిల్లువాకిలి, తల్లితండ్రుల భోగట్టా, వీలుంటే ఫొటోసేకరించి ఆ అమ్మాయి తనకు ప్రాణ స్నేహితురాలై పోయినదని తోటి విద్యార్థులకు భ్రమకలిగించుటకు అనేక అసత్యములు చెప్పుట? కథలు కల్పించి చెప్పుకొనుట, దానికి తన ఘనత ఏదోవున్నట్లు గర్వపడుట (సాధారణముగా ఈరకము కాలేజీలో ఒక డిజిటుమార్కు సంపాదించు వానరరూపములే కావచ్చు !). అంతటితో ఊరుకొనక తోటి విద్యార్థులను

బూడిదలో పోసిన పన్నీరు

ఉడికించుట. వారు ఆమోసపు మాటలు నమ్మి అట్టి ఘనత సంపాదించుటకై పాట్లుపడుట. పందెములువేయుట, విద్యార్థినులకు అనేకవిధముల చికాకుకలిగించుట వీటికి కారణమేమి ? చదువులయందు శ్రద్ధ తగ్గుటకు కారణమేమి ? చదువుయందు శ్రద్ధలేనిచో డబ్బు, సమయము అనవసరముగా వెచ్చించి కళాశాలలో సీట్లకు ఇబ్బందిఎందుకు కలుగ చేయుట ! S. S. L. C. పరీక్షలలో మంచి మార్కులు సంపాదించినవారు ఇంటర్మీడియట్‌లో గజినీ దండ యాత్రలకు కారణము ? కళాశాలలకు వచ్చేది విద్యకొరకా లేక ఇట్టి మూర్ఖపు వినోదముకొరకా ? తలితండ్రులు తమ సుపుత్రుల చదువులతీరులు గమనించుచున్నారా ?

మొన్న పత్రికలో వ్రాసినవారొకరు ఆడపిల్లలు పిరికితనమువల్లనే వారిని ఎక్కువ అల్లరి చేయుచున్నారనియు, బెంగాలీ సోదరీమణులవలే కాలిచెప్పు చేతిలోకితీసుకొనినచో విద్యార్థులకు బుద్ధిరాగలదని సలహా ఇచ్చారు. మద్రాసు విద్యామంత్రులు చెప్పినట్లు అది ఏవిధంగాను సహాయపడజాలదు. దూరాలోచన లేకచేసిన సలహాయే కాగలదు. ఆ పిల్లను అల్లరిమూక అంతయూచేరి యూగుకొనెదరా. పగపట్టిన పామువలే ఆ అమ్మాయిని నిలువ నిత్తురా ? ఎట్టి అనర్థము కలిగించను వెనుదీయరేమో ! అసహాయయైన ఆడపిల్ల పదిమంది విద్యార్థులు కలసిచేసే అల్లరిని ఎట్లు ఎదుర్కొనగలదు ? ఒక బాలునకు మిగిలిన విద్యార్థులందరూ ఈ అల్లరులందు అండగనేయుండ గలరు. దుర్మార్గునికి దూరంగానుండుటమేలు. అసహాయురాలు, అబల, సుకుమారి ఎంతటి సాహసవంతురాలైనను ఒక వానరదండును ఎదిరించగలదా ? అసంభవము. నిన్న మాకు చేరినవార్త ప్రకారము అచ్చటచ్చట మద్రాసులో పోలీసువారిని (ఈ దుండగీడులనుండి స్త్రీ విద్యార్థినులను రక్షణార్థము) ఏర్పాట్లు చేసినట్లు తెలియుచున్నది. సంతోషమే. ఢిల్లీలోవలే ఉపయోగపడవచ్చు. కాని ఈవిధముగా అధికారబలముచేత ఈ దుర్మార్గము వ్రేళ్ళతో నిర్మూలించ వీలులేదు. నైతిక సంస్కారముతో కుదరవలసిన రోగమే. ఏ భారతదేశము పతివ్రతామతల్లులకు ఆలవాలమో, ఏ భారతదేశములో అస్ఖలిత బ్రహ్మచారుల బ్రహ్మతేజస్సు దేదీప్యమానంగా వెలిగిందో, ఏభారతదేశపు నైతిక సిద్ధాంతములు సమస్తమానవకోటికి ఆచరణయోగ్యములో అట్టి భారతదేశములోని విద్యార్థులకిట్టి విపరీతపు బుద్ధులు పుట్టుటకు కారణము ?

వీరికి అక్కచెల్లెండ్రు లేరా ? వీరు రేపు వివాహమాడనున్న యువతినీ తమవంటి విద్యార్థులెచ్చటో ఆగడము పట్టుచున్నారుకదా ? లేక తామే అవివేకముగా పరిహసించుచున్నారేమో ! రేపు వారికి జనింపనున్న బాలబాలికలకు ఏమి బుద్ధులు బోధించగలరు ? నిర్మల హృదయముతో వారి పుత్రికలతోనైన విద్యార్థుల ప్రవర్తనపై ప్రశంసించగలరా ? బిడ్డలను దండింప వారు అర్హులగుదురా ? స్త్రీ మూర్తిని మాతృమూర్తిగానేగాక దేవతా స్వరూపిణిగా పూజించు మన దేశములో విద్యార్థినులకెట్టి అగచాట్లు ! ఈవిధముగా విద్యార్థులు నైతికముగా అధోగతికి దిగజారుట ఎంత శోచనీయము. సంస్కారములేని మానవులవలే, అడవిమృగములవలే పేవుమెంట్ల మీద సంచరించుతూ, నవ్వుతూ వెక్కిరించుతూ ఇకిలించుతూ సకిలించుతూ చేయు రణగొణధ్వని ఎంత ఏహ్యముగానున్నది. ఎంత వికారముగానున్నవి వారి చేష్టలు ? మానవత్వమునకెంతటి పతనము ! నేటివిద్యార్థులలో నైతిక బలము నశించుటకు కారణము నాస్తికత్వ ప్రచారమా ? లేక కొందరు చెప్పుచున్నట్లు సినిమాలు, వార్తాపత్రికలలోని బొమ్మలు, కథలు, వార్తలు కారణమా ? లేక సినీతారలననుకరించుచున్న విద్యార్థినుల చిలకవేషభాషలు కారణమా ? ఏది కారణమైనను విద్యార్థుల ప్రవర్తన ఏమాత్రము సమర్థనీయముకాదు. ఆయా కళాశాలలలోని స్కవుట్సు విషయముపై తగు చర్య తీసుకొనుట అవసరము. ఆ కళాశాలాధికారులు 'తుంటరి' విద్యార్థులపై తీవ్రమైన తీసికొనుట అవసరము. చర్యలు నిర్విఘ్నమొనర్చు విద్యార్థుల కృషి (సమ్మెలు వగైరాకు) అణచుటకు ప్రభుత్వ కళాశాలాధికారులకు సహాయముచేయుట అత్యవసరము. దారినిపోవు 'దానయ్య'లు ఈరకము అల్లరులు చూచీ చూడనట్లుపోకుండా ఈ అల్లరిమూక చర్యలు వీలున్నప్పుడల్లా వారించుట ధర్మము. అన్నిటికన్న ముఖ్యము ఈ విద్యార్థులకు నైతికజ్ఞానము, ధర్మాధర్మముల జ్ఞానము కలిగించుట. ఇది యింటియందు కళాశాలయందు తగు శ్రద్ధతో బోధించుట అత్యవసరము.

ఒక ఆడపిల్లను పరిహసించి హింసించునపుడు తన స్వంత సోదరికీ అదేగతి పట్టగలదనియు, తనను తొమ్మిదినెలలు మోసికనిపెంచిన 'తల్లి'కి ఎంతటిఅపరాధము చేయుచున్నదియు ప్రతివిద్యార్థి గ్రహించుట ముఖ్యము. లేనిచో ఈ విద్యార్థులకు ఈవిద్యా, కళాశాలలు, విద్యా ప్రణాళికలు అనవసరము. వృధా బూడిదలో పోసిన పన్నీరే !



రాజకీయాలు

శ్రీ జొన్నలగడ్డ రాధాకృష్ణ

జనవరినెలలో యావత్భారతదేశాన్ని అల్లకల్లోలంచేసి, భయంకర పరిణామాలకు దారితీసినది రాష్ట్రపునర్నిర్మాణ సమస్య. బొంబాయిని ప్రత్యేకరాష్ట్రంగా కేంద్రపాలనలో అట్టిపెట్టాలని ఇండియా ప్రభుత్వం ప్రకటించిందోలేదో చిచ్చు ముట్టింది. మహారాష్ట్రులు ఆగ్రహావేశవివశులైనారు. అటు ఒరిస్సాలోని కొంత బీహార్‌లోచేర్చా లనేసరికి అక్కడ అరాచకశక్తులు విజృంభించాయి. ఇటు దేవికుళం. పేర్మేడ్‌లకోసం దక్షిణాదిని హాహాకారాలురేగాయి.

అన్నిటికంటె మహాభీభత్సం రేగింది బొంబాయిలో. లూటీలు రాళ్ళురువ్వడాలు, గృహదహనాలు, పోలీసు కాల్పులు - 70 మంది కిపైగా మరణం, కొన్నివందల మందికి గాయాలు, 1400 మందికి పైగా అరెస్టు — ఒక పేమిటీ ఎన్నైనా జరిగాయి. తమ అయిష్టాన్ని వెలిబుచ్చడానికి యితర మార్గాలున్నా బొంబాయిలో మహారాష్ట్రులు, పూరిలో ఓఢ్రులు, యితర ప్రాంతాలలోని వారు అదను కోసం పొంచివుండే విప్లవ శక్తుల దుష్ప్రేరణకు లొంగిపోవడం జరిగిందని నాయకులు అన్నారు. ఈ కల్లోలం చూసే కాబోలు అమృతసర్ కాంగ్రెస్‌లో పదేళ్ళపాటు రాష్ట్రపునర్నిర్మాణ సమస్యను వాయిదావేస్తేనే బాగుండేటట్లు తోస్తుందని ప్రధాని పండిట్ నెహ్రూ అంటా.

ఇక ఈ కల్లోలం పరిణామాలు కొన్ని ఏర్పడ్డాయి. పంచమండలాలుగా దేశం విభజించబడాలన్నది ఒకటి. బెంగాల్ బీహార్ విలీనీకరణ ప్రతిపాదన ఒకటి. దక్షిణప్రదేశ్ పశ్చిమప్రదేశ్ — యిత్యాది ప్రదేశ నిర్మాణ సూచన ఒకటి. ఈ సూచనలపై యిప్పటికీ తర్జన భర్జనలు జరుగుతునేవున్నాయి.

◆ ◆ ◆

ఇండియాలోని జీవిత భీమాకంపెనీలన్నీ జాతీయం చెయ్యబడ్డాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రి శ్రీ దేశ్‌ముఖ్ సాధించిన విజయమిది. భీమాకంపెనీల నిధులు జాతిశ్రేయోభివృద్ధులకు వినియోగించడానికేమి. పట్టాదారులకు తగు భద్రతకేమి నిర్దేశించబడిన చర్యయిది. భీమావ్యాపార నిర్వహణకు, యింతవరకు కంపెనీల నిర్వాహకులకు పరిహారమివ్వడానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యబడ్డది.

◆ ◆ ◆

జనవరి 26న యావత్భారతదేశంలోను రిపబ్లిక్ దినోత్సవాలు మహావైభవోపేతంగా జరిగాయి. ఈ సందర్భంలో రాష్ట్రీయ సంకుచితత్వాన్ని, భాషాదురభిమానాన్ని విడనాడవలసిందని అన్ని ప్రాంతాలలోను నాయకులు ప్రజలను ముక్తకంఠంతో ఉద్బోధించారు.

◆ ◆ ◆

జనవరి 30న భారత జాతిజనకుడు గాంధీజీకి దేశంలోని వాడవాడలా ప్రజలు భక్త్యంజలి ఘటించారు. ఆనాటి ఉదయం 11 గంటలకు దేశంకోసం అసువులు బాసిన అమరవీరులను సంస్మరించారుకూడా.

◆ ◆ ◆

ఫిబ్రవరి మొదటివారంలో జరిగిన విశేషం బెంగుళూరులో ఆసియా దూరప్రాచ్యాలలోని 24 దేశాలు సమావేశం కావడం. ఈ సమావేశానికి ఇండియా ప్రధాని పండిట్ నెహ్రూ ప్రారంభోత్సవం జరిపారు. ఆసియా, దూరప్రాచ్యాలలో వెనుకబడివున్న దేశాల ఆర్థికాభివృద్ధికి పారిశ్రామికాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలనుగురించి, విశేషంగా అభివృద్ధి పొందివున్న పాశ్చాత్యరాజ్యాలు చెయ్యదగు సహాయాన్నిగురించి చర్చించి కొన్ని నిర్ణయాలను చేశారు.

ఫిబ్రవరిలోనే జరిగిన మరొక విశేషం శ్రీ వి. కె.

కృష్ణమీనన్ కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా నియమించ బడడం. ఇంతవరకు ప్రధాని పండిట్ నెహ్రూకు ప్రత్యేక రాయబారిగా, సంచార రాయబారిగా పెక్కు అంతర్జాతీయ సమస్యల పరిష్కారంలో తోడ్పడుతూ, ఐక్యరాజ్య సమితిలో భారతప్రతినిధివర్గ నాయకుడుగా వ్యవహరిస్తూ వున్న శ్రీ మీనన్ కేంద్రంలో మంత్రిగా నియమించ బడడం అందరికీ హర్షం కలిగించింది.

• • •

అమృతసర్‌లో 61 వ భారత జాతీయ మహాసభ ఫిబ్రవరి 7 నుంచి జరిగింది. దేశంలోని అన్నిప్రాంతాల నుంచి ప్రతినిధులు వచ్చారు. శ్రీ ఢేబర్ అధ్యక్షత వహించారు. రాష్ట్రపునర్నిర్మాణ విషయంలో ఆవేశకావేషాలు తగవని, శాంతియుత మార్గాలద్వారానే సోషలిస్టు సమాజస్థాపనకు, ఆర్థిక, సాంఘిక సముద్ధరణకు కృషి చెయ్యడమే కాంగ్రెస్ లక్ష్యమని, ఈ లక్ష్యసాధనకు ప్రజల అండదండలు అవసరమని నాయకులు ఉద్ఘాటించి ద్విభాషారాష్ట్ర నిర్మాణ సూత్రాన్ని ఆమోదించారుకూడా.

• • •

ఇదేసమయాన ప్లానింగ్ కమిషన్ ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక వివరాలను ప్రకటించింది. 1956 నుంచి 1961 లోగా సర్వతోముఖ జాతీయాభివృద్ధి సాధనకు, కేంద్ర, రాష్ట్రీయ ప్రభుత్వాలు మొత్తం 7100 కోట్ల రూపాయలు ఖర్చుచెయ్యగలవని, పబ్లిక్‌రంగాలలో 4800 కోట్లు, ప్రయివేటురంగాలలో 2300 కోట్లు పెట్టుబడి పెట్టుబడగలవని ఈ వివరాలుసూచిస్తున్నవి. సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు, సాంకేతిక శిక్షణకు వ్యవసాయ, పరిశ్రమల అభివృద్ధికి, ఆరోగ్య, పారిశుద్ధ్యాలకు, రైల్వేలకు, అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించబడే అవకాశాలు కల్పించబడ్డవి.

• • •

ఇండియా పార్లమెంటు బడ్జెట్ సమావేశం ఫిబ్రవరి 15 న ప్రారంభమయింది.

• • •

షర్యారాజు, రాణి భారతదేశంలో రెండునెలలపాటు పర్యటించే నిమిత్తం ఈనెల 16 వ తేదీని ఢిల్లీకివచ్చారు. ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాధాకృష్ణన్, ప్రధాని పండిట్ నెహ్రూ మొదలగువారు ఘనస్వాగతమిచ్చారు. రాజదంపతులు యిప్పుడు దేశంలో పర్యటిస్తున్నారు.

ఫిబ్రవరి 19 వ తేదీని భారతమాత ఒక ఉత్తమ పుత్రుని కోల్పోయింది. భారత స్వాతంత్ర్య సమర యోధుడు, త్యాగి, విద్యావేత్త, రచయిత, వక్త, ఆలిండియా ప్రజా సోషలిస్టుపార్టీ అధ్యక్షుడు శ్రీ ఆచార్య నరేంద్రదేవ ఆకస్మికంగా ఈరోడ్‌లో పరమపదించారు.

ఇక విశాలాంధ్ర సంగతి. తెలంగాణాకు రక్షణలు యివ్వడానికి, కొత్త రాష్ట్రాన్ని హైదరాబాద్ రాష్ట్రం అని పిలవడానికి జనాభానిష్పత్తినిబట్టి మంత్రి పదవులు, ఉద్యోగాలు యివ్వడానికి ఆంధ్ర నాయకులు సమ్మతించారని ఢిల్లీలో యిప్పుడు జరుగుతున్న చర్చలపై కాంగ్రెస్ వర్గాలనుంచి వచ్చినవార్తలు తెలుపుతున్నది. ఈవిషయమై ఈనెల 29 వ తేదీలోపుగానే ప్రకటన జరగవచ్చునను కొంటున్నారు.

• • •

కచ్‌వద్ద పాకిస్థాన్ సైనికులు ఇండియా భూభాగంలోకి చొరబడ్డారని, భారతసైనిక గస్తీదళం కాల్పులు జరిపిందనీ, యిద్దరికి తీవ్రంగా గాయాలు తగిలాయని ఈనెల 21 వ తేదీని అహమ్మదాబాద్‌కు వార్తవచ్చింది.

ఈకొత్త సంఘర్షణ వివరాలకు కేంద్ర ప్రభుత్వం నిరీక్షిస్తూవుంది.

దక్షిణప్రదేశ్‌నిర్మాణ ప్రతిపాదనపట్ల అసమ్మతిసూచనగా మద్రాసులోను, దక్షిణాదిని వేర్వేరు ప్రాంతాలలోను ఈ నెల 20 తేదీని హర్తాళ్ జరిగింది. కొన్నిచోట్ల సభలు, ఊరేగింపులు. ప్రశాంతంగానే జరిగాయికాని మద్రాసులోను, సేలంవద్ద దుండగులు కొందరు బస్సులపైన, రాళ్ళురువ్వడం వంటిచర్యలకు పూనుకోవడంతో పోలీసులు కాల్పులు జరపకతీరని పరిస్థితి ఏర్పడ్డది. వేర్వేరు చోట్ల 800 మందికిపైగా అరెస్టు చెయ్యబడ్డారు.

ఇక విదేశాలలో ఈ నెలలో జరిగిన సంఘటనలలో ముఖ్యమైనది ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్, బ్రిటీష్ ప్రధాని సర్ ఆంధోని ఈడెన్‌ల సమావేశం.

ఈ సమావేశం వాషింగ్‌టన్‌లో జనవరి 30 నుంచి మూడురోజులపాటు జరిగింది మధ్యప్రాచ్య, దూరప్రాచ్యాల పరిస్థితిపై సంభాషణలు జరిగాయి. ఈ చర్చలు యిక ప్రారంభమౌతాయనగా రష్యాప్రధాని మార్షల్ బుల్గానిన్ అమెరికా, రష్యాలమధ్య 20 ఏళ్ళపాటు అమలున వుండగల ఒక మిత్రత్వ ఒడంబడిక జరగాలని సూచిస్తూ, ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్‌కు ఒకసందేశం పంపించాడు. ఇది మామూలుపాటేనని ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ ఆ ప్రతిపాదనను తిరస్కరించాడు.



పుట్టినరోజు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ప్రతివ్యక్తికీ పుట్టినరోజు చాలా ముఖ్యము. ఒక్కొక్కప్పుడు ఆ పుట్టినరోజు ఆ వ్యక్తికీ కుటుంబానికే కాకుండా దేశానికీ ప్రపంచానికీకూడా చాలా ముఖ్యం కావచ్చు. అంతేకాక పుట్టినరోజులు చేసుకుంటూ వుంటే ఆ వ్యక్తికి ఏళ్ళు పైబడుతున్నవని ఏడాదికొక్కసారైనా హెచ్చరిక కలుగచేస్తూ, పుట్టుట గిట్టుట కొరకే కాదని పుట్టినందుకు జీవితము ధన్యము చేసుకోవాలని తోపింప చేయవచ్చు.

మొన్న బీహారులో రెవెన్యూమంత్రి సత్తమునకు 58 వ పుట్టినరోజు రావటము ఆయనగారికి రూ 58 వేలు బహుమాన మివ్వటము జరిగింది. ఉదారులైన ఆ మంత్రి పుంగవులు ఆ ధనాన్ని ఏ విధంగా సద్వినియోగము చేయాలో ఆలోచించి చివరికి వారి స్వరాష్ట్రమైన బీహారు విశ్వవిద్యాలయాని కివ్వాలని నిశ్చయించు కున్నారు కాని దానిని ఒకనిబంధనపై ఇచ్చారు. అది వర్ణాంతర వివాహముల ప్రోత్సాహమునకై విశ్వ విద్యాలయము వినియోగించాలట. రెవెన్యూ మంత్రిసత్తముని పుట్టినరోజుకు, విశ్వ విద్యాలయమునకు, వర్ణాంతర వివాహములకు ఏమి సంబంధమంటే ... ఏమో ! "...అసాధ్య మేరికిన్ !" కాదు కాదు; మరి——

ఇదివరకు వివాహాలు ఆయా వ్యక్తులకు కుటుంబానికి తద్వారా సంఘానికి సంబంధించిన వ్యవహారము. వివాహాలు విధి నిర్ణయించు తుందని నమ్మకమున్నా సాధారణంగా నిర్ణయించేవారు తల్లిదండ్రులు, పెద్దలే. కాని ప్రస్తుతము వివాహమాడువారే నిశ్చయించు కొనుట అమలులోవున్నది. నాగరికతాభ్యుదయ పురోగమనములో నున్న మనకు భవిష్యత్తులో రాజ్యాంగమూ, ప్రభుత్వమే పౌరుల వివాహాలు కూడా నిర్ణయించనున్నది కాబోలు. ఆ పరబ్రహ్మమువలే, రాజకీయాలుకూడా "అందుఇందు" భేదము లేకుండా ఎల్లెడలా వుండుట తధ్యము. కాని ఆ వివాహాల కష్టసుఖము లనుభవించేది ఆ వధూవరులు మాత్రమే.

జైలుకు వెళ్ళిన ప్రతి గాంధీటోపీ స్వచ్ఛందమైన దేశభక్తుడనని చెప్పుకున్నట్లు మొన్నటివరకూ ఈ వర్ణాంతర వివాహాలు చేసుకున్న కొందరు తామంతా సంఘసేవ చేశామని చెప్పుకుంటూ వచ్చారు. పొరపాటుననో గ్రహపాటుననో గత్యంతరములేక వర్ణాంతర వివాహాలు చేసుకున్నవారు సైతము తమ సంఘసేవను గురించి చెప్పుకుంటూంటే తప్పని సరిగా కొందరైనా వినవలసి వచ్చేది. ఇది పాతమాట. ముందుముందు వీరు కేవలము సంఘసేవ చేశామని చెప్పి తృప్తి పడకుండా, దేశసేవ కూడా చేశామని చెప్పుకునే అవకాశాలున్నాయి. అది ఈ వర్ణాంతర వివాహాలు రాజకీయాలతో ముడిపెట్టుకొనుచున్న సంబంధ బాంధవ్య పర్యవసానమే కాగలదు.

రాజకీయాలమాట దేవుడెరుగు, వర్ణాంతర వివాహాల్లు ఆయావ్యక్తుల కెంతవరకు ఉపయోగమంటే అదిసున్న అనే చెప్పవచ్చు. అక్కడక్కడ మినహాయింపులువుండవచ్చు. నూటికొక్కటో రెండో వివాహాలు సుఖాంతంగా పరిణమింపవచ్చు. ఈ వర్ణాంతర వివాహాల హంగామాలో ఆంధ్రదేశము ఇరువదేళ్ళనాడే ముందడుగు వేసింది. ఎవరు ఎందుకు చేసుకున్నారో తెలియదుగాని అందరూ గొప్పగా సంఘసేవంటూనే వర్ణాంతర వివాహాలు చేసుకున్నారు. వారప్పటినుండీ ఇప్పటివరకూ చేసిన ఘనమైన సంఘసేవను గురించి చెప్పుకోటము వినలేక కొందరు హతాశులై పోయినారు. వీరిలోసుఖాంతముగా పరిణమించిన వివాహాలు నూటికి రెండు మూడు లేక ఐదుంటే

ఎక్కువేమో! మిగిలిన వివాహాలు చెప్పకొనుట వరకే. వినాయకుడి జోలికిపోయి తేలు కుట్టించుకున్న బాలుడు వైఖరివాలు. వర్ణాంతర వివాహాలు ఎంత ఆదర్శ ప్రాయములైనా వాస్తవిక జీవితములో అట్టి వివాహాల పరిణామము ఆనందదాయకము కాదు.

మన దేశములో ఒక్కొక్క కులమునకు సంఘములో ఒక్కొక్క స్థానము యుండుటేగాక ఆయా కులమునకు వేరు వేరు ఆచారములు పద్ధతులు కలవు. ఆ పద్ధతులలో పెరిగిన వారికి మార్చుకొనుట సులభము కాదు శ్రేయస్కరము కాదు వ్యక్తికి పరిసరాలతో ఎంత సంబంధమో వారసత్వముతో కూడ అంత ప్రమేయము కలదనుట నిర్వివాదాంశము. ఆయా కులములలో పుట్టుట వలన పుటకతోనే అబ్బిన గుణములు సాధారణముగా పుడకలతోనే పోయేది.

వర్ణాంతర వివాహాంవల్ల అత్యంత మధుర వైవాహిక జీవితము గడుపుచున్నవా రచ్చటచ్చట లేకపోలేదు. కాని బహుస్వల్ప సంఖ్యాకులకే యట్టి అదృష్టము. బాధపడ్డ వారే ఎక్కువ. వివిధములైన సమస్యలను ఈ వర్ణాంతర వివాహములను చేసుకొన్నవారు ఎదుర్కొనవలసివచ్చుచున్నది. ప్రత్యేక పరిస్థితులలో నిషిద్ధము కాకూడదుగాని, ఎల్లప్పుడు వాంఛనీయమని చెప్పజాలము.

ఈ ధోగట్టా ఇటీవల అమెరికాలో సేకరించిన విషయ సంగ్రహము (Statistics) పైసత్యమును ఋజువు పరుస్తున్నది.

అందుచే రాబోలు. బీహారు మంత్రిగారు అట్టి వివాహములు చేసుకొన్నవారికి బహుమానములు ఏర్పాటు చేశారు. ఆ బహుమానాలకు స్కాలరుషిప్పులని నామధేయించినారు. ఒక పట్టభద్రుడైన యువకుడుగాని, యువతిగాని, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, యాదవ వగైరా కులముల వారిలో వర్ణాంతర వివాహములు చేసు కొన్నవారికి వివాహము చేసుకొన్నందుకు రూ 2000 లు (రెండువేలున్నూ) మొదటి శిశువు జననము తరువాత మరియొక వెయ్యి రూపాయిలును బహుమానము పొందగలరు. కాని ఈ పై కులములవారు గిరిజన యువతీ యువకులను చేసుకుంటే మరికొంత ఘనత! బహుమానము హెచ్చు! వివాహానంతరము రూ 3000 లు. ప్రథమ శిశువు జననానంతరము రెండు వేల రూపాయలును లభింపగలవు. ఆతరువాత విడాకులు తీసుకుంటే ఆ ధనము మొదరా ఇవ్వవలసి వస్తుందని ఒక క్లాజుగాని, లేక వివాహ రజతోత్సవము చేసుకున్నవారికి మరియొక మూడు వేల రూప్యముల బహుమానముల ఏర్పాటు గాని చేసియుంటే ఈ వివాహాలు వ్యాపారంగాపరిణమించకుండా వుండేవేమో! వివాహాలకు పవిత్రతంటూ లేని రోజులలో అవి వ్యాపారము కాకుండా చేసికొనుటే గొప్ప. బహుమానాలు పట్టభద్రులకేయని నిశ్చయింపబడుట చేత ఈ బహుమానములు బీహారు విశ్వవిద్యాలయములలోని పోస్టు గ్రాడ్యుయేటు విద్యార్థులకే ఈ బహుమానాలకు అర్హతకలదేమోయని తోచుచున్నది. ముందు ముందు బీహారు పోస్టుగ్రాడ్యుయేటు కోర్సులకు విద్యార్థుల త్రొక్కిడి ఎక్కువగా వుంటుందా?

ఆంధ్ర ప్రజానీకము ఏమరుపాటున నైనా ఏ మంత్రి సత్తమునికిగాని, ఏ వ్యక్తికిగాని, పుట్టిన రోజునగాని, గిట్టిన రోజునగాని, షష్టిపూర్తి రోజునగాని పెద్ద పెద్ద మొత్తములు బహుమానముగా ఇచ్చి ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు కడగండ్లు తేకుండ యుందురుగాక!

మనలో మనమాట— ఇస్తేగిస్తే ఏదిగతీ?

".. ... .. రంగ రంగా! కావేటి రంగా!" —





నాడీజంఘుడు

'సుభాషిణి'

[మన ఇతిహాసములయందు పిన్నలకు పెద్దలకు ఆసక్తి - కలిగించుటే మా అభిమతము - మహాభారతములోని కొన్ని కథలను వరుసగా పాఠకులకు అందవేయగలము. సం.]

ఒకానొకప్పుడు సద్వంశంలో జన్మించిన బ్రాహ్మణుడొకడు తన కులాచార వృత్తికి దూరమయి ఒక బోయవనితను భార్యగా గ్రహించి, కిరాతులతో కూడి, అడవులలోబడి తిరుగుతూ, వేటలాడుతూ, మాంస భోజనమున కలవాటు పడి, భోగపరాయణుడై సంచరిస్తూ ఉండేవాడు. ధనమార్జించవలెననే ఆశతో కొందరివర్తకులతో స్నేహం చేసుకున్నాడు. ఒకసారి వ్యాపారం కోసం వెళ్ళే వర్తకుల వెంట దేశాంతరములకు బయలుదేరాడు. కొండలవెంటా, మహారణ్యాలవెంటా పడి పోతూఉంటే ఒక దుర్గమారణ్యంలో ఈవర్తకుల గుంపును ఒక అడవి ఏనుగు ఎదుర్కొన్నది. ఆ వనగజము వారిమీది కురికి ఉన్మదలీల నేలబెట్టి కాలరాయబోవ, జనము అత్యంత భీతావహులై, వికావికలై, నాలుగుదిక్కులకూ పారిపోయారు. పాపం మన బ్రాహ్మణుడుకూడా ఎలాగో తప్పించుకుని బయటబడి, బ్రతుకు జీవుడా అని, కాందిశీకుడై, ఏకాకిగా ఒక అరణ్యమార్గము పట్టి పోతూ ఉండెను.

వెళ్ళగా వెళ్ళగా కొంతవడికి అతనికొక పెద్ద వటవృక్షము కనపడినది. ఆ వృక్షము మంచి ఎత్తుగాను, విశాలముగాను, దట్టముగాను పెరిగి ఉన్నది. దానిని మన బ్రాహ్మణుడు చూచినాడు. చూచి, ఎంతో సంతోషించాడు. పాపం అతనికి భోజనమూలేదు, ఆకలి దహించి వేస్తూ ఉండె. దాహముతీర్చుకొనుటకు నీళ్ళచుక్కలైనా దొరకలేదు. దప్పిచేత గొంతు ఎండిపోతూ

ఉంటేను. ప్రొద్దుపోతూఉంది. బాగా అలసి పోయినవాడాయె. ఆ చెట్టుక్రింద విశ్రాంతి తీసు కోవాలని కూర్చున్నాడు. వనలతలు పూచిన పూవుల సువాసనలు కలిసిన చల్లనిగాలి అతని మార్గాయాసమును కొంచము తగ్గించినది.

ఇలాగు ఉండగా, అక్కడికి ఒక పెద్ద కొంగ వచ్చినది. ఆ బ్రాహ్మణుని చూచి అతనిని సమీ పించినది. ఎంతో ఆదరముతో, ప్రేమతో కుశల ప్రశ్నలు వేసి అతనిని గౌరవించినది.

"మీ దేయూరు? ఎవరు మీరు? ఎక్కడికి వెళ్లు చున్నారు? ఎందుకోసం వెళ్ళుచున్నారు? మీ వంటి మహానుభావుల దర్శనభాగ్యం వలననేను ధన్యాత్ముడనైనాను. నాపేరునాడీజంఘుడు. నన్ను రాజధర్మువు అనికూడా పిలిచెదరు. మీ చరిత్ర తెలుసుకొన వలెనని కుతూహల పడుతున్నాను. మీ కథ అంతా సెలవివ్వండి" అని ఆ కొంగ —నాడీజంఘుడు— వినయపూర్వకంగా అడిగినాడు.

అతడు తన చరిత్ర చెప్పడం ప్రారంభించి "నా ఉనికి మధ్యదేశం. బ్రాహ్మణుణ్ణి. గౌత ముణ్ణి. నా తండ్రి ఒకమహనీయుడు. వేదాధ్యయ స్థానములకు పుట్టినిల్లయిన సద్వంశంలో జన్మించీ కూడా, వేదాధ్యయనముపై మనస్సు పోవక, విప్రకర్మలపై ఆసక్తిలేక, కామలోలుడనై ఒక బోయ స్త్రీతో కూడి పేదరికము ననుభవిస్తూ బహు నికృష్ట జీవితం గడుపుతూ ఉన్నాను. ఇలా ఉండగా ధనసంపాదనయందు కాంక్షకలిగి కొందరు బేహారులతో కలిసి దేశాటనం చేయు టకు బయలు దేరగా ఒక భీకరారణ్యంలో మమ్మొక వనగజము ఎదుర్కొని చంపబోయినది. సార్థవాహులందరును భయపడి దిక్కొక కొకరు వై పరుగెత్తి పారిపోయిరి. నా అదృష్టము నన్ని క్కడికి తీసుకొని వచ్చినది. నీ దర్శనభాగ్యము లభించినది. నా కష్టములు గట్టెక్కినవి" అని నివేదించినాడు.

అప్పుడా విహంగము "మంచిది నీ దారిద్ర్యం పోగొట్టెదను. నీచిక్కులన్నీ విడదీసెదను. అంత వరకు నా ఆతిథ్యము స్వీకరించ వలసినది" అని ప్రార్థించినది. వెంటనేపోయి, మందాకినీ నదిలోని చేపలు తెచ్చి చక్కగావంటచేసినది. వివిధములైన వన్యఫలములు సమకూర్చినది. అతిథికి తృప్తికర ముగా విందుచేసినది. ఇంతలో ప్రొద్దుపోయినది. పల్లవములతోనూ పువ్వులతోను దట్టముగా పక్క అమర్చి శయనించమని వేడుకొన్నది. నిద్రవచ్చు నంతవరకు ఆయనకు మంచి మాటలు చెప్పి నిద్రపుచ్చినది. రాత్రంతయు సుఖముగా నిద్రపోయా డా బ్రాహ్మణుడు. ఉదయమున నాడీజంఘుడు ఆ బ్రాహ్మణుని పిలిచి

"విను మిత్రుండును, రజతము
కనకము, బుద్ధియును నాల్గుకారణములు మ
ర్త్యుని దారిద్ర్యము వాయుటకు"

ఈ నాల్గింటిలో మైత్రి ఉత్తమమైనది. నేను మైత్రినే అన్నిటి కంటె ఎక్కువగ పరిగణింతును. నేనునీతో స్నేహముచేసుకొను చున్నాను. నాకు మిత్రుడ వైననీవు అపారమైన భాగ్యమునకు పాత్రుడవు గాక పోమెదవా! ఇదిగో! ఇక్కడికి మూడు యోజనముల దూరమున మధువ్రజపుర మనే నగర మున్నది. ఆ పట్టణము నేలు రాజు, విరూపాక్షు డనువాడు, నాకత్యంతాప్త మిత్రుడు. ఆరాక్షసరాజును దర్శించి నిన్ను నేను పంపించితి నని చెప్పుము. నాస్నేహితుని చూచుటకు అతడెంతో సంతోషించును. కాంచనము, రత్న ములు అపారముగా ఇవ్వగలడు. ఇదిగో! ఈ దారినిపట్టి వెళ్ళుము"అనిచెప్పినాడు. ఆ బ్రాహ్మ ణునికి దారిచూపించి పంపించినాడు.

బ్రాహ్మణుడు రాజధర్ముని చెప్పిన ప్రకారము మధువ్రజపురము చేరు కున్నాడు. రాజుగారి దర్శనం పొందేడు. నాడీ జంఘుని ప్రాణ మిత్రుడ నని చెప్పు కున్నాడు. "రాజ ధర్ముని యొక్క ఆదేశము ననుసరించియే వచ్చితిని. ధన్యోస్మి" అని నివేదించు కున్నాడు.

విరూపాక్షమహారాజు ఈ బ్రాహ్మణుని పరిశీలించి చూచినాడు. అతనిపై ఖరి కొంత శంకించినాడు. అతడు అధముడని గ్రహించినాడు.

"మీది ఏకులము? ఏమి విద్యల నభ్యసించినారు? మీ వృత్తి ఏమిటి? ఉన్న సంగతి తెలియ జెప్పండి" అని అడిగినాడు. ఆయన తన వృత్తాంత మంతయు ఏమియు దాచకుండ చెప్పుకున్నాడు. రాజు అతని చరిత్ర సాకల్యముగా విన్నాడు. సంతోషించాడు. "సరే! ఇతడెట్టి వాడైన నాకేమి? నాడీజంఘునికి మిత్రుడు. అంతే! ఆయన స్నేహితుడగుటయే ఒక గొప్ప విశేషము." అని అనుకొని ఆతని కాతిథ్య మిచ్చుటకు నిశ్చయించుకొన్నాడు. ఆయనకు ఆహారాదులయం దేలోపమును జరగ కుండ జాగ్రత్తగానిర్వర్తించ వలసినదని తగిన వారిని నియమించాడు.

మరునాడు కార్తికపౌర్ణమి. ఆనాడు వేల కొలది బ్రాహ్మణులు బంగారు పళ్ళెరములలో పంచభక్ష్య పరమాన్నములతో రాజుగారి ఇంట భోజనము చేసెదరు. బహుళమైన దక్షిణలు గ్రహించెదరు. ఆసద్బ్రాహ్మణులతోపాటు మనబ్రాహ్మణుడుకూడా ఆహ్వానింపబడినాడు. ఇతనినికూడ అత్యంతాదరముతో, మహా భక్తి శ్రద్ధలతో పూజించి సంతృప్తికరమైన భోజనాదులు నడిపించి, అతను భుజించిన బంగారు పళ్ళెరముతోకూడ, మోయగలిగినన్ని బంగారు రాశులూ, రత్నసంచయములూ రాజుగారు బహూకరించారు.

మన బ్రాహ్మణుని సంతోషమునకు మేర లేదు. ఈ బంగారుమూటలు మెడమీదనుండి భుజముమీదికి, భుజముమీదనుండి మెడమీదికి బరువు మార్చుకుంటూ మోయలేక మోయ లేక శ్రమపడుతూ చిన్నగా నాడీ జంఘుని నివాసస్థానమునకు తిరిగి రొజుకుంటూ వచ్చాడు. తన కృతజ్ఞతను తెలియపర్చుకున్నాడు. కొక్కెర వానినిచూచి అపరిమితానందమును పొందినది. అతని ఆయాసము తీర్చుటకు తన విశాలమైన రెక్కలే వీవనగా చల్లనిగాలి విసరినది. రాత్రి తిరిగి సుఖమైన ఆహారము, సమర్పించి విందుచేసినది. రాత్రి ప్రొద్దుపోవుటవలన తానుకూడ సుఖముగా నిద్రపోయినది.

ఒక రాత్రిలో బ్రాహ్మణునికి మెళుకువ వచ్చినది. కొక్కెర సుఖముగా నిద్రపోవు చున్నది. "తెల్లవారగానే తిరిగి అడవులబట్టి పోవలెను. రేపు నాఆకలి ఎట్లు తీరును? ఈ మహారణ్య మధ్యమున నాకు భోజనము ఎట్లు లభించును? ఈ బంగారమూ, ఈరత్న రాశులూ నా ఆకలి తీర్చగలవా? ఈ మహాబకము మిక్కిలి బలిసి ఉన్నది. శరీరము బాగుగా క్రొవ్విఉన్నదే. ఎంతమోమాంసముపడును. మంచి రుచిగాకూడ ఉండగలదు. ఇప్పుడు దీనినిచూచిన, ఒడలుమరచి నిద్రపోవుచున్నదిగదా! దీనిని చంపి ముక్కలు చేసి తీసికొని పోయినచో నా ఆకలి తీరును గదా!" అను దుర్మార్గపు ఆలోచన ఆదుష్ట బ్రాహ్మణుని మనసున తట్టినది. అట్లు చేయుటకే నిశ్చయం చేసుకున్నాడు. తక్షణమే లేచి బట్ట గట్టిగా కట్టుకున్నాడు. నడుము బిగించుకున్నాడు. ఒక దుడ్డుకర్రను గ్రహించి, రెండు చేతులతోను గట్టిగా పట్టుకుని గాఢ నిద్రలో

ఉన్న ఆకొక్కెర మెడమీద ఒక్క దెబ్బకొట్టి దానిమెడ విరగగొట్టినాడు. అది చచ్చువరకు తన బలము యావత్తు ఉపయోగించి అనేక పర్యాయములు తల చితుక పొడిచినాడు. ఎంతో ఆనందముతో దాని ఈకలనుపెరికి పారవేసినాడు. చర్మం వొలిచివేసినాడు. పొట్టనూ ప్రేగులనూ ఊడదీసి పారవేసినాడు. భక్ష్యయోగ్యమైన మాంసమునంతయు ప్రోగుపెట్టి మూట గట్టుకున్నాడు. తెల్లవారుతూ ఉన్నది. మూట భుజాన్నవైచుకొని బయలుదేరినాడు.

ఇంక ఇక్కడ మధువ్రజపురములో దానవ రాజుకు పాలబారినది. ఏమి కీడుమూడనున్నదో అని చింతించనారంభించాడు. ఇంతలో జాము ప్రొద్దెక్కినది. నాడీ జంఘునిపై తలపు మిక్కుటమైనది. "నా ఇష్టసఖుడైన రాజధర్ముడు ఎల్లప్పుడును ఉదయముననేవచ్చి ఎంతయో స్నేహము నెరపుచుండు వాడే! నేడు ఎందులకు రాలేదు? ఈ బ్రాహ్మణుడు గుణహీనుడు. ఏదైన దౌష్ట్యము తలపెట్టలేదుకదా! నాకీ తలపు ఎందుకు కలుగవలెను! నా మనస్సు కలత పడుతూ ఉన్నదే! బకపుంగవుడైన నాడీజంఘుడేమైపోవునోకదా!" అని పదేపదే విలపించాడు. అతనిని వెదకి తీసుకొని రావలసినదని కొందరు భటులను ఆజ్ఞాపించాడు.

ఆభటులు శీఘ్రంగా వెళ్ళి, నాడీజంఘుని వెంట్రుకలనూ, ప్రేగులనూ కనుగొని రాజునకావార్త ఎరుకపరచి తిరిగి ఆ బ్రాహ్మణునివెదకి పట్టుకున్నారు. అతని రెక్కలు విరిచికట్టి తెచ్చి రాజు ఎదుట నిలువబెట్టినారు. "ఈకృతఘ్నుని ఇట్లు సమీపమునకు తీసుకురావద్దు. వానిని చంపి భక్షించండి" అని రాజు రాక్షసభటులను ఆజ్ఞాపించాడు.

"ఛీ! ఛీ! ఈ పాపపు శరీరమును తినుటకు మేమంత నీతిమాలినవారమా? వీని మాంసము భుజించుటవలన మాకు మాత్రము పాపము చుట్టుకొనదా?" అని ఆ నరమాంస భోజనులు నిరాకరించినారు.

"తినండి! మానండి! ఇంకేమైనా చేయండి. ఈ దుష్టుణ్ణి నాఎదుటకు తీసుకొని వచ్చితిరేమి? వాని ముఖము చూచుట పాపముకాదా! తీసుకొనిపొండి!" అని రాజు అన్నాడు.

అప్పుడారాక్షసులాతనిని ఊరివెలుపలకు తీసుకువచ్చారు. ఆతనిచర్మము చీల్చివేసినారు. శరీరములోని కండలన్నియు కోసివేసినారు. నెత్తురులు ఒడలినుండి కారిపోవుచుండగా వానిని తన్ని పడద్రోసినారు ఆతని రక్తమును, మాంసమును అక్కడి కుక్కలు చూచినవి. వానిని తినవలెనను కుతూహలముతో సమీపించినవి. కాని సందేహించినవి. కుక్కలుకూడ వానిని తిననోల్లక వెనుకకు తగ్గిపోయినవి.

అవును నిజమే! అది అంతే! కృతఘ్నుని శరీరముయొక్క మాంసమును కుక్కలుకూడ తినుటకు అసహ్యించుకొనునని వేదములు ఘోషించుచున్నవి. అది ఇక్కడ నిజమైనది. వెక్కివెక్కి ఏడ్చుచూ నాడీ జంఘుని కళేబరమును తెప్పించి దానవరాజు తన మిత్రులతో కూడి అత్యంత గౌరవంతోను, ప్రేమతోను అగ్నిసంస్కారము చేయించినాడు. అంతలో అక్కడికి దేవేంద్రుడు వేంచేయగా దానవపతి ఆయననుచూచి, ఎంతో సంభ్రమముతోను, వినయముతోను గౌరవముచేసినాడు. కనులవెంట అశ్రుధారలు కారుచునేయున్నవి "నాడీ జంఘుని వంటి ఇష్టసఖుని పోగొట్టుకొనిన నా

[తరువాయి 57 వ పేజీలో]

స్త్రీ - పాతివ్రత్యము

శ్రీ సోమంచి నరసింహశాస్త్రి బి.యస్ సి., బి.యిడి.,

'జాయే దస్తం'అను ఉపనిషద్వాక్యము స్త్రీయొక్క నిజస్వరూపమును తెలుపుచున్నది. అందువలన ఆమెకు సంఘములో స్థానమెచట, నే విధముగా నమరి యున్నదో విశదమగుచున్నది. ఆ కారణము వలననే స్త్రీని 'గృహలక్ష్మి'యని పెద్ద లనియుందురు. "ఇంటిని చూచి యిల్లాలిని చూడుము"అను నార్యోక్తికూడ నాకారణము వలననే వచ్చియుండ వలయును. ఈవిషయమును పాశ్చాత్యులు సైత మంగీకరించిరి. అంతియేకాక స్త్రీని ఆరాధనదేవతగ ప్రపంచము నందలి మానవకోటి యంతయు నంగీకరించినది. ఎందుచేనన, ఆమె సృష్టికి ప్రధాన పాత్ర. ఆమెలేనిచో సృష్టిలేదనియే చెప్ప వలయును—సృష్టి అనునది ప్రకృతి లక్షణము గావున. ఆమె ప్రకృతి స్వరూపముగ నిర్ణయింపబడినది—అందు వలన స్త్రీకి 'జిజ్ఞాస'అవసరము లేకపోయినది.


ప్రకృతియు సహనశక్తి కలది యైసహజసౌందర్య మునకు తగినట్లుగా రమణీయమైన దృశ్యముల నేర్పరచి, తదనుగుణములైన రావములను కల్పించి, మనోరంజకములైన సుగంధములను వెద జల్లి, విసిగి వేసారి తన్నాశ్రయించిన యాత్రికుల మార్గాయాసమును పోగొట్టి నూతనమైన ఉత్సాహము, చైతన్యము మొదలు గాగల ధర్మములను వారిలో పునరుద్ధరింపజేసి గమ్య స్థానమును సునాయాసముగ చేరుటకు సహకరించు చున్నది. అట్లే స్త్రీయు, సహజమైన సహనమునకు వన్నె తెచ్చు అందమునకు తగిన రీతి చక్కని వస్త్రముల ధరించి సువాసనల తోకూడిన పుష్పములచే నలంకరించు కొని, వీణా నాదమును మరపించు కంఠముతో వీనుల కింపుగానుండు వసంతరాగ మాలాపించుచు, జిజ్ఞాస వలని హృదయభారముతో నేగుదెంచిన హృదయనాథుని కెదురేగి, స్వర్గముతో తుల్యమగు నిజగృహమున కాహ్వా నించి, మైమరపించి, అతని కానందమొన గూర్ప ప్రయత్నింప వలెను. అందువలన ఆమె అతని పురో గమనమునకు సహకరించును. అందులకే స్త్రీనిపురుషుని యొక్క 'సహధర్మచారిణి'అని చెప్పియున్నారు పూర్వీ కులు. అంతే కాక తనస్వామి'అర్ధము'నకైపాటు బడు టచే స్త్రీ పురుషుని'అర్ధాంగి'అయినది కదా!

అట్టిస్థితిని పొందుటకు స్త్రీ నియమ బద్ధయైయుండ వలయును. అట్లుండుటకు ఆమె కొంత పరిశోధన కావింప వలెను. అట్టి పరిశోధన గావించుటకై బుద్ధి సూక్ష్మత నొందుటకు తగిన విద్యనేర్పవలెను. విద్యవలన వినయమును పొందవలయును. వినయము వలన తగిన పాత్రత లభ్యమగును. అట్టిపాత్రత వలననే స్త్రీ తనస్వరూ పమును తానుతెలిసికొని స్వధర్మాచరణమునకు మార్గా న్వేషణమొనరించుట కుద్యుక్తురా లగును.

అందుచే తగుపాత్రతబొందురీతిని విద్యనభ్యసించ వలయునే గాని, వక్రమార్గములకు దారితీయు విద్యను స్త్రీ అభ్యసించరాదు కదా! అనగా స్త్రీ హృదయనాథుని గృహమును తనకై వసముగావించు కొనురీతిని ప్రబోధించు విద్యను నేర్పవలెను.

అట్లు తగినసంస్కారమునొంది స్త్రీ పై చెప్పిన రీతి నాచరణలో బెట్టుటకు ఆరంభింప వలయును. అందువలన ఆమెకు తనస్వామిపైమక్కువ యేర్పడును. ఆ మక్కువ క్రమముగా భక్తిగామారును. ఆ భక్తియొక్క పరిణామమే ప్రేమకదా! అనగా స్త్రీ తగిన సంస్కారమును విద్యవలన బొంది, ఆసంస్కారము నాచరణలో చూపి, తత్ఫలిత ముగా ప్రేమను లేక భగవంతుని కనుగొనుచున్నది. అది యొక 'చిత్తవ్యవస్థ' కాదా! అట్టి చిత్తవ్యవస్థ'యే 'పాతివ్రత్యము'అని పిలువబడు చున్నది. ఈసిద్ధాంతము యావత్ప్రపంచము నామోదించుచున్నది. దానికి జాతి, మత, కులభేదములు లేవు. అందువలననే "స్త్రీ రత్నం దుష్కులా దపి"అని మనపెద్దలు చెప్పియుండవలయును.

పాతివ్రత్యముగల స్త్రీలు'పతివ్రత'లు. వారే'స్వయం సిద్ధ'లు. అట్టివారు పురాణకాలమున సావిత్రి, అనసూయ, సీత, అరుంధతి మొదలైన వారు మన కాదర్శ మహిళలుగ అగపడుచున్నారు. వారుదైవమును కూడ తమ యధీనమం దుంచు కొనినట్లు మనము విని యున్నాముకదా! అందుచే ప్రస్తుత కాలమున గల స్త్రీలు కూడ నావిధముగకీర్తిని పొందునట్లు కృషిసలిపెదరుగాక:



1954 లో బ్రహ్మపుత్రానదిలో వరదలు వచ్చినప్పుడు డిబ్రుగర్ పట్టణం జలప్రళయ ప్రమాదానికి గురి అయింది. పట్టణంలో చాల భాగం వరదల వల్ల విశిష్టమై పోయింది. నదీ ప్రవాహం భూభాగాన్ని గ్రసించకుండా కాపాడడం కోసం ప్రభుత్వం తక్షణమే కొన్ని చర్యలు తీసుకోడానికి నిశ్చయించింది. కేంద్ర జలవిద్యుత్తు కమిషను వారు పట్టణ సంరక్షణ కోసం ఒక పథకం తయారుచేశారు. 200 అడుగుల పొడుగు ఉన్న పరిణాను కొయ్యతో నిర్మించిన గోడలనూ, 400 అడుగుల పొడవు ఉన్న ఒక రాతి గోడను, 200 అడుగుల పొడవువున్న నాలుగు రాతి గోడలనూ నిర్మించడం యీ పట్టణ రక్షణకార్యక్రమంలో ఒక ముఖ్యాంశం. రాతి గోడలన్నీ యథా నిర్ణీతంగా ఇది వరకే నిర్మించబడ్డాయి. ఆ గోడలప్రక్కన పేరుకొన్న ఒండ్రు మట్టిని చూస్తే ఇవి వరదలను ఏ విధంగా నిలవరించిందీ విశదమౌతుంది.

ఇక్కడ కట్టిన యీ కట్టడాలవల్ల పట్టణం భద్రంగా సురక్షితంగా నిలుస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్గింది. పట్టణాన్ని రక్షించడానికి జరిగిన యీ భగీరథప్రయత్నంలో, నగరంలోని ప్రతి వ్యక్తీ తోడ్పడ్డాడు. ఈ సందర్భంలో ఏనుగులు కొయ్యదుంగలను చేరవేస్తుండగా తీసిన ఫొటో.



డిబ్రుఘర్‌ను వరదలనుండి నివారించడానికి కాలేజీ విద్యార్థినులు బ్రహ్మపుత్ర ఒడ్డున గోడకు మట్టి ఎత్తుచున్నారు.

దిగులుతో దీపావళి

"శ్రీ లింగిశెట్టి చిరంజీవి"

"పోస్టు ... ప్లీజ్ .... పోస్టు"

"ఒసేవ్ .... శ్యామలా ! ... ఉత్తరమేవ్ ! "

"మాట వినగానే. తినేతిండి అల్లానేవదలి వెంటనే వచ్చింది శ్యామల.

"ఏదిరా చిన్నీ.... వుత్తరం?"— ఆ మాటతోనే తను కూడా తరుముకు వచ్చింది. ఏదో అనుకోకుండానే అపరిమితానందం ఒక్కసారి ప్రజ్వరిల్లింది.

"కాకి ఎత్తుక పోయిందిలే ... పో! ... అంటూ వుత్తరము లాక్కు పోయింది నిర్మల"

"ఉత్తరం కోసం వుప్పొంగిన ఆనందం ఉక్రోషంగా మారి "ఆ! వేళాకోళం" అంటూ నిర్మలను చంచి పళ్ళెం వద్దకు వెళ్ళేసరికి ! తనుపెంచుతున్న కుక్కపిల్ల అన్నం తింటూవుంది. ఆగలేదు చేసేదిలేకతన గదిలోకివెళ్ళింది. అంతలోనే అక్కకొట్టిందీ....అని అమ్మతో ఫిర్యాదుకు వెళ్ళింది చిన్ని నిర్మల.

"అమ్మా ! అక్కకొట్టిందిచూడవే ! బావరానని వ్రాశాడని నన్నుకొట్టిందే...." పరుగెత్తింది అమ్మ దగ్గరకు.

"దీన్నెందుకుకొట్టావేతల్లీ!" అంటూ,"వూరుకోనాన్నా మీ బావ వచ్చిన తరువాత చెప్పుదుగాని ఏడవకు" అని సముదాయించింది.

"ఇవ్వాళ మాబావ వస్తాడుగా మెత్తగా దెబ్బలు కొట్టిస్తాగా" అంటూ గంతులేస్తుంది నిర్మల. అమ్మ ముసిముసిగా నవ్వు కుంటూంది.

"ప్రక్కింటి విమలమ్మ వదినగారి అల్లుడు వచ్చాడటగా! అతగాణ్ణి యీ బాబు ఎప్పుడు బయలు దేరుతాడని అడిగాను. నాకు తెలియదన్నాడు యీ బస్తీదొర."

'వదినగారిచంటి నిన్ను రమ్మంది.' అన్నది అమ్మ— నేను వెళ్ళనేఅంటూ గిర్రున వెనక్కు తిరిగింది శ్యామల.

తన కూతురు అవస్థ అర్థంకాలేదు మాణిక్యమ్మకు.

"తెల్లవారు ఝాము మెయిలులోనైనా రావచ్చమ్మా. అంటూ తనూ ఒకమూల కుర్చీలో చతికిలపడింది.

నెలరోజులక్రితం అతగాడు వ్రాసిన కార్డు శ్యామల దృష్టిలో పడింది దగ్గర మంచంకోడు మీద.

"నేను తప్పక పండుగకువస్తాను. ఆఫీసు పని హడావిడివలన రెండురోజులుమాత్రమే సెలవుపెట్టి రాగలను"

యీ అక్షరాలు మళ్ళీ మళ్ళీ చదివి ఆ ఆఫీసు అధికారుల్ని మనస్సులో పదేపదే తిట్టుకుంది. తన వ్రాతని బట్టి చూస్తే తెల్లవారురుఝాము తప్పక రావచ్చు.

మరునాటి ఉదయం నిర్మల ఏదో ఆట లాడుతూ వస్తాడేమాబావ అంటూ గంతుతూ వుంది.

అంతలో మెయిలు వెళ్ళినట్లుగా వుంది శ్యామలా అంటూ పంపువద్దకు వెళ్ళింది మాణిక్యమ్మ.

ఏమిటే అమ్మా రైలు ఈ రోజు రాలేదు. పండుగ సెలవే అంది నిర్మల. దానితోఅందరు పక్కున నవ్వారు.

"తొలిపండుగనాడు విశేషంగా అల్లుణ్ణి మనయింట్లో చూచే భాగ్యం యీ తఫా లేనట్లుందమ్మా" అన్న మాట వినేసరికి శ్యామల హృదయం మరీ నీరైంది.

"ఓహో బావా ఎప్పుడొచ్చావ్ ! నాకేమి తెచ్చావు" అంటూ అప్పుడే బడినుంచి వచ్చిన బాబు గదిలోకి వెళ్తూ ఎదురయిన అమ్మనుచూచి "అమ్మా ! పడుకుందిఅక్కచే బావ అను కున్నా ! అమ్మా ! బావొచ్చాడే? ఎక్కడకు వెళ్ళాడే?" అన్నాడు.

ఉద్యోగం చేసే అల్లుళ్ళతో యింతేనమ్మా అంటూ ప్రక్కింటి సీతమ్మ తన యింట్లోకి వెళ్ళింది.

ఆమాటకు మరీదిగులు విపరీతమయింది శ్యామలకు.

"అమ్మాయి ప్రొద్దు పోతూందే ప్రమిదలు నీళ్ళలో వేయి" అంటూ శ్యామలనునిద్రలేపింది మాణిక్యమ్మగారు.

యిక సాయంకాలము, చీకటిపడింది. నిర్మలా, బాబు అంతా మందులు కాలుస్తున్నారు. యింటా బయటా దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. శ్యామల హృదయంలోమాత్రం చీకటి.

ప్రక్కింటి సీతమ్మ యింట్లో పాట వినిపిస్తూవుంది.

"నమ్మరాదే చెలీ.... మగవారినిలా నమ్మరాదే చెలీ "

మనస్సులో వారు పొంగలని, నమ్మక ద్రోహులని, ఆశలు నిరాశలుచేస్తారని, ఎన్నో దుర్దేశ్యాలు రేకెత్తినవి

బయట చూడలేక వూరికేవుండలేక మనోమందిరము లోని అంధకారము తలచుకొని ఆవస్థపడసాగింది.

"అమ్మోయ్ బావే ... బావొస్తున్నాడే అంటూ యింటి వైపువచ్చే వంపెద్దుబండినిచూస్తూ గంతులేస్తుంది నిర్మల.

తీరా వెళ్ళి చూచేసరికి ఆవీధి చివర సుందరమ్మగారి ఆయిదవ అల్లుడు ముకుంద జబ్బులోకూడా వచ్చాడు.

యిదంతా చూచేసరికి శ్యామలకు విపరీతంగా మనస్సులోని అంధకారం ఎక్కువై, నోరంతా చేదని పించింది.

చక్కగా పన్నీరుతో సరదాగా ముచ్చటగా గడప వలసినరోజు తలనొప్పి మందులతో గడుపవలసి వచ్చింది

"అమ్మా వాళ్ళసరోజకు, వాళ్ళబావ నెక్‌లెస్ తెచ్చాడే నాకేదీలేదే" అంటూ మరలావెళ్ళింది నిర్మల.

"అమ్మా సరోజ వాళ్ళఅక్కయ్య బావతో సినిమాకు వెళ్తుందే" అంటూ వాళ్ళకేసిచూస్తూ నుంచుంది. నిర్మల.

ఇక మాణిక్యమ్మగారు అదొకయిదిగా అయిపోయింది యింటిఅల్లుణ్ణి చూదామనివచ్చిన అమ్మలక్కతో సమాధానం చెప్పడంతోనే సరిపోయింది మాణిక్యమ్మకు.

మరునాడు మధ్యాహ్నం "పోస్టు" అనేసరికి నిర్మల వెళ్ళి అందుకుంది కార్డు.

"ఆఫీసులోఅవసరములైనపనులవల్లరాలేకపోయాను. యీ ఒక్కవాక్యం చూచేసరికి శ్యామలకుమతి పోయింది.

"అల్లుడు దగ్గరనుంచా ! అమ్మాయి కార్డు !—" అంది ప్రక్కింటి సీతమ్మ.

అవునమ్మా ! యింతకీ నాఅల్లుడు క్రొత్తసంవత్సరం తొలిపండుగకు రాలేక పోవటం నాకేమంత సందర్భంగా లేదమ్మా అంటూ ఒక్క నిట్టూర్పు విడిచింది.

"అయ్యో ! యీ ఆఫీసులన్నీ యింతేనమ్మా : తల్లీ ! నా తొలిరోజుల్లో ఓనాడు అర్ధరాత్రి ఆఫీసు జవానువచ్చి అయ్యగారు పిలుస్తున్నారు అంటే మావారు వెళ్ళారు," అంటూ చనిపోయిన తనభర్తగార్నివర్ణిస్తుంది ప్రక్కింటి సీతమ్మ. వీళ్ళందరి మాటలూ శ్యామలకి ఉత్సాహం కలిగించలేదు అలాగే గడచింది "దిగులుతోదీపావళి" ★

పెద్దవాళ్లున్నారుగా!

"విజయ"

సాయంత్రం నాలుగున్నర అయింది. కాలేజీనుంచి వచ్చి యీజీఛెయర్‌లో కూచున్నాను. డ్రెస్ మార్చటానికికూడా బద్ధకంగావుంది. అందులో యీవేళ స్టూడెంట్స్‌చేసిన అల్లరి భరించటానికి శక్యం కాకుండా పోయింది. పాఠమేమీ అవలేదు. అబ్బ! ఏంస్టూడెంట్స్!!

టెక్స్‌ట్‌బుక్ అందుకునే ప్రయత్నంలో టేబిల్‌మీదకి వంగాను. రెండు కవర్లు కనిపించాయి. ఆత్రంగా తీసి చూశాను. ఒకటి లలిత వ్రాసింది.

"..ఈవూళ్ళోనే బోర్డు స్కూల్లో టీచర్‌గా ఎపాయింటయ్యాను. ఆర్డర్ వచ్చి నాలుగురోజులైంది. నా జీవితంలోని యీ ఆఖరి ఆశయంమట్టుకు ఫలించింది. ఇంతకంటె ఆశించదగినదేమీ యికఉండదు...." పాపం! లలితకి సుఖపడాల్సిన వయసులోనే ఎంత నిరాశ! రెండో కవరు అమ్మ వ్రాసింది. అమ్మకి ఎంత బెంగ! కళ్ళమ్మట నీళ్ళుతిరిగాయి. అక్కడికి సెలవలికి వెళ్ళినా వచ్చేసేరోజునల్లా దిగులుగావుంటుంది. వారం రోజుల్లో నాన్నగారు వస్తున్నారని వ్రాసింది. ఉత్తరం నిండా అమ్మ నా గురించి పడిన దిగులు స్పష్టంగా కనిపిస్తోంది. నీళ్ళునిండి కళ్ళు మసకలు కమ్మాయి. కిటికిలోనుంచి బయటికి గార్డెన్‌వేపు చూశాను. కళ్ళనీళ్ళమూలాన ఎఱ్ఱగులాబీలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

"నమస్తే! రండి" అన్నాను చేతులుజోడిస్తూ.

లోపలికి వచ్చాడు. కో-లెక్చరర్ గోపాల్. అమ్మ నాతోపాటు పంపినవంటావిడ దుర్గమ్మ టీతీసుకువొచ్చింది. గోపాల్‌కొక కప్పుయిచ్చి నేనొకటి తీసుకున్నాను.

గోపాల్ ప్రస్తుతం హోటల్లో వుంటున్నాడు. తండ్రి వాల్తేరులో రిటైర్డ్ తాసిల్దారు. ఏభైఎకరాల భూమికూడా వుంది. గోపాల్ అంటే తల్లిదండ్రులకి పంచప్రాణాలూ నట. హడావిడిగా మన మాటలకి టైము యివ్వకుండా మాట్లాడుతాడు గోపాల్. సిటీఅంతా వకసారి తనతో తీసికొని చూపించాడు. లెసన్స్ ఎంత చక్కగా చెపుతాడనీ! అతని క్లాసులో మళ్ళీ చదవాలనిపిస్తుంది. ఈ మాటే అతనితో అంటే "ఆర్ట్సుదానివేగా నువ్వు! ఇప్పుడు నాక్లాసులో సైన్సు గ్రూప్ లోచేరు" అన్నాడు నవ్వుతూ.

వారంరోజుల క్రిందట వచ్చినప్పుడు చెప్పాడు తను పెళ్ళిచేసుకోవా లనుకున్నానని. ఏడాదినుంచి లేనిది యివ్వాళ పెళ్ళి ప్రసక్తి ఎందుకు తీసుకువచ్చాడు అనిపించింది. నా గుండెలు దడదడ కొట్టుకున్నాయి

నాచేతిని తనచేతిలోకి తీసుకుంటూ "విజయా! నేనంటే నీకిష్టమేనా? ఎన్నాళ్ళబట్టో అడగా లనుకుంటున్నాను. మన యిద్దరి వుద్దేశాలూ కలిస్తే యిక అడ్డేముంది? మా నాన్నగారు నాయిష్టానికి అడ్డుచెప్పరు. నేనంటే వారికి చాలా ప్రేమ. మా అమ్మకూడా నీలాంటి 'పిల్ల'ను చూస్తే సంతోషిస్తుంది. నీ వుద్యోగానికి మన మారేజ్ యేమీ ప్రతిబంధక మవదు. ఏమంటావ్?" అన్నాడు. నాచెయ్యి వణికింది. నేను ఫ్లవర్‌వాజ్‌కేసి చూస్తూ "వద్దండీ. నేను పెళ్ళి చేసుకో దల్చుకోలేదు. హాయిగా యిల్లాగే వుద్యోగం చేసుకుంటూ ఉండాలని వుంది" అన్నాను. నాగొంతుకూడా వణికింది.

"నేనిల్లా అడుగుతానని నువ్వు అనుకోలేదుగదూ! నేను నీకు తగినవాణ్ణి కాననిపిస్తోందా?" అతని కళ్ళు మెరుస్తున్నాయి. నేనేమీ సమాధానం చెప్పలేదు. అతను నాజవాబుకోసం ఎదురుచూసి నిట్టూర్చి వెళ్ళిపోయాడు. ఎందుకో నాకు యీ మగవాళ్ళని చూస్తే భయం.

అంతే. మళ్ళీ యివాళవచ్చాడు. కాలేజీలో కనపడినా యీ వారంరోజులూ పలకరించలేదు. కాలేజీలోకూడా అతనూ నేనే తెలుగువాళ్ళం. మొదట్లో యితనుతెలుగులో పలకరించగానే ప్రాణం లేచివచ్చింది. మన ఆంధ్రా ఒకడైనా వున్నాడని. పెళ్ళిమాట ఎత్తకుండావుంటే బాగుండుననీ అనిపించింది గోపాల్ని చూస్తే.

ఇదంతా ఆలోచిస్తూ నేను నిశ్శబ్దంగా కూచున్నాను. సంభాషణ యెల్లా మొదలుపెట్టాలో నాకర్థంకాలేదు.

"విజయా! నేనడిగినదాని కేమంటావ్?" అన్నాడు గోపాల్ నిశ్శబ్దాన్నిఛేదిస్తూ. నేను ఒకక్షణం ఆగి "లలిత జీవితాన్ని ప్రత్యక్షంగాచూసిన నేను మగవాళ్ళంటేను, పెళ్ళిమాట ఎత్తుతేను భయపడటంలో వింతేముంది?" అన్నాను. లలిత ఎవరో అర్థంగాక నావేపుచూశాడు గోపాల్. నేను చూపు మరలించుకుని "ఔను. లలిత మీకెలా తెలుస్తుందిలెండి" అన్నాను.

ఫ్లవర్‌వాజ్‌లోని రోజాపువ్వుల వాసన సన్నగా ముక్కుకి తగిలింది.

"మా పెదనాన్నగారికి యిద్దరు కొడుకులు. పెద్దన్నయ్య చేతికందగానే పొలాలబాధ్యతని సగం పెద్దన్నయ్యమీద పెట్టేశారు. చిన్నన్న శేఖరంమటుకు పదమూడేళ్ళకి సెకెండుఫారంలో జాయినయ్యాడు పక్క టౌన్‌స్కూల్లో. అంతా పల్లెటూరి చదువులు. మా పెద్దమ్మగారికి శేఖరం అంటే చాలా ప్రేమ. పెద్ద చదువు చదువుతున్నాడని.

మా నాన్నగారు నన్ను ఎకనామిక్స్ ఆనర్స్‌కి వెళ్ళమని ఎడ్వైజిచ్చారు. అందువల్ల సైన్సు వొదులుకుని ఆర్ట్సులోకి దిగాను. నేను ఫోర్తియర్ చదువుతుంటే నాకంటె ఆరేళ్ళు పెద్దవాడైన శేఖరం బి.కాం. సెప్టెంబర్‌కి కూచున్నాడు.

శేఖరానికి నేనంటే యిష్టం. ఫార్వర్డ్‌గా చదువుతున్నానని తనకి గర్వంగావుందనేవాడు. అందువల్ల నాకెప్పుడూ ఉత్తరాలు రాస్తూండేవాడు. నాక్కూడా పెద్దన్నయ్య కంటే శేఖరంఅంటేనే యిష్టంగా వుండేది. ఫోర్తియర్ అయ్యాక సమ్మర్‌లో మాపెద నాన్నగారు, శేఖరం ఒకసారి వాళ్ళఊరు రమ్మనివ్రాశారు. వాళ్ళమాట తీసెయ్యటమెందుకని బయల్దేరాను. వాళ్ళవూరికి రెండు మైళ్ళు స్టేషన్. అందుకని బండీ తీసుకువొచ్చాడు శేఖరం. "ఈ మూడేళ్ళలోను ఎంతఎదిగావ్ విజయా!" అన్నాడు శేఖరం ఆశ్చర్యంగా. ఇంటికి చేరేప్పటికి పన్నెండు గంటలయింది. ఇంకా ఎవరూ భోంచెయ్యలేదు. పెదనాన్నగారువచ్చి "ఏమమ్మా! రైలు లేటయిందా?" అని పలకరించారు. పెద్దమ్మగారికీ, పెద్ద వొదినకీ యివ్వమని అమ్మ యిచ్చిన చీరెలూ అవీ యిచ్చాను. పెద్దవొదినవెనకాలే యింకో అమ్మాయి కనపడింది.

"ఆ అమ్మా యెవరు వదినా?" అన్నానునేను కదంబ మాల వొదిన కిస్తూ.

చామనచాయ కోలమొహం. మెళ్ళో ఒక పేట గొలుసు. ఇంకేమీ నగల్లేవు. సన్నగా పొడుగ్గావుంది. ఆకళ్ళలోమటుకు మంచి ఆకర్షణవుంది. పెద్ద అందగత్తెమటుకుకాదు.

"మా పెత్తల్లి కూతురు విజయా! నేను మొన్న వెళ్ళినప్పుడు నాతో తీసుకువచ్చాను" అంది వదిన.

ఆ అమ్మాయిపేరు లలిత. చురుకైన పిల్ల కావటం చేత సాయంత్రంలోపున నాతో స్నేహం కలిపింది. తన సంగతులన్నీ చెప్పింది. తనిప్పుడు స్కూల్‌ఫైనల్ చదువుతోందిట. తండ్రి బోర్డుస్కూల్లో మాథమాటిక్స్ అసిస్టెంటుట. అప్పట్లో తను థర్డ్‌ఫారం చదివి మానేసిందిట. ఒక యేడాది తల్లీ తండ్రీ పెళ్ళిచెయ్యాలని సంబంధాలు చూశారుట. ఆస్తిపాస్తులేమీలేవు. కట్నం ఎక్కువ యివ్వలేరు. ఇంతలో హటాత్తుగా తల్లి పోయింది. అందుకని మళ్ళీ ఫోర్తుఫారంలో జాయినయ్యింది. నాయీడుదే.

"ఈయేడాది పేసయాక ట్రెయినింగ్‌కి వెడతాను" అంది లలిత నాతో. సాయంత్రం షికారుగా యిద్దరం తోటవేపు వెళ్ళాం. మా వెనకాలే శేఖరం వొచ్చాడు. "ఎల్లావుంది విలేజ్ బ్యూటీ!" అన్నాడు నవ్వుతూనాతో. నేను శేఖరంకేసి చూసేప్పటికి శేఖరం లలితమీంచి దృష్టి మరలించుకుంటున్నాడు. లలిత నాకేసి చూసింది. దూరాన కోయిల సన్నగాకూస్తోంది. మేమింటికి తిరిగి వచ్చేటప్పుడు చెప్పింది లలిత నాతో, శేఖరం తనని ప్రేమిస్తున్నాడని. తననితప్ప యింకెవర్నీ చేసుకోనని చేతిలో ఒట్టువేశాడుట ఈమాటలు చెబుతున్నప్పుడామె

మబ్బుల్లో ఎగిరిపోయే పక్షిలాగా అవుపించింది. నిజమే. శేఖరం ఆమెని ఉదారబుద్ధితో చేసుకుంటే ఆమె చాలా సుఖపడుతుంది. చాలా నెమ్మదస్తురాలు. నేను చాలా సంతోషించా ఆవిషయానికి. కట్నంమటుకు వాళ్ళేమీ యివ్వలేరు. శేఖరం తనతో చెప్పిన ప్రతిమాటా నాతో చెప్పింది. పిచ్చిపిల్ల ! నేను తనకి సోదరిలాగా కనిపిస్తున్నానుట. శేఖరం ఒక రోజు తను సీబ్లూకలర్ చీరె కట్టుకుంటే చాలా బావుందన్నాట్ట. అందుకని ఆ వాయిల్ పెటిలో జాగ్రత్తగా దాచుకుందిట. ఆమె నిర్మల స్వభావానికి నేను సంతోషించాను. ఆరోజు రాత్రే కాబోలు ఎందుకో మెళకువచ్చి చూస్తే పక్కన లలితలేదు. చూస్తే మేడమెట్ల దిగువని లలితా శేఖరం కూచునివున్నారు. వాళ్ళ ప్రేమ కంతరాయం కలిగించడమెందుకని వెనక్కివచ్చి పడుకున్నాను.

ఆ తర్వాత అక్కడ వారంరోజులున్నాను. ఇంక ఆవూళ్ళోవుండటం చికాకుగా వుంది. యింకో రెండు రోజు లుండి బయల్దేరాను. లలిత తనకుత్తరాలు వ్రాస్తుండమని ఎడ్రస్ యిస్తూ నా ఎడ్రస్ అడిగింది. "మళ్ళీ నీ మారేజ్‌కే నిన్నుచూడటం" అన్నా నవ్వుతూ. లలిత తలవంచుకు నవ్వింది.

ఆ తర్వాత నాకు వారానికో ఉత్తరం వ్రాసేది లలిత శేఖరం తనకి లెటర్స్ రాయటం సంగతికూడా. ఏదో పనిమీద వెడుతూ వాళ్ళ యింటికి వెళ్ళాట్ట శేఖరం. ఓ వారంరోజులున్నాడుట. వస్తూ సీబ్లూకలర్ జార్జెట్ ఎంచి తనకి పట్టుకొచ్చాడుట. ప్రతి అక్షరంలోను వాళ్ళిద్దరి ప్రేమ స్పష్టంగా కనపడేట్టు వ్రాసేది లలిత. స్కూల్‌ఫైనల్ పాసయింది. ట్రెయినింగ్‌లో సీటు వచ్చింది లలితకి.

ఫిఫ్తియర్ ఎగ్జామినేషన్స్ అయిపోయాయి. నా బాధ్యత పూర్తయింది. ఇక రిజల్ట్స్‌కోసం వెయిట్‌చెయ్య సాగాను. ఒకనాడు అమ్మ పెద్దమ్మగారు ఉత్తరం రాశారని చెప్పింది. శేఖరానికి ఎవరో పదిహేనువేలు కట్నమిస్తామని వచ్చారుట. సంబంధం సెటిల్ చేసుకున్నారుట. పిల్లకూడా బావుందని రాసింది ఆవిడ. నేనుతెల్లబోయాను. శేఖరం ఎల్లా వప్పుగున్నాడు దీనికి ? తను కూడా కట్నమాశించాడా ? నాకేం అర్థంఅవలేదు. "మీ అన్నయ్యలాంటివారు లోకంలో చాలా అరుదు" అంటూ రాసే లలితకేం జవాబిస్తాడు శేఖరం ? లలిత తన ఆశా సౌధాలన్నీ శేఖరం అనే పునాదిమీద కట్టుకుంది. అవన్నీ కూలదోస్తాడా ?

అమర్నాడే నాకు శేఖరం వ్రాసిన కవరు అందింది. అందులో పెళ్ళికూతురు సంగతి నిండిపోయింది. "విజయా ! ఆ పిల్ల ఎంత బాగుంటుం దనుకున్నావ్ ? ఆ కళ్ళు బెదిరిపోతున్న లేడికళ్ళను గుర్తుకు తెస్తున్నాయి. ఆ అమ్మాయిపేరు 'ఉమ'ట. ఎంత బాగుందీపేరు...." ఈ ధోరణిలో వుంది వుత్తరం అంతా. దాన్ని వుత్తరం అనేకంటే 'ఉమాదేవి వర్ణన' అంటే బాగుంటుందేమో. కోపంతో చింపి అవతల పారేశాను. ఎంత ద్రోహం.

వారానికో లెటర్ వస్తూండేది శేఖరం దగ్గర్నుంచి. రానురాను నాకు శేఖరం మీద అసహ్యం ఎక్కువవుతోంది. ఆ సమ్మర్‌లోనే పెళ్ళి. నేను రానన్నాను. కాని నాన్నగారి బలవంతంమీద బయల్దేరాను. పెళ్ళిలో నేనా ఉమవేపు చూస్తూఉంటే శేఖరం నాకేసి చూసి నవ్వాడు. అంత అందమైన భార్యని సంపాదించుకున్నానని గర్వంకాబోలు. మర్నాడు అందరం కూచుని వుండగా ఆ అమ్మాయివచ్చి నాదగ్గిరకూచుంది. అందరూ ఆమె వేపే చూస్తున్నారు పెళ్ళికూతురుగదా అని. ఆమె నావేపు తిరిగి "ఏమండీ ! మీరు నాకు వదిన అవుతార్టగా. నాకెవరు ఏయే వరసలవుతారో అన్ని సంగతులూ యీయన తెగవ్రాసేవారు. పెళ్ళి కాకక్రితమే ఉత్తరాలు వ్రాసుకోవటం మొదలు పెట్టాం మేము" అంది. అందరూ నవ్వారు. దీనితో ఆమె ఓ వెకిలిమనిషి క్రింద తేలింది. లేకపోతే అందరిలోనూ ఎవరేనా యిల్లాంటి సంగతులు చెబుతారా ?

రిజల్ట్సు తెలిశాయి. నాకు క్లాసు వచ్చింది. శేఖరానికి కూడా ఎల్లాగో ఒకలా బి.కాం. కంప్లీటయింది. బళ్లారిలో ఉద్యోగం అయింది. నేను నాన్నగారి కోర్కెప్రకారం అన్నికాలేజీలకి అప్లయిచేశాను. ఇక్కడనుంచి ప్రిన్సిపాల్ టెలిగ్రాం యిచ్చాడు యింటర్వ్యూకి రమ్మని. నేనే సెలెక్టయినాను. అమ్మ దూరాభారమని వొద్దులుకోమంది. కాని నేను, నాన్నగారు ఆమెని ఒప్పించాం. శెలవులు ఎప్పుడెప్పుడా అని అమ్మ ఎప్పుడూ కాలెండరు చూస్తూ వుంటుంది.

శేఖరం వుత్తరాలు వ్రాయటం మానలేదు. తనావూరి

నించి ఉమకి పంపే బహుమతుల జాబితాలు, తనకి ఆ 'ఖర్డుపారం గ్రాడ్యుయేట్' రాసే సంగతులు చక్కగా ఏరికూర్చి కవర్లు నింపేవాడు. శేఖరం కవర్లు కొన్ని నేను అసలు విప్పనేలేదు. లలిత గాలిమేడలిట్లా కూల్చి వేసి ఆమెని నాశనం చేశాడు శేఖరం. ఆమెని యిక యేక్షణంలోనూ తల్చుకోడు. ఇక తర్వాత లలితకి ఒకే ఒక ఆశయం వుండేది. ఏస్కూల్లోనైనా టీచరుగాచేరితే రిటైరైన తండ్రీ, తనూ కాలక్షేపం చేయవచ్చునని. ఇవ్వాళే ఆసంగతి వ్రాసింది. అక్కడే టీచరు పోస్టు కాళీగా వుంటే అందులో జాయినయిందట!

అలారం టైంపీస్‌ని దీక్షగా చూస్తున్న గోపాల్ నాకేసిచూసి "విజయా! అందరూ శేఖరంలాంటివాళ్ళే వుంటారా? నేనుకూడా నిన్ను మోసగిస్తున్నాననుకుంటున్నావన్నమాట. ఏం?" అన్నాడు. అతని మొహం చాల గంభీరంగావుంది. ఆతనిలో యింత సీరియస్‌నెస్‌ని నేనెప్పుడూ చూడలేదు. గదినంతా చీకటి. ఆక్రమిస్తుండటంచేత లేచి లైటు వేశాను. బయటవిడుస్తున్న సన్నజాజి మొగ్గలవాసన గాలిలో తేలివస్తోంది. గోపాల్ లేచాడు. "చూడు విజయా! లోకంలో అందర్నీ భగవంతుడొకే విధంగా పోతపొయ్యలేదు. నా నిశ్చయమేమిటో నీకు త్వరలోనే తెలుస్తుంది. గుడ్‌నైట్." మెట్లుదిగి వెళ్ళిపోయాడు. నేనూ వెనకాలే గేటువరకూ వెళ్ళాను దూరాన ఏవో బిల్డింగ్స్ దీపాలతో ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. దుర్గమ్మ వచ్చి పిలిచాకగానీ లోపలికి వెళ్ళాలనితోచలేదు. మాటిమాటికీ మనస్సులో "గోపాల్‌కి బాగా కోపం వచ్చిందా? యింకరాడా?" అన్న ప్రశ్నలే మెదులుతున్నాయి.


మర్నాడల్లా గోపాల్ అసలు కనిపించలేదు. ఎవరో అతను ఆవేళ లీవ్ పెట్టాడని చెప్పారు. నాకళ్ళు మటుకు కాలేజీలో ప్రతిరూమూ వెతికాయి.

ఆవాళ శనివారం. కాలేజీలేదు. నాన్నగారు ఎల్లుండి వస్తారు. ఏమీ తోచలేదు. నాలుగవగానే లేచి చీరెల షాపుకి బయలుదేరాను. రకరకాల సిల్కుచీరెలు పడేస్తున్నాడు ఎదురుగా. అమ్మకి ఒకటి కొనాలి. లలితకి ఒకటి కొనాలి. లలితకి ఏకలర్ సూట్ అవుతుంది? తళుక్‌మని ఎదురుగా సీబ్లూ కలర్ పట్టుచీరె మెరిసిపడింది. అసలే ఆమెది గాయపడిన హృదయం. నేనుకూడా యింకో దెబ్బవెయ్యాలా? అనిపించింది. చివరికి రెండు చీరెలు ఎంచి ఆదారినే పోస్టాఫీసుకువెళ్ళి పార్శెలు చేసేశాను లలితకి. హాల్లో అడుగుపెట్టగానే ఎవరో పెద్దమనిషి యీజీఛైయిర్‌లో పడుకుని కనిపించాడు. ఏభై ఏళ్ళపైన వుంటాయి. తలంతా నెరిసి వెండిలా మెరుస్తోంది. సన్నగా పొట్టిగా పండు రంగులో వున్నాడు. ఆయన టకీమనిలేచికూచుని "రా తల్లీ! నీకోసమే చూస్తున్నాను. నీకోసమే ఆ వాల్తేరునుంచి బయలుదేరి వచ్చాను. ఎంత దూరంలో వున్నారే అమ్మా! వాణ్ణికూడా యింతదూరం వొద్దురా అంటే విన్నాడు కాదు. పైగా నాకు నచ్చినపిల్ల యిక్కడుంది. ఆ అమ్మాయితో మాట్లాడి పెళ్ళికివప్పించి వెళ్లకపోతే నేను ఈదారినే ఫారిన్ పోతాను' అని బెదిరిస్తూ వుత్తరం రాస్తాడూ! నువ్వో పెంకిఘటాని వన్నట్టు రాశాడు. నీలాంటి మంచి తల్లి ఎన్నడైనా పెంకితనం చేస్తుందా? వంటావిడ మీయింటి సంగతులన్నీ చెప్పిందమ్మా!"

ఇంతసేపటికి అర్థమైంది. ఈయనే గోపాల్ తండ్రి రిటైర్ తాసిల్దారుగారు ఇదా గోపాల్ చేసిన పని? కాలేజీలో యీనాలుగు రోజులూ మూతి ముడుచుకుని తిరిగాడు నాకేసైనా చూడకుండా! ఇంతదూరం యీ వృద్ధుణ్ణి నన్ను వప్పించటానికి రప్పించాడు! సరిగ్గా నాకు తగ్గవాడు గోపాల్ ఆపూటంతా రానేలేదు ఈయన బాధ్యతంతా నామీదే పడేశాడు రిటైర్డ్ తాసిల్దారుగారు వాళ్ళయింటి సంగతులన్నీ చెప్పినవే చెబుతున్నాడు మధ్యమధ్యలో నాలాంటి పిల్లనుచూస్తే సంతోషంగా వుంటుందన్నాడు. ఓసారి "ఏమ్మా! మా గోపాల్ నీకు నచ్చలా?" అంటాడు. ఏంచెప్పేదీ? నాన్నగారు ఎల్లుండి వొస్తారని చెప్పాను. ఆయనతో మాట్లాడి మరీ వెళతానన్నారు.

సాయంత్రమయింది. నెమ్మదిగా తాసిల్దార్‌గారులేచి డ్రెస్ చేసుకొని తాతాయిన్‌స్టిట్యూట్ చూసి వస్తానని బయల్దేరి వెళ్ళారు దుర్గమ్మ కోసిపెట్టిన సన్నజాజులు గార్డెన్‌లో కూచుని దండకడుతున్నాను నీరెండ బంగారపు నీరుపోసినట్టుంది. గోపాల్ గేటుతోసుకుని నవ్వుతూ వొస్తున్నాడు. ఎన్నడూ ఎరుగని సిగ్గు ఆవహించింది నన్ను. మెల్లిగా వచ్చి ఎఱ్ఱ గులాబీ చేతికిస్తూ "ఏమంటావ్ విజయా!" అన్నాడు.

"మానాన్నగారు కూడా రెండురోజుల్లో వొస్తారనుకుంటాను పెద్దవాళ్ళున్నారుగా!" అన్నాను నేను.



శ్రీరంగ నీతు లెన్నో
నోరూరఁగ నెవ్వఁడైన నుడువఁగ వచ్చున్
ధీరత్వమ్మున నుడివిన
తీరున నొనరించు నతఁడె ధీనిధి సుమతీ!

దోషం బుండిన వారికి
రోషము పుట్టించు శతక రూపిణి యగు మా
భాషా వధూటి, ఆ యమ
దూషణ భూషణల కెల్లఁ దొలఁగదు సుమతీ!

పెద్దల తప్పుల చేఁతల
నొద్దికతో మెచ్చుకొంట యొప్పఁట, వానిం
దిద్దం దలపెట్టినచో
గద్దఱితన మనెడిపేరు గల్గునె? సుమతీ!

వెలయాలిని, అగసాలెను
వెలమను నమ్మకు మటంచు వివరించెఁ గదా!
తొలి సుమతి - శతక రచయిత,
ఖలు లేకులమందు నైనఁ గలుగరె? సుమతీ!

అల్లుని మంచితనంబును
గొల్లని సాహిత్య విద్య కోమలి విజమున్
తెల్లని కాకులు నుండుట
కల్లగఁ దలపోయ భ్రమము గాదా? సుమతీ!

మును దేవదాసి యను నది
జనియించెను దేవసేవ సలుపుట కొఱకై
దినములు గడచిన నదియే
చనవున వెల-వెలఁది యయ్యె "ఛా" యన సుమతీ


వెలయా లను నొక నెలఁతుక
గలుగుట మహిళావమాన కారణ మనుచున్
తెలిసికొని శాసనమ్మున
వెలలింపం దగును సానివృత్తిని సుమతీ!

కామమ్మున నేమమ్మును
నామమ్మున కైన లేక నాశ మొనర్పన్
కామిని వెలయాలినిఁ గని
ఏమని పల్కంగ నగునొ యెఱుఁగుమి సుమతీ!

కళయన నడివీథిం బడి
గలగల మని యెగిరి, మ్రొగ్గి, కను ద్రిప్పుటయా?
వెలఁదికి నిది తగనిది యని
కలుషమ్మని బోధచేయఁ గడఁగుమి సుమతీ!

కళయను పేరం జరిపెడు
కలుషిత కర్మమ్ము నెంతకాలము దనుకన్
తలయొగ్గి పులుముకొనవలె?
తలగల వారద్ది దిద్ద ధర్మము సుమతీ!

———



పద్మాంకితులు




పద్మభూషణ్ శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి

మద్రాసు రాష్ట్రంలో ప్రముఖ సాంఘిక సేవికగా పేరెన్నికగన్న శ్రీమతి డాక్టర్ ఎస్. ముత్తులక్ష్మి రెడ్డి 1912 లో ఎం. బి. సి. ఎం. డిగ్రీ సంపాదించింది. ఈ పరీక్షలో స్త్రీలు ఉత్తీర్ణులై పట్టభద్రులు కావడం అదే మొదటిసారి. నాటినుంచి శ్రీమతి ముత్తులక్ష్మిరెడ్డి సాంఘిక సేవలో నిమగ్నురాలై ఉంది. 1913 నుంచి అనాథ స్త్రీ శరణాలయానికి కార్యదర్శిగానూ, 1916 లో సాంఘిక సేవా సంస్థ ఏర్పడిన ప్పుడు కార్యదర్శిగానూ పనిచేసింది. శ్రీమతి అనిబిసెంట్, శ్రీమతి మార్గరెట్ కజిన్సులతో కలిసి 1918 లో ఆమె మద్రాసులో భారతీయ మహిళా సంఘం నెలకొల్పింది. ఆమె నేటికీ భారతీయ మహిళా సంఘం అధ్యక్షత వహిస్తోంది. 1940 వరకు అఖిల భారత మహిళా మహాసభకు ఆమె అధ్యక్షురాలుగాను ఉపాధ్యక్షురాలు గాను పనిచేసింది. 1926 లో ఆమె మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలుకు ఉపాధ్యక్షురాలుగా ఎన్నికైంది. మహిళా శిశు సంక్షేమం కోసం ఆమె మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ లో ఎన్నో శాసనాలను ప్రవేశపెట్టి ఆమోదం జరిపింది. [illegible]

పద్మభూషణ్ శ్రీమతి రుక్మిణీ [illegible]

శ్రీమతి రుక్మిణీదేవి పండిట్ నీలకంఠశాస్త్రిగారి కుమార్తె. థియొసాఫికల్ సొసైటీ అధ్యక్షులయిన డాక్టర్ జి. యస్. అరండేల్ సతీమణి. ప్రపంచ ప్రసిద్ధమైన నర్తకుడు అన్నా పావ్లోవా వద్ద రష్యన్ నృత్యంలో శిక్షణ పొందారు. సంగీత, నాటక, నృత్య కళలలో ఆమె పరిశోధనలు సాగించారు. విదేశాలలో పర్యటించి అనేక ప్రదర్శనలు ఇచ్చారు. భరత నాట్యం, సంగీతం, చిత్రకళలో ప్రావీణ్యాన్ని సంపాదించి భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవన కృషిలో మహోన్నత పాత్రను నిర్వహించారు. "డాన్స్ అండ్ మ్యూజిక్", "[illegible]" అనే ఇంగ్లీషు గ్రంథాలను, "[illegible]" "[illegible]" మొదలయిన తమిళ గ్రంథాలను ప్రచురించారు. ఆమె రాజ్యసభ సభ్యురాలు.





పద్మవిభూషణ్

శ్రీ చందూలాల్ మాధవలాల్ త్రివేది

మన ఆంధ్ర గవర్నరు. సమర్థుడైన పరిపాలకునిగా పేరెన్నికగన్నవారు. ఆంధ్ర గవర్నరు పదవి స్వీకరణకు పూర్వము వీరు అన్ని రంగాలలోను, రాజకీయాలలోను పనిచేసి అనేక బాధ్యతాయుతమైన పదవులను నిర్వహించారు. ఒరిస్సా గవర్నరు హోదాలో సుమారు 5 మాసములు, పంజాబులో ఆరు సంవత్సరములు పనిచేశారు.

పద్మభూషణ్

శ్రీ కర్నల్ సి. కె. నాయుడు

వీరు భారత క్రికెట్టు ఆటగాండ్రలో ప్రముఖ స్థానము నలంకరించినవారు. సి. కె. అనే పేరుతో వ్యవహరించబడే ఈయన (కొఠారి కనకయ్య నాయుడు) క్రీడా రంగంలోను, ఇతర రంగాలలోను హిందూ దేశపు పేరు ప్రతిష్ఠలను దేశాంతరములలోకూడ ఇనుమడింపచేసిన ఆంధ్రుడు.

పద్మ శ్రీ

శ్రీ స్థానం నరసింహారావు

వీరు ఆంధ్ర దేశంలోనున్న నటకులలో అగ్రగణ్యులని ప్రశంసింపబడినవారు. ఈయన వయస్సు 55 సంవత్సరాలు. సుమారు 35 సంవత్సరాలకు పైగా ఈయన ఆంధ్ర నాటకరంగంలో స్త్రీ పాత్రలను ధరించి సాటిలేని మేటి నటునిగా వన్నెకెక్కినారు. విశాలాంధ్రలో ఈయన పేరు తెలియనివారు లేరు. ఈయన సాహితీ పరుడు. కళలు, నాటకములకు సంబంధించిన అనేక సభలకు అధ్యక్షత వహించినారు. ఈ కళోపాసనకు ఈ బిరుద ప్రదానము పాత్రమెరిగిన దానమే.

రాష్ట్రపతి బిరుదులను గ్రహించిన ప్రముఖులందరకూ ఆంధ్ర మహిళ అభినందలను శుభాకాంక్షలను అందజేయుచున్నది.

మీకు తెలియునా?

ఇండియాలో ఏటా 60 వేల టన్నుల జీడిపప్పు ఉత్పత్తి అవుతున్నది. జీడిపప్పు ఎగుమతి వ్యాపారంలో ఇండియాదే అగ్రస్థానం. ఇండియాలో ఉత్పత్తి అయే జీడిపప్పు నూటికి 75 వంతుల జీడిపప్పును అమెరికా బ్రిటన్లు దిగుమతి చేసుకుంటున్నాయి.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక కింద 40 లక్షల ఎకరాల భూమిలో భూసార సంరక్షణ కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈ సందర్భంలో 70 లక్షల ఎకరాల భూమిని సర్వే చేయడం జరుగుతుంది. ఈ కార్యకలాపాల నిర్వహణకు సుమారు 5 లక్షల 5 వేలమంది సిబ్బంది అవసరమౌతారని అంచనా వేయబడింది.

ఇండియాలో స్వాతంత్ర్య ప్రాప్తి కాలం నాటికి 3,324 తంతి కార్యాలయాలు ఉండగా, ఇప్పుడు 5 వేల కార్యాలయాలు ఉన్నాయి. రైల్వేల నిమిత్తము, ఇరిగేషను ప్రాజెక్టు ప్రాంతాల నిమిత్తమూ 4000 తంతి కార్యాలయాలు ఏర్పాటు చేయబడ్డాయి.

1947, 1951 సంవత్సరాల మధ్య పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల సంఖ్య నూటికి 30 నుంచి 40 వరకు పెరిగింది. ఇటీవల అట్టి విద్యార్థుల సంఖ్య నూటికి 50 వంతులు పెరిగింది.

★



ఆంధ్ర సోదరీ!

శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి

మంచిని పెంచుమమ్మ ! పర
    మార్థపు జీవిత రాచబాటలో
అంచిత కీర్తినిర్మలత
    యే పరిపూర్ణత గొల్పునమ్మ ! ఆ
చంచల చిత్తవృత్తి మన
    సా విడనాడి సతీమతల్లివై
గాంచుము శాశ్వతంబు లగు
    చక్కనిస్థానము ఆంధ్ర సోదరీ !

అమ్మడు ! విద్యనేర్చుకొను
    మా ! నవభారత రాజ్యతంత్రివై
ఇమ్మహి 'ఆంధ్ర నారి'యను
    యీప్సితమున్ నెరవేర్చుమమ్మ ! నీ
కమ్మని మాతృగర్భమున
    గౌరవనీయుల గాంచిపెంచుమా !
అమ్మడు ! నిన్నుబోలు మహి
    ళామణు లుందురె ! ఆంధ్ర సోదరీ !

శాంతము మానినీమణికి
    చక్కని ఆభరణంబు ! శీలమే
కాంతకు జీవనంబు పతి
    గౌరవమే సతిభోగభాగ్యముల్
అంతయు నికుపుట్టుకతో
    అబ్బగజేసెను [illegible]
సంతతిమున్ వికాసమున
    చల్లగవర్ధిలు ఆంధ్ర సోదరీ !

సంక్షేమం



మెహరాలీ సంక్షేమ విస్తరణ ప్రణాళికలోని మదనగిరి కేంద్రమును ఇరాన్ చక్రవర్తిని సందర్శించారు.
ఆ కేంద్రములో తయారైన చేతిపనులను కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు
శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చక్రవర్తినికి చూపించుచున్నారు.

ANDHRA MAHILA SABHA

NURSING HOME

REPORT FOR JANUARY 1956

MATERNITY WARD

No. of Patients admitted for Deliveries	85
„ „ Medical cases treated	5
„ „ Gyneac and Abortion	15
„ „ Ante-natal	18
„ „ Post Natal	2
„ „ normal deliveries	74
„ „ abnormal deliveries	11
„ „ babies	87
Grand total	212

IN-PATIENT MATERNITY

No. of patients Delivered		85
„ „ normal Deliveries		74
„ „ abnormal Deliveries	Twins 3 Breach 3 forceps 5	11
Total		85

OUT-PATIENT DEPARTMENT

No. of Surgical cases	90
„ „ Medical cases	849
„ „ Ante-natal cases	235
„ „ Post-natal cases	118
„ „ Gyneacological cases	146
„ „ E.E.N.T. cases	46
Total No. of New patients	1484
Total No. of Old patients.	1257
Grand Total	2741

NURSES' TRAINING CENTRE

Out of 60 candidates undergoing the auxiliary training 30 will be completing their course in July 1956. 30 candidates sponsored by the Central Social Welfare Board have been taken in this year and have started their training. The Andhra Government have promised to sponsor 30 more candidates.

Mrs. LAKSHMI PARVATHI
Secretary and Convenor

Mrs. A C. KRISHNA RAO
Administrative Secretary

Dr. M. PAVANABAI
Medical Superintendent

పూర్ణిమ

మానసికారోగ్య శాస్త్రవేత్త డాక్టర్ కె. కె. మసానీ, తన అనుభవములోని ఒక వింత సంఘటనను విశదీకరిస్తున్నారు :

ముగ్గురుపిల్లల తల్లి పూర్ణిమ అదేపనిగా ఆగకుండా వచ్చే ఎక్కిళ్ళతో వారం రోజులుగా యమయాతనపడి, ఆఖరికి డాక్టర్ దగ్గరకి వెళ్ళింది! కాని ఈ వ్యాధికి శారీరక సంబంధమైన లోపం ఏమీ డాక్టర్‌కి కనుపించలేదు. ఆఖరికి ఈ ఎక్కిళ్ళకి కారణం చాలా స్వల్పవిషయమనీ, నవ్వు పుట్టించేదనీ, ఆయన తెలుసుకున్నాడు.

ఒకనాటి మధ్యాహ్నం ఒంటిగంటకి పూర్ణిమ తన అత్తగారితో భోజనం చేస్తుండగా ఈ ఎక్కిళ్ళు ప్రారంభమైనాయి. ఆనాడు ఉడకపెట్టిన మాంసం, కాయగూరలు, చపాతీలుచేశారు. పూర్ణిమ చపాతీలు కడుపునిండా తిని కుర్చీకిజేరపడి ఆపసోపాలుపడుతూ కూర్చుంది.

"కొద్దిగా చపాతీలు తిను పూర్ణిమా" అందిఅత్తగారు.

"కడుపునిండా తిన్నాను. ఇంక వద్దు అత్తగారూ!" అంది పూర్ణిమ.

"ఒద్దంటావేమిటి ? చపాతీలు ఒంటికి చాలా మంచిది" అన్నది అత్తగారు,

"కడుపునిండా తిన్నాననీ, ఇంక తినలేననీ పూర్ణిమ మళ్ళీ చెప్పింది.

"అల్లా అంటావేమిటీ, ఒక్కనరంలా ఉన్నావు — నువ్వు చపాతీలు బాగా తినాలి!" అని నిలదీసింది అత్తగారు.

ముగ్గురు పిల్లల తల్లిఅయిన పూర్ణిమ తాను ఎన్ని చపాతీలు తినవలెనో తనకి తెలియదా అనుకొంది. కాని అత్తగారు అంతసులభముగా వదలిపెట్టేటట్లులేదు. ఆఖరికి అత్తగారులేచి "తిను ! ఎందుకు తినలేవో చూస్తాను" అంది.

భారతీయ సంఘాచారం ప్రకారం అత్తగారి మాటలకి ఎదురాడకూడదని ఆఖరికి పూర్ణిమ ఒక చపాతీని సగానికి చీల్చి నోట్లో పెట్టుకోబోయింది. ఇంతలోనే ఉపద్రవంగా ఎక్కిళ్ళువచ్చి ఆచపాతీముక్క పళ్ళెంలో పడిపోయింది. ఒక్కక్షణంపాటు అత్తాకోడ ళ్ళిద్దరూ ఒకరివైపు ఒకరు కొరకొరా చూసుకున్నారు. అంతలోనే కొంచెం తేరుకొని పూర్ణిమ పడిపోయిన చపాతీ ముక్కని తిరిగి తినడానికి తీసుకుంది. కాని భగవంతుని దయవల్ల తిరిగి తెరలుతెరలుగా ఎక్కిళ్ళు అందుకొన్నాయి!— ఇంక చపాతీలు తినే ప్రశ్నేరాదు! పూర్ణిమే ఆనాటికి నెగ్గింది : కాని ఎంత కష్టంమీద? ఇక చపాతీలు బలవంతంగా తినకూడదనే ఆలోచన ఆమెకు తెలియకుండానే ఆమె మనస్సులోనుండి ఎక్కిళ్ళరూపంగా బయలుదేరి, చపాతీలను బహిష్కరించడంలో విజయాన్నే సాధించాయి. కాని మాటిమాటికీ మోటుతనంగా బలవంతం చేసే అత్తగారి మీద కోపం, ఈ కోపంతో మలినమైన ఆమె అంతరాత్మ మొత్తంమీద ఇవన్నీ కలసి అవి విపరీత పరిస్థితికి దారి తీశాయి !

పైలక్షణాలు, బాధలు ఏలావున్నా వీటివల్ల కొంత లాభంకూడా కలుగక పోలేదు. అంతవరకూ పూర్ణిమని తన ఇష్టం వచ్చినట్లు దెప్పిపోస్తూ, ఆమెను ఒకబానిసగా చూస్తున్న అత్తగారు, ఈ వదలకుండా వచ్చే ఎక్కిళ్ళని చూస్తూ, ఇవి ఏ ముప్పుని తెచ్చిపెడతాయోనని కొంచెం భయపడి క్రమంగా తనకి తెలియకుండానే కోడలు పైన సానుభూతికూడా చూపించడం మొదలు పెట్టింది—అంతే తక్షణం డాక్టర్‌కి కబురు పంపింది. ఆమె భర్త కూడా పూర్ణిమను ఇది తెమ్మనీ అది తెమ్మనీ వేధించడం తగ్గించాడు.

కంటికి కట్టినట్లు కనుపించే ఈ లక్షణాల్ని డాక్టర్ పూర్తిగా అర్థంచేసుకొని, ఇదేమంత ఆదుర్దా పడవలసిన జబ్బుకాదనీ, నిపుణులైన వైద్యులు ఆమెను పరీక్షించి ఈ నిర్ణయానికి వచ్చారనీ, తనకు ఇష్టం లేకపోయినా, అత్తగారి పట్టువల్ల చపాతీలను బలవంతంగా నోటిలో కుక్కుకొనే ప్రయత్నాన్ని తనకి తెలియకుండానే తన చిన్న మెదడు వ్యతిరేకించడం వల్లనే ఈ ఎక్కిళ్ళు బయలుదేరినాయనీ, అత్తగారు చేసే జులుంని ఎదిరించాలనే ఒక కోరిక దీనికితోడు పడిందనీ, ఇకముందు దీనిని గురించి ఆదుర్దాపడ నవసరం లేదనీ, ఆమెతో డాక్టరు



చెప్పారు. డాక్టరుగారు యథార్థ విషయము వివరంగా చెప్పే ఈ కొద్దిక్షణాలలో ఎక్కిళ్ళు ఎడమెడంగా రావడం, పదినిమిషాల తరువాత అవి పూర్తిగా తగ్గిపోవడం గమనించ వలసిందని ఆయన పూర్ణిమను హెచ్చరించారు. అంతేకాక ఇటుపైన తన అధికారాన్ని చలాయించకుండా తన తల్లికి గట్టిగా చెప్పవలసినదిగా ఆమె భర్తతో తాను చెప్పినట్లూ, ఇటుపైని ఆలాంటిదేమీ జరుగదనీ, అందుచేత ఎక్కిళ్ళు తిరిగిరావనీ ఆమెతో ఆయన చెప్పారు— తరువాత పూర్ణిమ భర్తతో కులాసాగా ఇంటికి వెళ్ళిపోయింది.

ఈ విధంగా రెండువారాలు ప్రశాంతంగా గడచినాయి డాక్టర్ తన ఆస్పత్రిలో పనిచేస్తుండగా "ఔట్ పేషెంట్ వార్డులో ఎవరో ఎక్కిళ్ళతో బాధ పడుతునట్లు ఆయనకు వినిపించింది. ఆ ఎక్కిళ్ళ చప్పుడు ఇంతకు ముందు ఆయన విన్నకంఠమే? "మళ్ళీ ఆ అత్తగారు బలవంతంగా తనకోడలిచేత చపాతీలు తినిపించలేదు గదా!" అనుకొన్నాడు డాక్టర్! ఆ రోగిని పరీక్షించగా, ఎక్కిళ్ళు క్రిందటిరోజు మధ్యాహ్నం భోజనాల వేళ ప్రారంభమైనట్లు డాక్టర్ తెలుసు కున్నారు. తన అత్తగారితో భోజనం చేస్తుండగానే తిరిగి ఇవి బయలుదేరాయట!

"ఏమిటండీ! తిరిగి మీ అత్తగారు మీచేత బలవంతంగా చపాతీలు తినిపించడానికి ప్రయుత్నం చేశారా!" అని ఆశ్చర్యంతో ప్రశ్నించారు డాక్టర్.

"కాదండీ; చపాతీలుకావు; నిన్నను భోజనంలో సోమాసీలు తయారు చేశాము. అప్పటికే నేను నాలుగు సోమాసీలు తిన్నాను, ఇంక తినలేనని ఎంతచెప్పినా మా అత్తగారు "అవి చక్కగా మాంసంతో ఉడికించి చేసినవే, ఒంటికి మంచివి తిను!" అని మరీ పట్టుపట్టారు. ఎంత చెప్పినా ఆపిడవినలేదు! నేను ఇంకొక సోమాసీ తినాలని ప్రయత్నించాను అప్పటితో తిరిగి ఈ ఎక్కిళ్ళు ప్రారంభమయాయి!" అని పూర్ణిమ డాక్టర్‌తో చెప్పింది.

"తాను ఇదివరలో చేసిన ప్రకారం ఈసారికూడా చేసి ఈ ఎక్కిళ్ళని తగ్గించగలనా?" అనేసందేహం డాక్టర్‌కి కల్గింది. ఈ పర్యాయం ఆశ్చర్యకరమైన పద్ధతిని కనిపెడితేకాని ఇవి తగ్గవని ఆయన అనుకున్నారు. అంతసులభముగా అవి తగ్గుతాయనే నమ్మకంకూడా ఆయనకిలేదు! అందుచేత ఆయన పూర్ణిమభర్తను పిలిపించి, తానెంతో కోపంగా వున్నట్లు నటిస్తూ, "ఈవిధంగా మీతల్లి మొండిపట్టుతోకోడలిచేత చపాతీలు, సోమాసీలు, ఇంకా ఎవేవో తినిపిస్తూ తనదగ్గరికి అడుగడుకీ తీసుకువచ్చి, తనకాలం వ్యర్థం చేస్తే ఇటుపైని తానుచూడననీ, ఆలాంటి బలవంతం చేయనని మాటఇస్తేనే ఈపర్యాయం పరీక్షచేస్తా" నని అతనితో చెప్పారు పూర్ణిమ భర్త డాక్టర్ కోపం చూసి. చాలా భయపడి ఇటుపైన పూర్ణిమ ఆహారం విషయంలో తన తల్లి ఏవిధంగానూ కలుగజేసుకోకుండా తాను చేస్తానని డాక్టర్‌కిమాట ఇచ్చాడు. తెచ్చి పెట్టుకున్న తనకోపం, దానిద్వారా పూర్ణిమ భర్తలో వచ్చినమార్పు వీటివలన ఆ సమయంలో ఎక్కిళ్ళు తగ్గడం డాక్టర్ గమనించి, తక్షణం అత్తగారిని తీసుకురావలసిందిగా పూర్ణిమ భర్తని ఇంటికి పంపించారు. ఈ పర్యాయం ఇక బలవంతంగా తిండి తినిపించడం వుండదనీ, ఇక ఎక్కిళ్ళు రావనీ పూర్ణిమకి డాక్టర్ మాట ఇచ్చారు.

పూర్ణిమ అత్తగారిని డాక్టర్ దగ్గరికి తీసుకువచ్చారు. ఇంతగొడవ జరుగుతుందని తాను అనుకోలేదని, ఇటుపైని తన కోడల్ని ఇష్టంలేని తిండి తినమని బలవంతం చేయననీ. పూర్ణిమ ఇష్టాను సారమే జరుగు తుందనీ అత్తగారు డాక్టర్‌కి మాట ఇచ్చింది.

తనకోడల్ని దయతోను, ప్రేమతోను చూడాలని డాక్టర్ ఆమెకు చెప్పారు. అత్తగారు తప్పక అలాగేచేస్తానని మాట ఇచ్చింది. పూర్ణిమ డాక్టర్ దగ్గర నుంచి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. మళ్ళీ ఎక్కిళ్ళతో తిరిగి రానంది!

ప్రథమ పట్టణారోగ్య సమితి

కలకత్తా

ప్రామాణికమైన ఆరోగ్యసేవా కార్యక్రమమునకు ఏర్పాట్లు

కలకత్తా నగరంలో ప్రథమంగా పటణ ఆరోగ్య సమితి తమ కార్యక్రమం ఈ సంవత్సరమే పారంభింపనున్నది. ప్రామాణికమైన ఆరోగ్యసేవ చేయుటకు భారతదేశంలో ఇదే మొదటి సంస్థ. ఈ ఆరోగ్యసమితి నిర్మాణపథకము భారత ప్రభుత్వమూ, యునైటెడ్ నేషన్స్, వరల్డ్ హెల్తు ఆర్గనైజేషను, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వము, కలకత్తా కార్పొరేషనుల సమిష్టి ఆధ్వర్యమున ప్రతిపాతింపబడినది. ఈ పథకం యొక్క తొలి పెట్టుబడి పదిహేను లక్షలరూపాయిలున్నూ, నిర్వహణమునకు ఏటేటా ఎనిమిది లక్షలరూపాయిలున్నూ ఖర్చగునని అంచనాలు వేయబడినవి. కలకత్తా కార్పొరేషను, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వముల ప్రతినిధులున్నూ భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వశాఖ కార్యదర్శియున్నూ సమ్మతి పత్రంపై దస్కతులు చేసి ఈ పథకానికి ఒకరూపం కల్పించారు. ఆసుపత్రులు ప్రయోగశాలలు, ఆఫీసులు, ఉద్యోగులవసతులు మొదలైనవానిని నెలకొల్పుటకు భవనములు దాదాపు పూర్తిఅయినవి.

భారతదేశపు పల్లెప్రాంతాలలో ప్రస్తుతం అనేకఆరోగ్య కేంద్రములు కృషిచేయుచున్నవి. అత్యంత ప్రజోపయోగంగా దినదినాభివృద్ధినీ, ప్రజామోదాన్ని పొందుతూ అక్కడి ప్రజల ఆరోగ్య ప్రమాణమును హెచ్చు చేసేందుకు కట్టుదిట్టమైన సాధనాలుగా ఉన్నప్పటికీ, పట్టణ ప్రాంతాలలోని ప్రజలనిమిత్తం ఆరోగ్య సంఘములు ఇంతవరకు స్థాపించబడలేదు. ఇండియాలో ఇటువంటి వానిలో ఇదే మొదటిది.

కలకత్తా నగరంలోని 24వ వార్డు 'చెట్లా' ప్రాంతమును ఈ ఆరోగ్య కేంద్రం స్థాపించడానికి ఎంచుకున్నారు. ఈ ప్రణాళిక ఆ ప్రాంతంలోని మొత్తం పదమూడు వేల కుటుంబాల యొక్క అరవై ఎనిమిదివేల జనాభాకు ప్రయోజనకారిగా ఉంటుంది. ప్రామాణికమైన ఆరోగ్య సంక్షేమ సేవలు. ఈ ప్రత్యేకమైన ఏర్పాట్ల వల్ల జరుగుతాయి. కార్మికులు, గర్భిణీస్త్రీలు. శిశువులు, సుఖరోగబాధితులు, క్షయరోగులు, కుష్ఠువ్యాధిపీడితులు, మొదలైనవారి విషయమై ప్రత్యేకమైన శ్రద్ధతీసుకోబడుతుంది. సంపూర్ణమైన ఆరోగ్య విద్యాప్రబోధప్రణాళిక కూడా నిర్వహింపబడుతుంది.

అనల్పమైన మాతా శిశుసంరక్షణ ప్రణాళికలో భాగముగా ఈ ఆరోగ్య సంఘము స్థాపించ బడుచున్నది గనుక ఈ పథకంయొక్క విజయానికి త్వరలోనే ఆధునిక ప్రసూతి వైద్యశాల నొకదానిని పశ్చిమ బెంగాలు ప్రభుత్వము ఇచ్చే స్థలములో స్థాపించుట అత్యంతావశ్యకమై యున్నది. అందు ముప్పయి మంచములున్నూ, అన్ని పరికరాలతోకూడిన ఒక శిశుపోషక గృహమున్నూ ఏర్పాటు చేయడమగును.

అభ్యాసరంగము

ఆదర్శప్రాయమైన ఆరోగ్యసేవలు చెట్లా ప్రాంతీయ ప్రజలకు అందించుటయేకాక, కలకత్తా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైజీన్ అండ్ పబ్లిక్ హెల్త్ శాఖలో పౌర ఆరోగ్యశిక్షణ పొందుచున్న విద్యార్థులకు, ఈ ఆరోగ్య సమితి ప్రయోగ కేంద్రంగాను, అభ్యాస రంగంగాను కూడ ఉపయోగించగలదు. పౌర ఆరోగ్య విద్యార్థులకు శిక్షణకు విషయములో ఈ ప్రయోగ కేంద్రము వైద్యవిద్యార్థులకు ఆసుపత్రులు ఎట్టి తరిఫీదును ఇచ్చుచున్నవో అట్టిపాత్రను నిర్వహించుచున్నది.

ఆరోగ్య సమితియొక్క కార్యక్రమము కలకత్తాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైజీన్ అండు పబ్లిక్ హెల్త్‌న్నూ, కార్పొరేషనున్నూ సమిష్టి బాధ్యతతో నిర్వహిస్తాయి. ఎప్పటివలెనే ఆ ప్రాంతములో జరుగుచున్న సాధారణ ఆరోగ్య కార్యక్రమముల ఖర్చులు కార్పొరేషనువారున్నూ, శిక్షణ నిమిత్తం అవసరమగు అదనపుసేవల ఖర్చులు ఇన్‌స్టిట్యూట్‌వారున్నూ భరించెదరు. శిక్షణకు కావలసిన ఇతర సదుపాయములున్నూ,

ప్రథమ పట్టణారోగ్య సమితి

ప్రయోగము, ప్రచారము శాస్త్ర పరిశోధనముల ఏర్పాట్లు న్నూ ఇన్‌స్టిట్యూట్ వారి పాలనలోనే యుండును.

చెట్లాలోని ఆరోగ్య కార్య క్రమములు సమన్వయము చేయుటకునూ, కార్య విధానమునకు తగిన సలహాల నిచ్చుటకునూ వ్యయమూ ఇతర విషయములనూ గూర్చి ఆలోచించుటకునూ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వము కలకత్తా కార్పొరేషను భారత కేంద్ర ప్రభుత్వముల ప్రతినిధులతో కూడిన 15 గురు సభ్యులుగల ఒక సాంకేతిక సలహా సంఘము నిర్మింపబడుచున్నది.

పరిసర ప్రాంతపు నివాసులు, సంక్షేమ సంస్థలు వైద్య వృత్తిలోనివారు, వ్యాపార తరగతులు వీని ప్రతినిధులతో కూడిన ఒకస్థానిక ఆరోగ్య సలహా సంఘం కూడ నెల కొల్పబడును. ఈ సంఘము సమితి కార్యకలాపములను ప్రజలకు వివరముగ బోధించి వారి సంపూర్ణ సహాయ మును గ్రహించును. స్థానిక ప్రజల ఆరోగ్య సంక్షేమ ములను ఉచ్చస్థితికి తెచ్చే సాధారణ పరస్పర తీర్మాన ముతో, సహకారముతో చర్చించి కృషిచేయుటకు అధికార అనధికార సంస్థలకూ ప్రజలకూ అవకాశము కల్పించి, సాంఘిక పునరోద్ధరణము పటిష్టముగా జరుపుటయే ఈ సలహాసంఘము నెలకొల్పుటకుగల ఉద్దేశము.



ఇరాన్ దేశపు చక్రవర్తిని

ఢిల్లీలోని 'నర్సింగ్‌కాలేజ్ ఆఫ్ ఇండియా'ను సందర్శించిరి. భారత ప్రముఖ ఆరోగ్యమంత్రి శ్రీమతి రాజకుమారీ అమృతకౌర్ చక్రవర్తినికి ఆ కాలేజిలోని వంట తరగతిని చూపించుచున్నారు.

బొంబాయి నగరంలో 1917 వ సంవత్సరంలో ఒక భయంకరమైన దుస్సంఘటన జరిగింది. దానివల్ల వ్యభిచార గృహాల్లోని యువతులు ఎంత అమానుషంగా బాధించ బడుతున్నారో వెల్లడిఅయింది. పడుపువృత్తి సాగించే ప్రదేశంలో తాను నడుపుతున్న ఒక వ్యభిచార గృహంలోని ఒక యువతిని అమానుషంగా బాధపెట్టి దానిపర్యవ సానంగా ఆమెను చంపిన కారణంవల్ల ఒక వ్యభిచార గృహనిర్వాహకుడు ఈ సందర్భంలో ఆకస్మిక పరిస్థితుల్లో అరెస్టుచేయబడ్డాడు. ఇంతకీ ఆమెచేసిన నేరం ?

పతితోద్ధరణ

శ్రీ పి. జి. నాయక్

ఆరోజు అప్పటికే కొందరు విటులనుకూడిన తరవాత అలసిపోవడంవల్ల, అనారోగ్యంవల్ల ఇంకా ఒక విటునితో కలియుటకు సమ్మతించకపోవడం. బాలికలను క్రూరంగాచూచి, దుర్భరమైన బాధలకులోను చేస్తారని దీనివల్ల అందరికీ విశదంఅయింది. పారిపోతారనే భయంతో వేయింబవళ్ళువారిని కఠినమైన బందోబస్తులో ఉంచుతారు. ప్రతి యువతి రోజూ ముప్పయి, నలభై మంది విటులను సంతృప్తి పరచాలి. వారి ఇష్టాయిష్టాలతో పనిలేదు. వారి శరీరాలు ఓర్చుకోగలవో లేదో అనే ఆలోచనే అనవసరం. వారి సంపాదనతో వారికి ప్రమేయమే లేదు. అంతా నిర్వాహకులదే.

పైనచెప్పిన యువతి ఒక రోజున ఈ నైచ్య జీవితం అసహ్యించుకుని ఈవృత్తిని విరమించుకోవాలనే ఉద్దేశంతో అక్కడినుంచి తప్పించుకు పారిపోయింది. దురదృష్టవశాత్తు మళ్ళీ వాళ్ళకి చిక్కింది. పాపం ఆమెను చితకకొట్టేశారు. ఇంకోసారి మళ్ళీ పారిపోవాలని ప్రయత్నించింది. ఇప్పుడు కూడా తన పూనిక కొనసాగలేదు. కాని ఆమెను రుబ్బురోలు పొత్రంతో చితకబొడిచి చంపేశారు.

వ్యభిచార గృహాల్లోని యువతులు పడే భయంకరమైన పాట్లు పైన చెప్పినట్లు ఎప్పుడో ఒకప్పుడు కర్మం చాలక జరిగినవి కావు. సాధారణంగా ఆకాలములో ప్రతి రోజూ అక్కడి విటవాటికలలో పరిపాటిగా జరిగేదురంతాలే అని చెప్పకతప్పదు.

ఈపైసంఘటన పడుపు గృహాల్లోని స్త్రీలు ఎంత నీచస్థితిలో జీవితాలు గడుపుతున్నారో అందరికి తేటతెల్లంచేసింది. నగరవాసుల శ్రద్ధ వ్యభిచార దుర్వృత్తి నిర్మూలనపై కేంద్రీకరింపబడ్డది. బొంబాయి నగరంలో వ్యభిచారవృత్తి ఎన్నో ఏండ్లుగా బహిరంగంగా ఆచరింప బడుతూ ఉంది. కాని ఈవిషయం చదువుకున్న ప్రజానీకం యొక్క దృష్టిని ఆకర్షించడం బొంబాయి నగర చరిత్రలో ఈ సంఘటనతోనే మొదలు. అందుచేత నగరంలో కొన్ని సంస్థల ప్రముఖ సంఘసేవకులుచేరి 'సోషల్ ప్యూరిటీ కమిటీ' అనే పేరుతో సాంఘిక స్వచ్ఛతా సంఘము నొకదానిని స్థాపించి, ఈవిషయమై అత్యంత శ్రద్ధతో పని చేస్తూవచ్చారు. ఈసంఘము యొక్క ప్రోద్బలంచేత బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం బొంబాయిలోని వ్యభిచార దౌష్ట్య నిర్మూలన విధానము పరిశీలించుటకొక సంఘాన్ని నియమించింది. ఆసంఘము చేసిన సిఫారసుల ఫలితంగానే 1923 లో వ్యభిచార నిర్మూలన చట్టాన్ని బొంబాయి ప్రభుత్వం నిర్మించింది. వ్యభిచార నిర్మూలనచట్టం యొక్క ఆచరణకు సహాయం చేయడానికీ, బాలికలనూ, యువతులనూ పడుపువృత్తిలోనికి దింపే వ్యాపారంవల్ల సంభవించే తీవ్రమైన నష్టాలను గురించి ప్రజాభిప్రాయాన్ని మేల్కొలిపి ప్రచారం చేయడానికీ ప్రజాసమర్థనతో బొంబాయి విజిలెన్సు అసోసియేషన్ ఆ సంవత్సరంలోనే అవతరించింది.

వేశ్యా గృహాల్లోంచి రక్షించబడిన స్త్రీలను ఆదరించడానికి తగిన సౌకర్యాలు కలగజేసే సంస్థలు ఆరోజుల్లో లేవు. కొన్ని రక్షణ గృహాలు ఉండేవి. కాని కొన్ని కులాలకు చెందినవారిని మాత్రమే వానిలో చేర్చుకునేవారు. అందుచేత బొంబాయి విజిలెన్సు అసోసియేషన్ లోని సేవకులు సేకరించిన స్త్రీల ఏర్పాటు విషయమై

చాలా కష్టాలు పడవలసివచ్చింది. ఈ చిక్కులను అధిగమించడానికి 1926 సం॥లో ఈ సంస్థ ఒక ఆశ్రమాన్ని నెలకొల్పింది. నిరోధ రక్షణముల కృషి సహజ మానవ స్వభావంవల్ల కలుగుతుంది. ఈకృషి చాలా కష్టతమమైనదిన్నీ, నిస్పృహ కలగజేసేదిన్నీ. ఇందుకు మానవత్వంపట్ల అచంచల విశ్వాసమున్నూ, అందలినిత్యావసరములతో పరిచయంలేని వారికి దుర్గ్రాహ్యమైన ఓరిమియున్నూ ముఖ్యంగా కావాలి. విధిగా కావించవలసిన సేవ ఇదేఅనే గట్టినమ్మకం కలిగిఉన్నాము. అసంఖ్యాకమైన ఆటంకాలు అడ్డు తగులుతున్నప్పటికీ పైనచెప్పిన ఆశయాలు నెరవేర్చుకుందుకు గతముప్పయి సంవత్సరాలనుండీ ఈ అసోసియేషను శక్తికిమించిన సేవచేస్తూనే ఉంది. దీని తరువాత ఇంకా కొన్ని రక్షణ గృహాలు స్థాపింపబడ్డాయి. ప్రస్తుతం బొంబాయి నగరంలో అలాంటి సంస్థలు మొత్తం ఆరుఉన్నాయి. ఇలాంటి కృషికి అడ్డు వచ్చే అవరోధాలను లెక్కచేయకుండా ఈసంస్థలు ఓపినంతవరకు పనిచేస్తున్నాయి.

ఈరక్షణాగారాల్లో ప్రవేశించే యువతులు పలు ప్రదేశాలనుంచి వస్తారు — విశేషంగా ఇండియా ఇతర రాష్ట్రాలనుంచిన్నీ బొంబాయి రాష్ట్రంనుంచిన్నీ — బొంబాయి నగరవాసుల సంఖ్య మాత్రం బహుస్వల్పం. వారు అనేక కారణాలచేత వీనిలో ప్రవేశిస్తారు. కోర్టు విచారణలోఉన్న స్త్రీలకేగాక, నిస్సహాయలై, నిరాశ్రయలై నీతిభ్రష్టులు కాబోవుటకు అవకాశాలు ఏర్పడిన స్త్రీలకుకూడా ఆశ్రయమిస్తారు. ఇలాంటి అపాయకర పరిస్థితులలో ఉన్న యువతులకే చాలా మందికి ఆవాసం కల్పించి సహాయపడతారు. సకాలంలో ఇటువంటి సహాయచర్య జరగకపోతే వారు గత్యంతరంలేక పడుపు గృహాల్లో ప్రవేశించి జీవితాలను భగ్నం చేసుకుంటారు.

ఇందులో చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే వీరిలో ఏఒక్కరూకూడా ఆరోగ్యంగాను, మానసికంగా గాని, శారీరకంగాగాని రోగాలు లేకుండాను ఉండరు. ఈ సంస్థల ప్రధాన నిర్వాహకులు మొట్టమొదట చేయవలసిందేమిటంటే ప్రవేశించిన వెంటనే ప్రతిస్త్రీని డాక్టరుచేత పరీక్షచేయించి రోగాలు పూర్తిగా రూపు మాసేవరకూ వైద్యం చేయించడం. ఎక్కువమంది స్త్రీలు సుఖరోగాలవల్ల బాధపడుతూఉంటారు. ఈబాపతు రోగాలవైద్యానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు ప్రతిసంస్థకు చాలా అవసరం.

ఈ కృషిలో ఇంకొక విశేషం. ఈ రక్షణగృహాల్లో ప్రవేశం ఆసించేవారిలో చాలామంది మానసిక దౌర్బల్యంతో ఉంటారు. ఈరకంలో మందమతులూ బుద్ధి వెనకబడినవారూ, నిర్వ్యాపారులూ, హృదయ దౌర్బల్యం కలిగినవారూ ఉంటారు. వీళ్ళుగాక అప్పుడప్పుడు పిచ్చిఎక్కేవాళ్ళూకూడా కొందరు ఉంటారు. ఇలాంటివారితో వ్యవహరించడం చాలా కష్టం. ఒక్కొక్కసారి వీరు యావత్తు సంస్థనీ తారుమారుచేసి, అదుపులోపెట్టడానికి అసాధ్యం అవుతూఉంటారు. అక్కడి సేవకుల ఆదుర్దానివారించడానికి శారీరకంగా బాధపడే స్త్రీలకు ఉచితంగా వైద్యం చెయ్యడానికి బొంబాయి నగరంలోకొన్ని ఆసుపత్రులు సహాయంచేస్తున్నాయి. కాని, దురదృష్టవశాత్తు, మానసిక దుర్బలులను, - తమకూ, ఇతరులకూ ప్రమాదకరంఅయితే తప్ప — పంపించడానికి తగిన ఆసుపత్రులు నగరంలోలేవు. అట్టి పరిస్థితుల్లో ఈ చెలరేగేవాళ్ళని అదుపు ఆజ్ఞలలో పెట్టడానికి సంస్థలవారు ఏమిచెయ్యాలో తెలియక చిక్కుపడుతున్నారు. ఇలాంటి వారికి ఆశ్రయంఇచ్చి, వైద్యం చేయడానికి ప్రత్యేక సంస్థలు నెలకొల్పబడాలి. శారీరక వ్యాధివల్లనైతేనేమి, మానసిక వ్యాధివల్లనైతేనేమి బాధపడే స్త్రీలందరూ సేవకులకు బ్రహ్మాండమైన చిక్కుకలిగిస్తూ ఉన్నారనక తప్పదు. వారికి తగిన వైద్య సహాయంచేసి, ఏదోవృత్తి కల్పించి సంతృప్తి పరచడానికి సేవకులు తమ జీవశక్తిని ఎంతో ధారపోయవలసి వస్తూఉంది. జబ్బు పూర్తిగా నివారణ అయేవరకూ వారికితగిన పునరావాసం కల్పించడానికి వీలులేకుండాపోతూఉంది.

ఇటువంటి స్త్రీలకు ఈ రక్షణ గృహాలలోనే ఏదో పనిపాటలు కల్పించి భవిష్యత్తులో స్వయంపోషకంగా జీవించేందుకు తగిన కళలను, చేతిపనులను, పరిశ్రమలను అభ్యసించే శిక్షణ యిస్తున్నారు. కొన్ని సందర్భాలలో సరియైన ఏర్పాట్లులేని వసతిగృహాలలోని యువతులు ప్రత్యేక కళాశిక్షణ నిమిత్తమో, ప్రత్యేక చేతిపని నిమిత్తమో అట్టి ఏర్పాట్లుగల పరిసరాలలోని ప్రత్యేక పాఠశాలలకు ప్రత్యేక శిక్షణనిమిత్తం పంపబడుతున్నారు. అక్కడ ఈ బాలికలు క్రమబద్ధమైన శిక్షణ పొందుటయే కాక వారికి అక్కడి సాధారణ బాలికల సహవాసము లభించే అవకాశము కూడ ఏర్పడుతుంది. వారి సహవాసము తమ శీఘ్ర పురోభివృద్ధికి సహకరిస్తుంది. కొందరికి వివాహం చేస్తారు. కొందరిని తమ బంధు

వుల ఇండ్లకు పంపుతారు. కొందరికి ఏదో ఉద్యోగం కల్పిస్తారు. దీర్ఘకాలం ఉండనవసరం లేనివారికి ఇంటి పనులో, లేక వంటో నొప్పజెపుతారు. ఆవిధంగా వారికి పునరావాసం కల్పించడానికి ఉన్నవీ అనుకూలమైనవీ మార్గాలు అన్వేషించి హృదయపూర్వక ప్రయత్నాలు చేస్తారు. కాని ఏ పనినీ, ఏ వృత్తినీ అనుసరించలేని బాలికల విషయమే నిర్వాహకులను వ్యాకులపెట్టే కష్టతమ సమస్యగా అయింది. అటువంటి వారిని ఎక్కడో స్థిరపెట్టడానికి కొన్ని మాసాలేకాదు కొన్ని ఏండ్లుకూడా పట్టుతుంది.

రక్షణ గృహాలలోని ప్రతి ఒక్క బాలిక విషయమూ ఒక్కొక్క తీరని సమస్య అనీ, స్వయంగా శ్రద్ధ తీసుకోవాలనీ మళ్ళీ మళ్ళీ చెప్పనక్కరలేదు. వివిధములైన కారణాలు వారి నైతిక పతనానికి దారితీస్తాయి. అందుచేత ఆయా వ్యక్తుల అవసరాలకి అనుగుణమైన ప్రతిక్రియలు అనుసరించవలసివస్తుంది. అచిరకాలంలో వీరి శీలాన్ని సరిదిద్దడంగాని, మంచి అలవాట్లు అలవరచడంగాని, వారికి సహకరించే సలహాదారుగా తయారవడంగాని అసాధ్యమని తెలియవలెను. అందుచేత స్వల్ప కాలమే ఇందు నివసించే బాలికల విషయమైన ప్రయత్నాలు విజయవంతంకావు. కాని వచ్చిన గట్టి చిక్కు అలాంటి వాళ్ళే ఇక్కడికి ఎక్కువగా వస్తారు.

తన దుర్నీతి ప్రవర్తనకు సంబంధించిన పూర్వచరిత్ర తెలుసుకోకుండా ఏ స్త్రీకైనా సహాయం చెయ్యడం కష్టం. రక్షణ గృహంలో చేర్చుకోవడంతోనే ప్రతి స్త్రీయొక్క చరిత్ర రికార్డు చేయడానికి ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి. ముఖ్యంగా నైతిక పతనానికి కారణభూతమైన విషయాలు. ఆమె చరిత్ర ఏదో తొందరగా వ్రాస్తే, తమకు ఎల్లప్పుడూ తోడుపడి సేవ చేయబూనుకున్న వాని దృష్టిలో ఏ విషయం ముఖ్యం అని భావించబడుతుందో, ఏ విషయంమీద ఆమె పునరావాస ప్రయత్నాలు ఆధారపడి ఉంటాయో, అదే తప్పకుండా చెప్పడం మానేస్తుంది. లేకపోతే తాను నిర్దోషినని చెప్పడానికి ఏవో అసత్యాలు చెప్పి బుద్ధిపూర్వకంగా సహాయకుని తప్పుదారిలో పెట్టడానికి ప్రయత్నిస్తుంది. ఆమె యొక్క జీవిత దుష్పరిణామానికి గల వాస్తవమైన కారణం గ్రహించి, ఆమె చేసిన తప్పిదం ఆమెయే గ్రహించేలాగుచేసి, తన కేదిమంచిదో తెలియజెప్పినట్టయితే, ఒక క్రొత్త వాతావరణం ఏర్పడుతుంది. అది విశాల మానవ దృక్పథంవల్లనే జరుగుతుంది. అలాంటి సహాయకర వాతావరణం ఏర్పరచి సన్నిహిత సంబంధం స్థాపించిననాడు ఆమె ఆ సేవాసక్తుని సలహాలకు సరియైన సమాధానం ఇస్తుంది. అప్పుడు నిజస్థితి ఐచ్ఛికంగా చెప్పుకోవడమేగాక అదివరకు చెప్పినదంతా అసత్యమని ఒప్పుకుంటుంది. ఈ విధమైన పశ్చాత్తాపమువల్ల ఆమె యెడల ఆదరణము హెచ్చి, ఆ సేవకునికి ఆమె విషయమై సరియైన పరిష్కరణ మార్గం కనపడడమే గాక, ఆమె పునరావాసానికి ఇచ్ఛాపూర్వకమైన సహాయం కూడా చేయవీలగును. ఆమె మీద ఒక పూజ్యభావం ఏర్పడి, ఆమెను ఉత్తమ ప్రవర్తనగల దానిని చేస్తుంది. కాని వానికి కొంత వ్యవధిన్నీ, ఓరిమిన్నీ కావాలి. అలాంటిది తొందరగా చెయ్యకూడదు. అందుకే ఇలాంటి కార్యాలలో మానవ దృక్పథానికి అంత ప్రాముఖ్యం ఇవ్వబడింది. దీనికికూడా లొంగనివారు చాలా స్వల్పంగా ఉంటారు. ఆమె తప్పుదారిని బట్టిన యువతి అయినప్పటికీ ఆమె కూడా ఒక మనిషే గనక హృదయపూర్వకంగా సరియైన పద్ధతిలో ప్రయత్నిస్తే బాగుపడడానికి అవకాశాలు లేకపోలేవు. ఇది కష్టసాధ్యమైనదీ నిరాశ కల్పించేదీ అనడానికిసందేహంలేదు. కాని సేవాతత్పరతతో చేస్తే, సహాయం చేసేవారికీ, సహాయం పొందేవారికీకూడా ఉత్సాహమున్నూ, ధైర్యమున్నూ కలుగుతాయి. ఇలాంటి సందర్భాలలో శిక్ష ఎంతమాత్రం ప్రయోజనకరంకాదు.

మనం అంగీకరించినా అంగీకరించకపోయినా, నీతిమాలిన జీవితం గడిపే ఈ స్త్రీలు సాంఘిక దురాచారానికి బలి అయినారని ఒప్పుకొనక తప్పదు. వారు తిరిగీ సన్మార్గంలో సంచరించడానికి సాధ్యమైనంత సహాయమున్నూ, ఆదరమున్నూ చూపించడం సంఘంయొక్క విధి. వారిని దూరంగా ఉంచి, నిరాదరణతోనూ ఏహ్యాభావంతోను చూచి బహిష్కరించడంవల్ల సమస్యా పరిష్కారం కాదనే సంగతి తెలుసుకోవాలి. పైగా అలా చేస్తే ఈ సమస్యాపరిష్కరణ మార్గం కష్టతరం అవుతుంది. చాలామంది, ముఖ్యంగా వక్రమార్గాన్ననుసరించిన బాలికలుగల కుటుంబాలవారు వారి గౌరవ ప్రతిష్టలు నిలబెట్టుకుందుకు ఆ బాలికలను వొదుల్చుకుందుకు తరుచుగా ఆతురతపడుతూ ఉంటారు. ఈ దృక్పథం చాలా గర్హించదగినది. ఎందుచేతనంటే వారిలా చేయడం వల్ల ఆపిల్లల్ని పూర్తిగా అధోగతి పాలుచేసిన నేరానికి

బాధ్యులవుతున్నారు. ఇంతేకాక ఆయా కుటుంబాలలోని పరిస్థితులే ఈ యువతుల దుష్ప్రవర్తనకు బాధ్యత వహించవలసివస్తుంది. తమను కన్న తమ స్వజనమే ఇలా నీచంగా చూస్తుంటే వారికొక విధమైన అసహ్యం కలిగి, ఇంకా ఎక్కువగా చెలరేగిపోయి తిరోగమనానికి దుస్సాధ్యం అయిపోయేటంత కఠిన మనస్కులై పోతారు. నీచంగా చూడబడి, అసహ్యించుకోబడి, మోసగించబడిన ఇలాంటి స్త్రీలు తరుచూ రోగాలతో బాధపడుతూ ఏవిధంగానూ తిరిగి బాగుపడడానికి సానుకూలురుకారు. కాని సాధ్యమైనంత సహాయంచేసి దయతో ఆదరించి. వారి ఇతర కష్టాలను తొలగించడానికి తోడుపడితే —ముఖ్యంగా ప్రారంభ దశలో— అంతటినుంచి ఇంకా అధోగతి పాలుకాకుండా నిరోధించి మంచి జీవితమార్గాన్ని నడిచేటట్లు చేయడానికి అవకాశాలు ఉన్నాయి.

ఈ రక్షణ గృహాల్లో ప్రవేశ పెట్టబడే బాలికలు చాలా మంది పడుపువృత్తి వ్యాపారంగా సాగించే వారివల్ల ఇందుకు బలి అవుతున్నారు. బొంబాయి రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఖండోబా, జటీబా, ఎల్లమ్మ, అంబాబాయ్‌లాంటి దేవుళ్ళకీ దేవతలకీ అర్పించబడిన స్త్రీలు కూడా కొద్దిగా ఉన్నారు. పుట్టిన పిల్లలు చనిపోతూ ఉన్నా, వారు రోగపీడితు లవుతున్నా, వారి తల్లి దండ్రులు ఈ దేవతావిగ్రహాలకి తమ పిల్లలు బ్రతికినట్లయితే అర్పణ కావించబడతారని మొక్కుకుంటారు. ఆయాదేవుడికి గాని దేవతకి గాని అర్పించబడ్డవారు వేరువేరు నామధేయాలతో పిలవబడతారు. వాళ్ళు వివాహం చేసుకుందుకు వీలులేదు. కాబట్టి. వాళ్ళకి వయసురాగానే ఈ దుర్నీతి సహజంగా అవలంభించవలసి వస్తుంది. ఇలాంటి వాళ్ళు బొంబాయి నగరంలోని విటవాటికలలో ఎంతోమంది ఉన్నారు. దేవతలకి ఆడ బిడ్డలను ఆ విధంగా కైంకర్యం చేయడం చట్ట విరుద్ధమైన నేరం. కాని ఈ దురాచారం పూర్తిగా నశించ లేదు. ఈ దురాచారాన్ని రూపు మాపాలంటే ఈ సంఘ దురాచారాలు ప్రబలంగా ఉన్న జిల్లాలలో ప్రజాభిప్రాయాన్ని రెచ్చగొట్టాలి.

బొంబాయి రాష్ట్రంలో ఇంకొక విధమైన దేవదాసీలు ఉన్నారు. వారు కులంచేత దేవదాసీలు. వారి పూర్వులు దేవదాసీలు కావడంవల్లా వీళ్ళుకూడా దేవదాసీ లయారు. వారు అనేక శాఖల క్రింద వేరు వేరుగా ఉన్నారు. వారి పూర్వీకుల చరిత్రనుబట్టి కూడా వారిలో ఒకరికీ ఇంకొకరికీ భేదం ఉంది. ఈ కులంలోని స్త్రీల విస్పష్టమైనవృత్తి పాడుట, నృత్యంచేయుట, దేవాలయాలలో కుటుంబాలలో దేవతారాధన చేయుట— వివాహాలలో ప్రస్తుతం నిషేధించబడినది — మొదలైన విధులే అయినప్పటికీ వాళ్ళీవ్యభిచారవృత్తిని అవలంభించ వలసి వస్తూంది. పూర్వం వారికి నియోగింపబడిన దేవతారాధన పూర్తిగా విస్మరించి వ్యభిచారానికే వారు ప్రస్తుత కాలంలో ఎక్కువగా ఆకర్షింప బడుతున్నారు. చిన్నతనం నుంచీ బాలికలకు తమ జీవితాలు వ్యభిచారానికే ఏర్పడ్డాయని బోధిస్తారు. వారు తను ఇష్ట ప్రకారం నిర్ణయించుకోడానికి వీలులేదు. తరుచూ బాలికలకు దీని మీద ఇష్టంలేకపోయినా కుటుంబంలోని వృద్ధుల నిర్బంధంవల్ల దుర్నీతికి లోనుకావలసిన అవసరం కలుగుతుంది. దేవునికి కైంకర్యం చేసే కార్య కలాపం చిన్నవయస్సులోనే ఆ బాలిక గృహంలో గాని దేవాలయంలో గాని జరిపేస్తారు. ఇది సరిగ్గా వివాహకార్యంలాగే జరుపుతారు. ఆమాటకి అర్థం కూడా అదే. కాని వివాహం ఒక మగవానికీ, ఆడదానికీ, జరుగుతుంది. ఇక్కడ మాత్రం ఇద్దరూ ఆడపిల్లలే. పెండ్లికొడుకు పాత్రధరించే బాలికకు మగవాని వేషం వేస్తారు. శుభకార్యం అంతా వివాహంలాగే యథావిధిగా జరుపుతారు. హిందూమత సాంప్రదాయాను సారంగానే సర్వమూ జరుగుతుంది. ఈ కార్యంలో ఆబాలిక దుర్నీతి పథంలో నడవాలని ఎక్కడా నిర్వచించబడి ఉండలేదు. కాని ఇలాంటి వివాహం ఆ బాలికను ఈ వృత్తి నవలంబించుటకు లైసెన్సు క్రింద పరిగణించ బడుతూఉంది.

ఈ వ్యవస్థలో జాలీ, విచారమూ కలగజేసే విషయం ఏమిటంటే ఆ కుటుంబాలలోని మగవారిదురదృష్టజీవితం. ఈ మగవారు పుట్టినప్పటి నుంచీ కుటుంబంలోని అందరిచేతా అన్ని విధాలా నిరాదరణతో నిర్లక్షింప బడతారు. పెద్దవాళ్ళయిన తరవాత వారి ముఖ్యవిధి ఏమంటే వారి అక్క చెల్లెండ్రు నియమించిన కార్యాలు మాట్లాడకుండా చెయ్యడమే. ఎందుచేతనంటే వాళ్ళే సంపాదించి, కుటుంబాన్ని పోషించి, గృహాలకి యజమానురాండ్రుగా పరిగణింప బడుతున్నారు గనుక. ఈమగవాళ్ళకి సాధారణంగా చదువు సంధ్యలు ఉండవు. స్వశక్తిమీద ఆధారపడే ఆస్కారంలేదు. కాబట్టి అక్కచెల్లెండ్రమీదనే ఆధారపడి ఉండాలి. చెడ్డ వాతావరణంలో పెరగడంవల్ల వాళ్ళు దురభ్యాసాలకు లోనైపోతారు.

పతితోద్ధరణ

1924 వ సంవత్సరంలో బొంబాయి చిల్డ్రెన్సు ఆక్టు అమలుకు వచ్చినప్పుడు ఈ శాఖలవారిలోనే అశాంతి బయలుదేరింది. ఈ చట్టంయొక్క అవకాశాన్ని పురస్కరించుకుని కొందరు ఉత్సాహవంతులైన యువకులు ఈ జాతిని సంస్కరింపబూనుకున్నారు. ఈ ఆశయం దృష్టిలో ఉంచుకుని బొంబాయిలో ఒక సంఘం స్థాపించబడింది. అనేక జీవిత పథాల్లో పేరెన్నికగన్న ఇతర జాతులలోకూడా జనామోదం బడసిన కొందరు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. వీరి ప్రధాన ఆశయం ఈ జాతి మొత్తంమీద నైతికంగాను, సాంఘికంగానూ, విద్యావిషయికంగానూ అభివృద్ధిలోకి రావాలని. ఈ ఆశయ దృష్ట్యా తీవ్రమైన విద్యాప్రచారం సాగింది. ముఖ్యంగా హిందూమతం ఆమోదం లేకండా మతాచారాలక్రింద పరిగణింపబడి జరిపే కృతక వివాహ ఆచారంమీద సూటిగా దాడి జరిగింది. ఇది కావలసినన్ని ఫలితాలనూ ఇచ్చింది. పైనవివరించిన పరిస్థితుల్లో గొప్పమార్పును తీసుకువచ్చింది. చాలా కుటుంబాలు పూర్తిగా ఈ దురాచారాన్నుంచి విముక్తి పొందాయి. విద్యావ్యాప్తి చురుకుగా సాగుతూ ఉంది. ఈ జాతి పిల్లలకి న్యాయసమ్మతమైన వివాహాలు జరుగుతున్నాయి.

ఈ దురాచారం 1934 సం॥ లో అమలులోనికి వచ్చిన దేవదాసీ చట్టంవల్ల న్యాయశాస్త్రరీత్యా అదుపులోనికి వచ్చింది. కాని ప్రజా సహకారం లేనిదే ఏ సంఘ సంస్కరణ సఫలీకృతం కాదని తెల్లమవుతుంది. పారంపర్యంగా వచ్చే ఈ దురాచారాన్ని నిరాకరించే బాలికలకు ప్రాప్తించే కష్టాల నివృత్తికై సహాయపడే సంస్థలేవీలేవు. ఈ బాపతు సంస్థ కులతత్వంమీద నడపబడుతున్నదనే సాకుతో పాతిక సంవత్సరాలకు పూర్వంనుంచీ నిరంతర సేవ చేస్తున్నప్పటికీ బొంబాయి ప్రభుత్వం ఆర్థిక సహాయం చెయ్యకపోవడం దురదృష్టం. ఈ విషయంలో ఈ సంస్థ సర్వశక్తులా కృషిచేసి ఉండకపోతే ప్రభుత్వం నిర్మించిన చట్టం బుట్టదాఖలు అయి ఉండేది.

భ్రష్టశీలుర రక్షణగృహాలు పైన వివరించిన విధంగా విపరీతపరిస్థితులను అధిగమించి ఎంతో సమర్థతతో కృషిచేస్తున్నాయి. అంటే ఇతోధిక పురోభివృద్ధికి ఆవశ్యకత లేదనికాదు. వాస్తవంగా ఇంకా చెయ్యవలసిన వెన్నో ఉన్నాయి. ఆర్థిక లోపంవల్ల సతమతమవుతూ చెయ్యలేకపోతున్నారు. చాలా రక్షణగృహాలు క్రిక్కిరిసి ఉన్నాయి. వెంటనే శ్రద్ధతీసుకోవలసిన వారికి ఒక్కొక్కప్పుడు స్థలాభావంచేత ప్రవేశం దొరకడంలేదు. కొన్ని సంస్థలకు స్వంత భవనాలు లేవు. అందుచేత అన్నిరకాలవారినీ ప్రత్యేకించకుండా జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఏ సదుపాయాలూలేని పాత ఇళ్ళల్లో క్రుక్కవలసివస్తూ ఉంది. ధనాభావం వల్లనే శిక్షణ పొందిన సిబ్బందిని నియమించడానికి కూడా వీలులేకపోతూ ఉంది. ఈ అమూల్యమైన మానవసేవ సమర్థతతోనూ, క్రమబద్ధంగానూ నెరవేర్చాలీ అంటే, ఈ సంస్థలకు తగిన ఆర్థిక సహాయం లభించాలి. ఈ పని ఆయాసంస్థల ఆర్థిక పరిస్థితులకు మించినది ఈ సహాయం జరిగితే తప్ప సంస్థలను నిందించి ప్రయోజనంలేదు. ఇది విరివిగా రాష్ట్రప్రభుత్వాలు విరాళాలివ్వడంవల్లనే సాధ్యమవుతుంది. ఏకాగ్రతతో ఇంతకంటె తీవ్రసమస్యలను పరిష్కరించుటకు వ్యవధి కలగజేయడానికి ఈసంస్థలను ఆర్థికచిక్కుల నుండి తప్పించవలసిన విధి రాష్ట్రప్రభుత్వాలదే!

ఈ కృషి అత్యంతావశ్యకమైనదీ, ముఖ్యమైనదీ అనుట నిస్సంశయము. కాని ఇంతకంటె ప్రధానమైనదీ, సమూలంగా నిర్మూలించవలసినదీ ఇంకొకటి ఉంది. —దుర్నీతి వ్యాపారం. కష్టాలలో ఉండేయువతుల నిస్సహాయతను, అమాయికత్వాన్ని స్వలాభం కోసం ఉపయోగించుకొనే తార్పుడుగాండ్ర బజారును పెకలించవలసిన అవసరం ఎంతైనా ఉంది.



కేంద్ర సంక్షేమ సంఘంవారి సహాయంతో బాపట్ల స్త్రీహితైషిణీ మండలివారు ప్రతి ఉదయం బీద పిల్లలకు పాలు పోస్తున్నారు.

పింగల్వారా వసతి గృహము
అమృతసర్

ప్రతీ రాష్ట్రంలోనూ పెద్ద ఆసుపత్రులు వుండవచ్చు. కాని చుట్టుప్రక్క గ్రామాలనుండి చికిత్సకోసం వచ్చే దరిద్రులకు దిక్కుమాలినవారికీ తగు సదుపాయములు చేసే సంస్థలు చాలా తక్కువ. ఆసుపత్రులలో ప్రవేశం దొరికేవరకూ వారికి ఆదరించి వసతిభోజన సదుపాయాలు కలుగజేసే సంస్థలు యెంతో అవసరం.

ఈకొరత తీర్చి నిస్సహాయులకు — అనగా వికలాంగులు, అవధ్యులు, వృద్ధులు, పక్షవాతరోగులు, శక్తిహీనులు మొదలైనవారికి ఆశ్రయమూ, శాంతీ కలుగచేసి రక్షించేనిమిత్తం, పింగల్వారా వసతిగృహాన్ని అమృత్‌సర్ నగరంలో శ్రీభగత్‌పూరణ్‌సింగ్ 1947 సం॥లో స్థాపించిరి. ప్రస్తుతము ఈ వసతిగృహపు 3 శాఖలలోను, వివిధ తరగతులకుచెందిన 203గురు వ్యాధి పీడితులున్నారు.... ....

శక్తిహీనులు, వృద్ధులు	25
క్షయవ్యాధిబాధితులు	54
మందమతులు	35
రోగులు	40
అనాథశిశువులు	5
వికలాంగులు	10
కుంటివారు	19
ఇతరులు	15
మొత్తం	203

ఇందు 70 మంది స్త్రీలు — 50 మంది శిశువులు కలరు.

ఈ వసతిగృహములోనివారికి ఉచిత ఆహారము, వసతి సదుపాయములేకాక, వారికితగిన ఆస్పత్రులలో ప్రవేశము దొరుకునందాక వసతిగృహములో నుంచుకొని పట్నములోని వివిధ వైద్యశాలల అవుట్‌పేషెంట్ శాఖలలోని నిపుణులకు చూపించుటకు సైకిల్ ట్రాలీలలో తోడుకొనిపోయి వచ్చే సౌకర్యములుకూడ కలిగించుచున్నారు. ఇవికాక ఈ గృహములో కుదిరే ఆశలేని దీర్ఘవ్యాధిగ్రస్తులుకూడ చేర్చుకోబడుదురు.

రోగుల జనాభాతో పోల్చిచూస్తే మనదేశంలో వైద్యపు ఏర్పాట్లు అతిస్వల్పమని అందరకూ తెలిసిన విషయమే. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రతి 1000 జనులకూ ఒక వైద్యుడుంటే, ఇండియాలో ప్రతి 63000 జనులకూ ఒక డాక్టరే వైద్యమునకేర్పడి యున్నాడు. వైద్య సంస్థలలో ఏర్పాటైన మంచముల నిష్పత్తి 3135 మందికి ఒకటి అని తేలుచున్నది

ఆవిధంగానే దేశంలో 25 లక్షలమంది క్షయవ్యాధి పీడితులైయుండ, క్షయఆస్పత్రులు, సానిటోరియములలో వెయ్యిమందికే ప్రవేశావకాశము కలుగుతూంది.

అంటే మన ఇండియాలో రోగపీడితులకు తగిన వసతులు, వైద్యసహాయం లభించడం లేదన్నమాట.

అధికార, అనధికార సంస్థలు ఈ సమస్యాపరిష్కారమునకై శక్తివంచన లేకుండ పాటుపడుచున్నను అనుకున్నంత త్వరలో కార్యసాఫల్యం పొందుటకు సాధ్యపడటం లేదు. స్వచ్ఛంద సాంఘికసేవకులు ఈ సమస్యనుగూర్చి ఎక్కువగా యోచించాలి.

పింగల్వారా నిలయమందు, ఒక డైరెక్టరు, ఒక మేనేజరు, ఒక కాంపౌండరు, ఒక అకౌంటెంటు అత్యంత శ్రద్ధాసక్తులతో పనిచేయుదురు - నిజం చెప్పాలంటే ! ఈ గృహనిర్వహణ భారమంతా పూర్తిగా భగత్‌పూరణ్ సింగ్ స్వయత్నమున, భక్తి శ్రద్ధలపైన మోపబడి జరుగుతూంది — 50 సం॥ వయస్సుగల బ్రహ్మచారి, ఆయన - వారి జీవిత సర్వస్వమూ ఈవిధంగా సంఘములోని అదృష్టహీనుల సేవకై అర్పించిరి. శ్రీసింగ్ ఖద్దరు వస్త్రధారియై అతిస్వల్పమగు వ్యక్తిగతావసరములుకల్గి, కోరికలులేని సన్యాసివలె కాలముగడుపుదురు. ఆయనకై యేగదియు ప్రత్యేకింపబడలేదు. రోగులకు వసతికూర్చే భవనపు వరాండాయే ఆయన సర్వకాల సర్వావస్థలయందు నివసించు స్థానము.

వారు పంజాబు రాష్ట్ర సాంఘిక సంక్షేమ సభ్యులైయుండి సాంఘికసేవనుగూర్చి అనేక ప్రచురణములుచేసిరి.

దేశవిభజనకు పూర్వము ఈయన లాహోరునందలి అనేక గురుద్వారములను సందర్శించి శిశువులకు సేవ చేయుచూ. అచటి పాపలసేవతో సంక్షేమ కృషికి నాంది పాడెను.

ఈసదనపు వార్షిక వ్యయము. రు. 60,000 దాపున నుండును :— కార్మికులు, రక్షక (పోలీసు) భటులు, నౌకర్లూ మొదలగువారినుండి వసూలయిన సొమ్ముతో ఇతర విరాళములు, పురపాలక సంఘమువారు క్షయ వ్యాధి నిర్మూలన నిమిత్తమిచ్చు విరాళముచేర్చి ఈ సదనము నడుపబడుచున్నది. ఇటీవల కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థయున్నూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ యున్నూ ఆర్థిక సహాయము చేయుచున్నవి.

పింగళ్‌వారా నిలయపు కార్యకలాపములు వైద్య సంక్షేమ కృషికి ఒక ఉజ్వల ఉదాహరణము. అవ్యక్త పీరుడు భగత్‌పూరణ్‌సింగ్ ఆచరించిన కొత్త పంథా — రోగనివారణకూ, ఆసుపత్రిలో ప్రవేశమునపేక్షించి విఫలులైన రోగులకూ — వైద్యులకూ నడుమ ప్రవేశము దొరకునంతవరకూ వారధివంటిది.... వీరి సేవ అపారము.... అనంతము....!

వ్యధిత మానవసేవచేయు ఇట్టి సదనములు, ఇంకనూ, ఇతర సంఘసేవా దక్షుల ప్రోత్సాహమున స్థాపింపబడు నని ఆశించబడుచున్నది...

వికలాంగుల శరణాలయము

రాజానగరము

(తూర్పు గోదావరి)

ప్రణాళికా నిర్వాహకులకు ప్రజలసహకారం:-

తూర్పుగోదావరి జిల్లా సంక్షేమ విస్తరణ ప్రణాళిక వారిచే స్థాపింప బడిన రాజానగరమందలి వికలాంగుల శరణాలయమునకు చుట్టుపట్ల గ్రామములు ఈ క్రింది విధముగా సహకరించినవి.

1. రంగంపేట గ్రామమందు శ్రీ అడుసుమిల్లి సుబ్బారావుగారు. గ్రామస్తులు కలిసి 20 బస్తాల ధాన్యము.

2. కొత్తపూరు ప్రజలు 1. బస్తా చోళ్ళు.

3. కలవచెర్ల గ్రామమందు శ్రీరాజా నల్లపరాజు రామచంద్రమూర్తి రాజుగారు, సోదరులు. గ్రామస్తులు కలిసి సుమారు 12 బస్తాల ధాన్యము.

4. నరిజెల్లిపేట గ్రామస్తులు 4 బస్తాల ధాన్యము.

5. తూర్పుగోదగూడెమునందు శ్రీ చల్లాగంగరాజుగారు. గ్రామస్తులు కలిసి సుమారు 12. బస్తాల ధాన్యము.

6. దక్షిణ తిరుపతిరాజాపురము నందలి ప్రజలు 4. బస్తాల ధాన్యము.

7. చెక్కాద్వారబంధం అను గ్రామ ప్రజలు 1. బస్తా కందులు 1. బండి వంటచెరకు.

దయతో వికలాంగుల సంరక్షణాలయమునకు ఇచ్చిరి

ఇంకా దోసకాయలపల్లి, మురారి, వెలుగుబంద నరేంద్రపురం, నందరాడ, పల్లకడియం, రామస్వామి పేట ప్రజలుకూడ విరాళముల నిచ్చుటకు మాటయిచ్చిరి.



ఇది అమెరికాలోని డకోటా విమానాల విశాలమైదానాలలో జరిగిన సంఘటన.

సేద్యదార్లు గోధుమ పంటను అప్పుడేకోశారు. సేద్యదార్లూ ఇంటికి వస్తూ పోయే ఇరుగు పొరుగువారూ అంతాకలిసి పరస్పర సహాయం చేశారు.

కోత అయాక తీరా చూస్తే వ్యవసాయదారుని రెండేళ్ళ చిన్ని కూతురు కనపడలేదు. ఆ బిడ్డను కనుక్కోడానికి వ్యవసాయదార్లు గుంపులు గుంపులుగా బయలుదేరారు— కేకలుపెడుతూ, పేరున పిలుస్తూ నాలుగుమూలలా వెదికారు. కానిఏమీ సమాధానంరాలేదు. చివరకి రాత్రిపడింది. పాపం యేంచేస్తారు?

మర్నాడు ఉదయం మళ్ళీ ఆబిడ్డను వెదకడానికి కొత్త ఫక్కీ ఒకటి నిశ్చయించుకున్నారు. ఇటువైపు ఒకడూ అటువైపు ఒకడూ తలోకదారిగా వెళ్ళడం కంటే అందరూ ఒకలైనులో నిలబడి ఒకరి చెయ్యి ఇంకొకరు కలిపి. పొలం పొడవునా అందరూ వరుసగా నడిచి చూస్తూపోతే ఎత్తైన గోధుమచేనంతా ఒకచిన్న ప్రదేశంకూడా తప్పిపోకుండా గాలించ గలమనుకున్నారు. అలాగే ప్రారంభించారు. వెంటనే అందులో ఒకనికి ఆ బిడ్డ శరీరం కనబడ్డది. రాత్రిలో భయంవల్లా, మంచువల్లా ఆ బిడ్డ చనిపోయింది. ఆచిన్ని కళేబరాన్ని వాళ్ళు ఇంటికి తీసుకువెళ్ళారు. తండ్రి ఆ బిడ్డను చేతులలోనికి తీసుకున్నాడు. దుఃఖంతో తల నిమిరేడు. అకస్మాత్తుగా తన తల పైకెత్తి "భగవంతుడా ముందుగానే ఎందుకు మేము చేతులు కలపలేము?" అన్నాడు.

మన సమస్య కూడాఅదే. ముందుగానే చేతులు కలపలేకపోయే తప్పిదాన్ని మనం చెయ్యకుండా ఉందుముగాక!

—ఆస్కార్ ఆర్. ఇర్వింగ్

అజ్ఞాత వీరులు:

డాక్టర్ దత్తు



రచన :

శ్రీమతి రతన్‌ప్రభా రాయ్

వరసగా మూడోరోజునకూడా నేనూ, నా సహాధ్యాయులూ క్యూలో నిలబడ్డాం. ఆరోజు కూడా మాకు ఎంతో నిరుత్సాహం కలిగింది. ఆ ప్రఫుల్లవదనమూ, ప్రతిధ్వనించే నవ్వూ, కరుణారస పూరితమైన చూపూ, మేము దర్శించే భాగ్యం లేకపోయింది. మా డాక్టరు ఏ విధంగా చూచినా అసామాన్యమైన వ్యక్తిత్వంగలవాడు. పొట్టిగా దృఢమైన శరీరం, శాంతమూ ఆనందమూ ప్రస్ఫుటించే ముఖం. రోగార్తులయెడ మానవ స్వభావం, దయా హృదయంలో దృఢంగా దాచుకున్నాడు. అదే వారిని రేయింబవళ్ళు ఇల్లు చేరనీయదు. ఇప్పుడుకూడా రెండు రాత్రులూ, రెండు పగళ్ళూ విడిచిపెట్టకుండా ఉండ వలసిన ఆగత్యం ఒక రోగివల్లనే.

మేమింక వెళ్ళబోతుండగా డాక్టరు డిస్పెన్సరీకి రావడం చూశాము. ఒంటిపై వారికి చొక్కా లేదు. ఆయన చొక్కా ఏంచేసి ఉంటారో అందరూ ఊహించుకోగలరు.

"లెవెల్ క్రాసింగు దగ్గర ఒక బీద ముసలివాడు రెండణాలు ఇవ్వమని అడిగాడు. నేను రెండు రోజులనుంచి ఇంటికి వెళ్ళడం లేదని మీకు తెలుసుగదా! ఉన్న కానులు నిన్ననే ఇచ్చేశాను. పాపం అవధ్యుడైన ఆ ముసలివాడు ఒంటిమీద గుడ్డపేలికైనా లేకుండా చలిలో గజగజ వణకడం చూచి భరించలేక పోయాను. నేనతనికి ఇవ్వగలిగిందేముంది. చొక్కా తప్ప?" అని ఆయన అన్నారు. ఇంత కంటే ముచ్చటగొల్పే మాట ఇంకొకటి చెప్పారు. "నేను ఇంటికి వెళ్లేలోగా మీరెవరూ మా యింటికి వెళ్ళి మా ఆవిడతో చెప్పకండేం!"

నిజం చెప్పాలంటే డాక్టరు భార్యకి ఇలాంటివి పరిపాటే. డాక్టరు పాదరక్షలుగాని, దుస్తులుగాని ఎప్పుడూ చిరిగి ఉండడం చూడం. క్రొత్తవేవస్తాయి క్రొత్తగానే వెడతాయి.

ఇంకోసారి వర్షం ధారాపాతంగా కురుస్తూఉంటే అర్ధరాత్రి రోగిని సందర్శించడానికి దూరంగా ఉన్న పట్టణం వెళ్ళారు. రోగిని చూచారు. గాఢాంధకారంలో తిరిగి ఆసుపత్రికి వచ్చారు కాని ఆయన దవుడ, గడ్డం చితికిపోయి ఉన్నాయి. చీకట్లో ఆయన సైకిలు పెద్ద రాయికి ఢీకొంది. అది కొన్ని మాసాలపాటు ఆయనను మంచాన్ని పడవేసింది. అయినా స్వస్థత చేకూడడంతోనే ఆయన సేవాకార్యం నిర్వర్తించడానికి నిరుత్సాహ పడలేదు—ధనార్జన లేకపోయినా.

ఈ దీనదయాళునికి సంగీతమంటే వెర్రిఇష్టం. పొద్దు పొడవకుండానే ప్రభాతగానాన్ని ఆలకించడానికి లేచి కూర్చుంటారు. చీకటిలోనే తన పుత్రికలను లేపుతాడు సంగీతం సాధన కోసం. వారు వీణలు మీటుతూంటే ఆతాళానికి కన్నులు మూసుకుని శ్రమతీర్చుకుని వెంటనేలేచిపోతారు. ప్రభాతసమయంలోని భైరవిరాగమూ, ఖయాల్ ఆయనను పరవశత్వము చేసినట్టు ఏ మత్తుపదార్థమూ చెయ్యలేదు.

"నా ఉత్సాహం అంతా మా నాన్నే" అని అంది. అఖిలభారత సంగీతపోటీలలో విజయంగాంచిన డాక్టరు పెద్దకూతురు నీలిమ. ★

లూథరన్ స్కూల్ ఫర్ ది బ్లైండ్

రెంటచింతల, గుంటూరుజిల్లా

స్థాపితము :

1911 వ సంవత్సరము

వ్యవస్థాపకులు :

డాక్టర్ ఆల్ బ్రెట గారు, వారి భార్య. వీరు క్రిస్టియన్ మిషనరీలు

అధ్యక్షురాలు :

శ్రీమతి వర్మ ఎ లోఫ్ గ్రమ్‌గారు

ఆశయం :

గ్రుడ్డివారి సంరక్షణ, విద్యాభ్యాసం

కార్యక్రమం :

గ్రుడ్డి విద్యార్థులకు ఉచితముగా వసతి, భోజన సౌకర్యములు కలుగచేసి వారికి చదువు చెప్పుతున్నారు. ఇదే కాక త్రాళ్లు అల్లుట, నవారు, చాప నేత, పేము పని మొదలగు చేతి పనులలో శిక్షణ నిస్తున్నారు. విద్యార్థులు గాత్ర సంగీతము, వాద్య సంగీతములలో గూడా తర్ఫీదు పొందుతున్నారు.

ఆర్థికస్థోమత :

ఆదాయం రు. 3,500 లు, ఖర్చు రు. 7,300 లు. చర్చి వారిచ్చే వార్షికాలు, చందాలు, ప్రభుత్వంవారి గ్రాంటు, విద్యాలయంలో తయారైన వస్తువుల అమ్మకం— యివే యీ సంస్థ పోషణకు ఆధారాలు.

గమనిక :

ఈ సంస్థలో 60 మంది విద్యార్థులదాకా చేర్చుకోడానికి అవకాశంవుంది. ప్రస్తుతం 42 గురు మాత్రమే వున్నారు. కార్యభారం వహిస్తోన్నవారు అంతా మిషనరీలే— అయిదుగురు ట్రెయినింగు పొందిన వుపాధ్యాయులు, ఒక మేనేజరు. మేనేజరు వేతనం లేకుండానే పనిచేస్తున్నారు.

—సోషల్ వెల్ఫేర్ ఇన్ ఇండియా నుండి.

తానూ మనిషేనా?

శ్రీ జి. వి. యల్. నరసింహారావు

రామం తల్లీ, తండ్రీ అతని చిన్నతనంలోనే చనిపోయినా మేనమామ ప్రకాశరావుగారు ఆస్తిపరులుకావడం, అందులోనూ ఆయనకు పిల్లలు లేకపోవడం— ఈ రెండు కారణాలూ రామానికి 'అనాథ'త్వాన్ని అంటగట్టలేకపోయినై. సరస్వతమ్మగారు రామాన్ని కన్నబిడ్డలా ఆదరించి అతనికి తల్లిలేని లోటు తీర్చింది. ప్రకాశరావుగారు సరేసరి! ఏక్షణంలో ఏది కోరితే దానిని క్షణాలలో సమకూరుస్తూ అల్లారు ముద్దుగా చూచుకుంటున్నారు. అందుకనే ఇరవై ఏళ్ళు వచ్చినా రామానికి తల్లీ తండ్రీ లేని లోటే కన్పించలేదు.

బి. ఏ. పరీక్ష వ్రాసిన రామానికి వెంటనే ఉద్యోగం కోసం అప్లికేషన్లు పెట్టాల్సిన అవసరం లేకపోయిందంటే అందుకు కారణం ప్రకాశరావుగారి ఆస్థిమాత్రమేనని చెప్పాలి. రామం ఉద్యోగం చెయ్యాలని ఉబలాటపడ్డా, ప్రకాశరావుగారు అనుభవజ్ఞులు కాబట్టి ఉద్యోగం చెయ్యడంలో ఉన్న సాధకబాధకాలను వివరించి "అధికారుల మెడలువంచి అస్వతంత్రపు బ్రతుకు బ్రదికేకన్నా తనకున్న ఈ ఆస్తులను అజమాయిషీ చేసుకుంటూండ"మని సెలవిచ్చారు. ఆలోచించినమీదట రామానికికూడా మామగారి సలహా సబబుగానే తోచింది. ఇష్టపడ్డాడు కూడాను.

కాని అసలు వచ్చిన చిక్కల్లా తన పెండ్లి ప్రయత్నాలదగ్గరే! ప్రకాశరావుగారికి మరో తమ్ముడుకూడా ఉన్నాడు. ఆయనకు ఒక్కతే కూతురు శ్యామల. శ్యామలను రామానికిచ్చి వివాహంచేస్తే- తమకిద్దరకూ పురుషసంతానం లేదుగాబట్టి ఆస్తులు పరాయత్తంగాకుండా లక్షణంగా ఉంటుందిగదా అని ఆలోచించి ప్రకాశరావుగారు మూడేళ్ళక్రితమే తమ్ముడు సుబ్బారావును పిలిచి తన నిర్ణయం తెలియజేశాడు. తమ్ముడు కూడా ఆ సూచనను సహర్షంగా ఆమోదించాడు. ఈ విషయం మరో చెవిని పడకపోయినా 'శ్యామల రామూ భార్య' అని అందరూ రూఢిపరచుకున్నారు. అయితే శ్యామల తన భార్య కావడం గురించి రామం ఎప్పుడూ ఆలోచించనేలేదు.

రామం తెలివిగలవాడే అయినా అతనిలో దీక్ష, దృఢత్వం, ఆశయాలు, ఆచరణ- యివన్నీ పూజ్యం; చిన్నప్పటినుండీ మామయ్య అతనిని పెంచిన తీరునుబట్టి అతనికి సోమరితనం, భోగలాలసత్వం బాగా పట్టుబడిపోయాయి. సుకుమారమైన అతని శరీరంలాగే హృదయంకూడా అతి మెత్తనిది. అందుకనే అతనిలో పట్టుదల, సాహసం పూజ్యం!

రామానికి ఎలాగయినా ఈ లగ్నాల్లో వివాహం చేసెయ్యాలని ప్రకాశరావుగారు ప్రయత్నిస్తున్నారు. జోరుగా సన్నాహాలు సాగించడం ప్రారంభించారు. రామం గూడా ఈ విషయాలను గమనిస్తున్నాడు. అతనెప్పుడూ శ్యామలను వివాహమాడాలని అనుకోలేదు. అతని దృష్టి వేరుగా ఉంది. అందుకనే పచ్చివెలక్కాయ గొంతును పట్టేసినట్టు బాధపడుతున్నాడు రామం. అటు ప్రకాశరావుగారికీ సాహసించి చెప్పలేడు. అట్లని యిటు కమలకూ ద్రోహం చెయ్యలేడు. ఈ సంధిలో బడి కొట్టుమిట్టాడుతున్నాడు రామం.

ఒక మధ్యాహ్నం ప్రకాశరావుగారు వచ్చి రామం దగ్గిరే మరో కుర్చీలో కూర్చున్నారు. రామం పుస్తకం మూసి తలెత్తి చూశాడు. ప్రకాశరావుగారు తనదగ్గరకు వచ్చి కూర్చున్నారంటే ఏదో విశేషమున్నదన్నమాటే! రామం ఆశ్చర్యంగా మామయ్య ముఖంలోకి చూశాడు.

"రామం, చూడు... కాస్త పట్నం వెళ్ళి ఈ శుభలేఖలు నీకు నచ్చిన విధంగా అచ్చేయించుకురా నాయనా— నేనొక్కణ్ణే ఎన్నిపనులని చూసుకుంటాను?" ప్రకాశరావుగారు కుతూహలంగా చెప్పారు. కాని రామం ముఖం వివర్ణమయింది. కనుబొమలు ముడతలుపడినై. భారంగా నిట్టూర్చి అన్నాడు. "ఎందుకు మామయ్యా?" ప్రకాశ

రావుగారు విస్మయంగా అడిగారు "ఎందుకేమిటి రామం, నీ వివాహం కోసం".

రామం తన మనస్సులో ఉన్నదంతా చెప్పెయ్యాలనుకున్నాడు. అవును. తన అభిప్రాయం చెప్పడానికింతకన్న మంచి సమయం దొరకదు. కాని చెప్పలేకపోయాడు. "నేనిప్పుడు పెండ్లి చేసుకోను!" క్లుప్తంగా మట్టుకు అనేసి ఊరుకున్నాడు.

"ఏమిటీ, చేసుకోవు ?.... యింత ప్రయత్నము జరిగాకనా ?...." ప్రకాశరావుగారు ఆతురతతోను, ఆశ్చర్యంతోనూ గట్టిగా అన్నారు.

రామం గుండె వేగంగా కొట్టుకుంటూంది, రక్తం గబగబ పరుగెత్తుతోంది. "చేసుకోను"— భయంగా వంచినతల ఎత్తకుండానే అన్నాడు.

"మరేం చేస్తావ్" ప్రకాశంగారు నిష్ఠూరంగా అన్నారు. "నాకీ సంబంధం యిష్టంలేదు"—— రామంఎంత తాపీగా అనాలనుకున్నా కంఠం వణుకుతూనేవచ్చింది.

ఏమిటీ ?....ఏమిటీ ? ఈ సంబంధమే యిష్టంలేదూ?" ప్రకాశంగారు ఖంగారు, క్రోధము. విస్మయమూ పెనగొనగా గబ గబా అనేశారు కుర్చీలో నుండి ఆతురతగా లేస్తూ "ఇదే నీ నిశ్చయమా ?" పళ్ళు పటపట లాడకపోయినా కోపంతోనే అన్నారు. రామం వణికిపోయాడు. మాట్లాడకుండానే ఊరుకున్నాడు. మాట్లాడితే మీదబడి తినేస్తాడేమో అన్నట్లుందాతని స్థితి.

"హుం ... సరే ఆలోచించు !" క్షణంసేపు రామం వంకచూసి ఇలా అనేసి వెళ్ళిపోయారు ప్రకాశరావుగారు. రామం అలాగే ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఒక గంట తర్వాత సరస్వతమ్మగారు వచ్చింది. ఎన్నో విధాల ఆమె బతిమాలి చెప్పింది. రామం దేనికీ సమాధానం ఇవ్వలేదు. సరస్వతమ్మగారే రామం తల నిమురుతూ చెప్పింది శ్యామల తెచ్చే ఆస్థి, తామిచ్చే ఆస్థి యింకేంకావాలి? ఎంత సుఖంగా జీవించవచ్చు ? కళ్ళవెంట నీళ్ళుపెట్టుకుని బతిమిలాడింది. చివరిమాటగా ప్రకాశరావుగారు చెప్పమన్నారని ఒకమాట గూడా చెప్పింది. "శ్యామలను పెండ్లిచేసుకునే వాడికే తమ ఆస్థి దఖలు పడుతుందట",

కీలెరిగి వాత పెట్టినట్లయింది రామానికి. అతనికి బలహీనత ఎక్కడుందో అక్కడే....సరిగా అక్కడే ఈ మర్మఘాతం తగిలింది. యాపాయి లేనిదే తాను దమ్మిడీకి మారనని అతనికి తెలుసు. డబ్బులేకుండా తను బ్రతుకలేడు. అంటే ప్రకాశరావుగారి ఆస్థిలేకపోతే తాను బ్రదకలేడు. అంతేగాకుండా అత్తనూ మామనూ తిరస్కరించి వారితో సంబంధాలు వదులుకోలేడు. ప్రకాశరావుగారు ఆషా మాషీగా మాట్లాడే వ్యక్తిగాదనీ. వ్యవహారంలో ఖచ్చితమైనవాడనీ అవసరమయితే తన యావదాస్తినీ 'వినోబా భావేగారి ఏదో దాన యజ్ఞానికి వ్రాసి యిచ్చేయగలడనీ' రామానికి బాగా తెల్సు. అందుకనే ఎట్టకేలకు రామం లొంగిపొయ్యేడు. మామగారికి 'జో హుకుం' చెప్పాడు, వివాహం సలక్షణంగా జరిగిపోయింది. రామం తన మిత్రులెవరినీ ఆహ్వానించలేదు. అతనికి కమల విషయం హృదయాన్ని కోసివేస్తోంది.

• • •

కమల దగ్గరనుండి రోజూ ఉత్తరాలు వస్తున్నాయి. రామం జవాబివ్వకపోవడంతో ఆ ఉత్తరాల ఉరవడి మరింత హెచ్చింది. ఈ ఉత్తరాలను జూచి రామం కంపించిపోతున్నాడు. అతన్ని కవ్వించినట్లు పోస్టుమాన్ రోజూ ఉత్తరాలు తెచ్చి అందిస్తూనే ఉన్నాడు.

కమల రామానికి క్లాసుమేటు. ఇంటరుమీడియటు దగ్గరనుండీ బి.ఏ. వరకూ ఏకంగా నాలుగేళ్ళు కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఇంటర్‌మీడియట్‌లోనే హృదయాలు మాట్లాడుకున్నా. డిగ్రీ క్లాసులోనే ఉత్తరాలు సంభాషణలు నడిచాయి. వారిద్దరూ "ప్రేయసీ ప్రియులని" కాలేజీ ఏకంగా వారికొక సర్టిఫికెట్టుగూడా ప్రసాదించింది. చివరి రోజుల్లో వారి ప్రణయం విచ్చల విడిగా నడిచింది. పట్నంలోవారి గ్రామాలకు చెందిన విద్యార్థులెవరూ లేరుగాబట్టి వారి ప్రణయం పెద్దవారి నోటీసుల పాలుగాకుండా తప్పించుకుంది.

బి. ఏ. పరీక్షలు వ్రాశారు. ఆమరునాడు ఎవరి యిళ్ళకు వారు వెళ్ళిపోతారు. రామం, కమలం యిద్దరూ ఆరోజు సినీమాకు వెళ్ళారు, బాక్సు తీసుకున్నారు. సినిమా చూస్తున్నారు. కాని వారి అనుభూతులు వేరుగా ఉన్నాయి. అంతవరకూ వారు దూర దూరంగా ఉంటూ వచ్చారు. ఈరోజు వారికా అడ్డులేమీలేవు. సినీమా పూర్తిగాకముందే వాళ్ళు బయటికి వచ్చేశారు. రామం కమలాన్ని సరాసరి తన రూముకే తీసుకుపోయాడు.

కమలం చిక్కులో పడ్డట్టు తెలుసుకుంది. దానితో కమలానికి మతిపోయినట్లయింది. రోజూ రామానికి ఉత్తరాలు గుప్పించి వేస్తోంది. అంతవరకూ ఉత్తరాలు వ్రాస్తున్న రామం — ఈ పాపానికి మూలపురుషుడై యుండీకూడా ఉత్తరాలు వ్రాయడం మానుకున్నాడు. రామం సంగతి తెల్సుకుని బాధపడుతున్నాడు. ఏదో పాపం చేసినవాడిలా హృదయం దహించివేస్తోంటే అతనిలో ఉత్సాహం హరించిపోయింది.



మణిపురి పురోభివృద్ధికై తోడ్పడే మణిపురి మహిళ చేనేత మగ్గముపై నేతనేయుట.

ఆరోజు వెంటనే బయలుదేరి రమ్మనమనీ, కనీసం ఉత్తరం వ్రాయమనీ, లేకపోతే తానే బయలుదేరి వస్తున్నాననీ కమల తీవ్రంగా వ్రాసింది. ఆవుత్తరం చదివిన రామం గుండె ఆగిపోయినంత పనయింది. కమల యిక్కడకువస్తే జరిగే రభస ఎలాంటిదో ఊహించుకున్నాడు. చివరకు కలం, కాగితం తీసుకుని బహునెమ్మదిగా వ్రాశాడు.

"కమలా,

చేయరాని పాపం చేశాం. ఫలితం వెంటనే సిద్ధమయింది. ఇందులోమనయిద్దరమూ సమభాగస్థులమే!... చేసిన తప్పు సరిదిద్దుకునేందుకు బదులు నేను మరోతప్పు చేశాను. ఇంకొక స్త్రీని వివాహమాడాను !!

ఇప్పుడు నేను వివాహితుడను. నీవు బయలుదేరి రావద్దు. నేనే ఏదో ఒకటి ఆలోచించి తెలియజేస్తాను.

....నావంతు పాపానికి క్షమిస్తావుగదూ !!!

నీ—రామం"

ఉత్తరం కవరులోపెట్టి వెంటనే పోస్టు చేయించాడు కూడాను.

వ్రాయడమయితే వ్రాశాడుకాని దీనిఫలితం ఎలా ఉంటుందో అని గుండె చేత్తోపట్టుకు ఎదురు చూస్తున్నాడు. అయిదోరోజున ఉత్తరం వచ్చింది. అందులో కమల నిష్ఠూరంగా వ్రాసింది—

"ప్రియుడా,

నీ నిర్ణయం నా జీవితాన్ని నలిపివేశింది. మొద్దుబారిన హృదయం నీది; మోడువారిన జీవితం నాది.... గుబాళించే కుసుమాన్ని, కోమలమయిన కమలాన్ని — నీ కర్కశహస్తాలతో నలిపివేశావ్! కాలిక్రింద.... నిర్దయగా త్రొక్కిపోయావ్ !!

...జీవితాలతో నిర్లక్ష్యంగా ఆటలాడే నీకు క్షమ ఎక్కడిది ?

మరియొకమాట : కోర్టులో నీపై అభియోగముతెచ్చి నెగ్గలేకపోను. మనం దిగినఫొటోలు, నీవు వ్రాసిన ఉత్తరాలు నాకు మంచి సాక్ష్యాలు.

....కాని,....నూతన వధువుకోసం నిన్ను వదిలే

స్తున్నాను. అడవిలో మొద్దులా, లోయలో శిలలా — చిరకాలం భ్రమరు. మరి సెలవ్....!

యిట్లు,
తుదినమస్కారములతో,
జీవితంలో—ఓటమి—తిన్న,
'కమలం' "

మాటల్లోనిగూఢత్వాన్ని, కదలికమబట్టి మన స్తత్వాన్ని, గ్రహించడం చేతగాని రామానికి ఈ ఉత్తరం చూశాక మనస్సు సంతోషంతో కదిలింది. తనపైనుండి ఏదో, పెద్దభారం దిగిపోయినట్టు తేలికపడ్డాడు రామం. కమల పెద్ద రభస చెయ్యకుండా, మరోదారి చూసుకొనడానికి సిద్ధపడడం రామానికి చాలా సంతోషం కల్గించింది. ఆధారాలున్నా అభియోగం తేనందుకామె ఔదార్యాన్ని మనస్సులోనే అభినందించుకున్నాడు. ఆరోజు సంతోషంగా గడిపాడు రామం — శ్యామల ముఖం వికసించింది.

ఆమరునాడే పరీక్షాఫలితాలు వచ్చేశాయి. రామం ఆతృతతో నంబర్లు దొర్లించేస్తున్నాడు. తనకెలాగూ 'క్లాస్' వస్తుందని నమ్మకంలేదు. అందుకని సెకండు క్లాస్‌లోనే తన నంబర్లకోసకం వెదుక్కుంటున్నాడు. తన నెంబ రెక్కడా కన్పించనేలేదు. గుండె వేగం హెచ్చి, చేయి వణకిపోతుంటే పేపరు కదలిపోతోంది. అంకెలన్నీ అలముకుపోతోన్నై. సబ్జక్టు పేర్లే కన్పించడంలేదు. ఈస్థితిలో థర్డ్‌క్లాస్‌లో గాలాంవేశాడు. అచటఉన్న అసంఖ్యాకమయిన నంబర్లను చీరుకుపోతున్నాడు. ఎలాగైతేనేం, తన నంబరు పట్టేశాడు. తాను పాసయాడు. థర్డ్‌క్లాస్‌లో పాసయాడు. చాలదూ? ఆందోళన యింకా తగ్గలేదు. హృదయం మధురంగా, నిండుగా ఊగుతోంది. అప్పుడు కమలం విషయం గుర్తు వచ్చింది. ఆమెకోసం చూశాడు. ఫస్ట్‌క్లాస్ రాలేదు. కాని సెకండుక్లాసు వచ్చింది. — "అవును తనకంటే కమలం అన్నింట్లోనూ మిన్నే! తనకంటే గొప్పగా సెకండ్‌క్లాస్ సంపాదించింది. — మరొకప్పుడైతే కమలం సాధించిన ఈవిజయానికి అమాంతం లేచి డాన్సు ప్రారంభించేవాడే .. కాని, ఏం లాభం. ఇవాళ కమలానికి, తనకూ ఉన్న సంబంధం దొల్లబోయింది. అబ్బ, ఆరోజులెంత మధురంగా ఉండేవి?...." — యిలాగే ఏవేవో మధురమయిన తలపులతో తనకు తెలియకుండానే, పిచ్చిగా పేపరంతా కలయజూస్తున్నాడు. నంబర్లన్నీ అయిపోయాయి, క్రింది భాగంలోఉన్న ఒక వార్త "20 ఏళ్ళ యువతి ఆత్మహత్య" అన్న వార్త రామాన్ని ఆకర్షించింది. ఎందుకనో హృదయం తొందరపడుతోంటే గబ, గబా చదివాడు. — "పట్నంలో బి.ఎ., స్టూడెంటు 'కమల' అనే 20 ఏళ్ళ యువతి మొన్న ఉదయం విషం తిని హాస్పిటల్‌లో చేర్చిన కొద్దిసేపటికి మరణించింది. ఆమె వ్రాసియుంచిన లేఖలో తన ప్రియుడు మోసగించాడనీ, గర్భిణీ వచ్చినదనీ, తలిదండ్రులకు ముఖం చూపలేక మరణిస్తున్నాననీ. — తన చావుకెవరూ బాధ్యులు కారనీ వ్రాసినట్లు తెలుస్తోంది" — రామం ఒక్క పొలికేకవేసి పిచ్చివాడిలా హాలులోకి పరుగెత్తాడు. అక్కడేదో తగిలి తల్లక్రిందులుగా పడిపొయ్యాడు. రామానికి దెబ్బ తగిలి స్పృహ తప్పింది. రామం మెదడు దెబ్బతింది. సాయంత్రానికల్లా జ్వరం ముంచుకొచ్చేసింది. రాత్రల్లా జ్వరం తగ్గలేదు. రామం ఒకటే పలవరింతలు "కమలా....కమలా. ఇదిగో నేనూ వస్తున్నా! తీసుకెళ్ళవూ? కమలా, ఓడిపోయింది నీవుకాదు. నేనే! ముమ్మాటికీ నేనే ఓడిపోయాను కమలా!. ఒక్కసారి గాదు — అనేకసార్లు ఓడిపోయాను....నీవు ఒక్కసారి ఓడి చనిపొయ్యావు, నేను ఇన్నిసార్లూ ఓడి చావలేకున్నాను....కమలా....కమలా నాది పిరికి గుండె! నీదే. ఫస్టుమార్కు నీదే కమలా....నేను ఫెయిలయ్యాను; ఇదిగో కమలా....బాబోయ్, చంపెయ్యబోకు, నన్ను పీక్కుతినకు నీపుణ్యముంటుంది? కమలా, కమలా.... రక్షించవూ? నన్ను క్షమించవూ?" ఇలా ఇల్లంతా లేచిపోయేటట్లు పెడబొబ్బలు పెడుతున్నాడు. అమాంతం మంచంమీదనుండి లేచి పరుగెత్తబోతున్నాడు. తెల్లవారుఝామున నేటివ్ డాక్టరు వచ్చిచూచాడు. "సంధించింది" అన్నాడు ముఖం త్రిప్పుకుంటూ. అంతవరకూ కన్నీటితో రెప్పవేయకుండా సేవజేస్తోన్న శ్యామల, గుండెబేజారై ఏడుస్తూ కూర్చున్న సరస్వతమ్మగారూ ఒక్కసారిగా గొల్లుమన్నారు. రామం ఉత్తరాలను, డైరీని తనిఖీజేసి అప్పుడే ఆగదిలో అడుగుబెటిన ప్రకాశరావుగారు విచారంగా అన్నారు. "రామంకోసం కమల బలిఅయిపోయింది. ఆరామంకోసమే శ్యామల కన్నీరుకారుస్తోంది. తనకోసం ఆశించిన ఈ యిద్దరికోసమే రామం ఈ స్థితికి వచ్చాడు!....తనకోసము, తన సౌఖ్యంకోసము లోభించిన రామం కమల ప్రాణాలను బలికొన్నాడు. శ్యామలకు తీరని వ్యధకల్పించాడు" — ఆధ్వనిలో ఈమాటలు ఎవరికీ వినిపించలేదు. అయినా ఈమాటలనే పదేపదే గొణుక్కుంటూ తలవంచుకు కూర్చున్నాడు ప్రకాశరావు.

శ్రవ్యనాటిక: రచన : శ్రీ కె. కోటేస్

చీడపురుగు

పాత్రలు :

మూర్తి, ఆనందరావు, రామయ్య,
పార్వతి, సుబ్బమ్మ.

సమయం : రాత్రి 10 గంటలు

(తలుపు కొట్టుచున్నచప్పుడు వినిపించాలి)

మూర్తి : (లోపలనుంచి) ఎవరు?

పార్వతి : (బయటనుంచి) తలుపు తీయండీ (తలుపుకొట్టు చున్న ధ్వనివినిపించాలి)

మూర్తి : (తలుపుతీసి ఆశ్చర్యంతో) ఎవరూ ... (కొద్ది కాలం నిశ్శబ్దం) లోపలికిరండీ! ఇంతఅర్ధరాత్రి వంటరిగా ఇక్కడకు వచ్చారేం? ఎవరన్నా చూస్తే?

పార్వతి : క్షమించాలి! మీరేం అపార్థం చేసుకోరని యిక్కడకు వచ్చాను...

మూ : క్షమించాలి! నేనేం అపార్థం చేసుకోలేదుకాని...

పా : మీరు లోకానికి భయపడతా రనుకుంటాను.

మూ : లోకానికి భయపడితేనేగా యీలోకంలోబ్రతికేది?

పా : లోకులు కాకులు అని మీకుతెలుసా?

మూ : ఆసంగతి అందరకు తెలుసు కాని లోకాన్ని ఎదిరించి ఎవరూ పొట్లాడుటకు ముందుకు రారు లోకానికి, సంఘానికి భయపడితేగాని సంతోష, సుఖాలు అనుభవించలేం!

పా : మీరు యింకా పాత కాలంలోనే ఉన్నారు. లోకం, సంఘం, ఈ రెండింటికి భయపడి పండు లాంటి జీవితాలను బలిచేసుకుంటున్నారు. తింటానికి అన్నం, కట్టుకోటానికి బట్ట యివ్వని యీలోకానికి సంఘానికి, భయపడటం దేనికి? సంఘం. లోకం, అని ఎన్ని ప్రాణాలు బలి అవుతున్నాయి.

మూ : ఎన్ని ప్రాణాలు బలి అయినను లోకానికి. పేరు ప్రతిష్టలున్నాయి. ఆవిధంగా చేయడం వాటి విధి. పూర్వాచారములను, మన పూర్వుల గౌరవములను మన దేశాచారములను రక్షించుటకు సంఘం. లోకం ఉండాలి. అవిలేకపోతే యీ ప్రపంచమంతా తారుమారు అవుతుంది.

పా : క్షమించాలి! మీరు యింకా పాతకాలంలోనే ఉండి ఆచారాలంటూ సంఘానికి, లోకానికి భయపడుతున్నారు. అనవసరంగా మిమ్మల్ని యీ ప్రసంగంలోనికి దించినందుకు క్షమించాలి.......

మూ : పర్వాలేదు. అన్నట్టుమీరు....

పా : యీరోజు చెప్పిన బాట్నీనోట్సు యిస్తారా?

మూ : దానికేం తీసుకొని వెళ్ళండీ.

పా : అప్పుడే వెళ్ళమంటున్నారేం?

మూ : క్షమించాలి! ఏదో పొరపాటున వెళ్ళమన్నాను. (కొద్దిగాఆగి) అయినా మీ బోటివారికి మారూమ్ ఏం నచ్చుతుందిలెండీ! చెత్త చెదారంతో నిండివుంటుంది. అందమా, అలంకారమా....

పా : మీరూమ్ చూస్తుంటే నాకు చాలాఆనందంగావుంది.

మూ : అంటే మారూమ్ చాలాఆనందం చేకూర్చిందన్న మాట మీకు. సంతోషం!

పా : చాలా రోజులనుంచి మిమ్మల్ని ....

మూ : ఆ! అడగండి.

పా : అన్నట్లు మీది ఏవూరు?

మూ : అల్లూరు.

పా : మీ తండ్రిగారి పేరు?

మూ : రామకృష్ణయ్యగారు.

పా : ఏం పని చేస్తుంటారు?

మూ : పూర్వం కరణంగా పనిచేశారు.

పా : మీరు యిష్టపడితే ...

మూ : చెప్పండి ! ....

పా : నన్ను వివాహం చేసుకుంటారను కొంటాను.

మూ : మన్నించాలి ! నేను తిండానికి కూడు, కట్టుకోడానికి బట్టలు లేనివాణ్ణి. గవర్నమెంటు ధర్మాన నన్ను చదివించు చున్నారు. మీరు ధనవంతులు. నేనొక పేద వాణ్ణి. నాకు 'నా' అనేవారు లేరు. అయినా మీనాన్న గారికి డబ్బు ప్రధానం. డబ్బుతో మురిగేవానికిచ్చి నిన్ను పెండ్లి చేస్తాడు.

పా : అవును. మానాన్నకు డబ్బు కావాలి ! అదివుంటేనే గాని మనిషి కాదంటారు. ఆయనకు ఎట్లాగయినా బుద్ధి చెప్పాలి.

మూ : కాని అదిమనకు సాధ్యపడదుగా?

పా : ఎందుకు సాధ్యపడదు? మీకు ప్రాణ స్నేహితులు ఎవరేనా వున్నారా?

మూ : వున్నాడు.

పా : ఎవరు?

మూ : ఆనందరావు.

పా : మంచివాడే. అయితే నేను చెప్పినట్లుచేస్తారా?

మూ : తప్పకుండా చేస్తాను.

పా : ఆనందరావుది ఏవూరు?

మూ : కాకాని.

పా : వాళ్ళ నాన్నావాళ్ళూ ఆస్థిపరులను కుంటాను.

మూ : అవును. కాని అతనికి తల్లీ, తండ్రీ ఎవరూలేరు.

పా : మరి అతనికి అన్నం వండిపెట్టేదెవరు?

మూ : వంటమనిషి.

పా : మీరు ఆనందరావును కలుసుకొని, మీకు ఒక సహాయంచేయమని కోరగలరా ? ఆనందరావుని మూర్తిగా నటించమని కోరండి. మీరు ఆనంద రావుగా నటించండి.

మూ : దానివలన మనకు లాభం ?

పా : మా నాన్నగారు మిమ్మల్ని ఆనందరావుగా భావించి పెండ్లిచేస్తారు.

మూ : మన సుఖంకోసం అబద్ధం ఆడమంటారా ?

పా : ఆడాలి.

మూ : నేను చస్తే అబద్ధం ఆడను.

పా : మూర్తిగారూ ! మీరు భయపడుతున్నారు. సంఘాన్ని రక్షించాలని మీరు చెప్పేరుగా.

మూ : అవును.

పా : సంఘంలో చీడపురుగుల లాంటివారిని తీసి చీడను వదిలించాలి. ఆ చీడపురుగులలో మా నాన్న ఒకడు. యీ చీడపురుగులకు చీడ వదిలిస్తేనేగాని మనదేశం బాగుపడదు. బాగుపడితేగాని మనకు సంతోష సుఖాలు ఉండవు.

మూ : మంచి ఉపన్యాసం యిచ్చావు పార్వతీ. ఏవిధంగా నయినా చీడపురుగులకు చీడ వదిలించాలి.

పా : అమ్మయ్య ! రేపు ఆనందరావుగారిని తప్పక కలుసుకుంటారుగా. మరి నేను వెళ్ళివస్తాను.

మూ : ఒక్కమాట. యిటు రా. (చేతిని చాచును)

పా : నేను యింకా చీడలోనేవున్నాను. తరువాత ...

(వెళ్ళిపోవును)

• • •

సమయం : ఉదయం 8 గంటలు.

(తలుపు కొట్టుచున్న ధ్వని వినిపించాలి)

మూర్తి : (లోపలనుంచి) ఎవరూ ?

ఆనందరావు : నేనేరా. ఆనంద్‌ని !

మూ : (తలుపు తీయును) హల్లో ! గుడ్‌మార్నింగ్ !

ఆనం : గుడ్‌మార్నింగ్ ! ఇంత ఆలస్యంగా లేచావే ?

మూ : రాత్రినిద్రపట్టలేదురా ! అన్నట్లు నీవు నాకు ఒక సహాయం చేయాలిరా.

ఆనం : రాత్రిపూట నిద్రఎట్లా పడుతుంది. ప్రేయసితో మాట్లాడుతూ కూర్చుంటే.

మూ : ప్రేయసి ఎవరురా ?

ఆనం : పార్వతి. నేనెరగనా?

మూ : నన్ను చంపక ఒక సహాయం చేసిపెట్టు.

ఆనం : రాత్రి పార్వతి ఎన్నిగంటలదాకా వుందిరా ?

మూ : (కోపంతో) ఆసంగతి నీకు ఎవరు చెప్పారురా ? పార్వతి కదూ !

ఆనం : కాదు.

మూ : మీరిద్దరూ కలిసి నాటకం ఆడుతున్నారు. నిజం చెప్పరా ! నీకు పార్వతి యీసంగతి చెప్పిందికదూ !

ఆనం : లేదురా ! రాత్రి సినిమాకు వెళ్ళి 10 గంటలకు నీకోసం నీ రూమ్‌కు వచ్చాను. ఇంతలో నీగదిలో ఎవరిదో స్త్రీ కంఠం వినిపిస్తే ఆశ్చర్యపోయి బయట నుంచుని మీ మాటలు విన్నాను. పాపం ! పార్వతికి ఏమీ తెలియదురా !

మూ : మరి నాకు...........

ఆనం : అదంతా రాత్రి ఆలోచించాను. ఆదివారం పార్వతి తండ్రి వాళ్ళు పెండ్లి చూపులకు వస్తారు. నీవు రెడీగా ఉండు. వెళ్ళివస్తాను.

(వెళ్ళిపోవును)

• • •

సమయం : ఆదివారం ఉదయం 8 గంటలు
(కాకానిలో ఆనందరావు ఇంట్లో)

సుబ్బమ్మ : లోపలకు దయచేయండి.

రామయ్య : (లోపలకు వచ్చును) అబ్బాయి వున్నాడా ?

సు : ఆ ! మీరు ఈరోజు వస్తారని తెలుసుగా ! రంగయ్యా ! పలహారం, కాఫీ తీసుకురా !

రా : ఆ ! ఎందుకండీ ! ఇప్పుడేగా తీసుకొని వచ్చాను! (అంటూ పలహారం ప్లేటు అందుకొనును)

సు : అదిగో అబ్బాయి మేడమీదనుంచి వస్తున్నాడు.

రా : ఆ రెండవ అబ్బాయి ఎవరండీ ?

సు : మా అబ్బాయి స్నేహితుడు.

(ఆనందరావు, మూర్తి మేడ దిగి వత్తురు)

ఆనం : నమస్కారమండీ.

రా : కూర్చోవోయి ! ఏమి చదివావు అబ్బాయి ?

ఆనం : బి ఎస్.సి. చదువుతున్నానండి.

రా : సరే ! మాకు అబ్బాయి నచ్చాడు. మరి మీరు అమ్మాయిని చూడడానికి ఎప్పుడు వస్తారు ?

మూ : మంచిరోజు చూసుకొని వస్తాడులెండి.

రా : ఎల్లుండి మంగళవారం మంచిదండి. ఆరోజురండి.

మూ : సరేలెండి.

రా : మీరుకూడా అబ్బాయి వెంట రండి.

మూ : తప్పకుండా వస్తాలెండి.

(వెళ్ళిపోవును.)

• • •

సమయం : మంగళవారం ఉదయం 8 గంటలు
(రామయ్య ఇంట్లో)

రా : లోపలికి దయచేయండి.

(మూర్తి ఆనంద్ లోపలికి వత్తురు.)

రా : సుబ్బయ్యా ! కాఫీ, టిఫిన్ తీసికొనిరా !

మూ : ఇప్పుడే హోటలులో తీసుకొని వచ్చాం.

రా : పరవాలేదు. తీసుకోండి. అదిగో అమ్మాయి వస్తోంది. ఆ! అమ్మాయ్ పార్వతీ! ఆకాఫీ. టిఫిన్ నీవే తీసుకొనిరా!

(పార్వతి తీసుకొని వచ్చును)

మూ : ఎందాక చదివించారు?

రా : బి.ఎస్.సి. చదువుతున్నదండి.

మూ : పాటలు ఏమైనా వచ్చునా?

రా : సంగీతం వచ్చును. పాట పాడించమన్నారా?

మూ : వద్దులెండి.

రా : వీణకూడా వాయించగలదు.

మూ : మంచిది. మావాడికి మీ అమ్మాయి నచ్చింది.

రా : నిజంగానా! ఈ కోటీశ్వరుడు నాకు అల్లుడుగా వస్తాడన్నమాట. కాఫీ తీసుకోండి.

మూ : వద్దులెండి. ఇప్పుడే త్రాగి వచ్చాం.

రా : కొద్దిగా త్రాగండీ! ఆనందరావు! నీవు కొద్దిగా పాలు త్రాగు. కాఫీ వంటికి జబ్బు. వచ్చే నెలలోనే ముహూర్తం పెట్టిస్తాను.

మూ : తొందరగానే కానివ్వండి. మరి కట్నం?

రా : లక్ష ఇస్తాను లెండి.

మూ : మంచిది. మేము వెళ్ళి వస్తాము.

(వెళ్ళిపోవును.)

• • •

సమయం : రాత్రి 8 గంటలు

(పెళ్ళి పందిట్లో మేళాలు వినిపించాలి.)

మూ : (తొందరగా) పెళ్ళి ఘడియలు ముందుకు వస్తున్నాయి. పెండ్లి కూతురును తీసుకొనిరండి.

రా : అదిగో వచ్చింది.

(మేళాల ధ్వని)

మూ : కట్నం తీసికొనిరండి.

(మేళాలధ్వని)

రా : ఇదిగో

(మేళాలు గట్టిగా వినిపించాయి)

మూ : ఆనంద్! మంగళసూత్రం త్వరగా కట్టు.

రా : అమ్మాయి దగ్గరనీవు కూర్చో లక్ష్మి.

(మేళాలధ్వని)

(పెండ్లి జరిగిన నెలకు ఆ రామయ్యా యింట్లో)

రా : అంతా మోసం! నన్ను మోసంచేశారు.

అసలు ఆనంద్ : ఎవరూ!

రా : నీవే! మా అమ్మాయికి మళ్ళీ పెళ్ళి చేస్తాను. ఆ బీదవాడు నా అల్లుడుకాదు. నాకూతురి భర్తకాదు.

ఆనం : పార్వతి ప్రేమించి పెండ్లి చేసుకొన్నది.

రా : పెండ్లి చేసుకోవటానికి అదిఎవరు? అదిగో పెళ్ళి వారుకూడా వస్తున్నారు. దయచేసి మీరు వెళ్ళండి.

ఆనం : వారు పెళ్ళివారు కాదు. పోలీసులు.

రా : పోలీసులు ఎందుకు వస్తున్నారు.

ఆనం : మీ అల్లుడు పోలీసులకు రిపోర్టిచ్చాడు.

రా : ఎందుకు?

ఆనం : భర్త బ్రతికివుండగానే కూతురికి రెండవ పెండ్లి చేయుటకు ప్రయత్నిస్తున్నందుకు.

రా : ఆ! ఎంత మోసం! అదిగో వస్తున్నాడు....

ఆనం : ఎవరూ! అదిగో మీ అల్లుడు.

(మూర్తి లోపలికి వచ్చును)

మూ : నమస్కారమండీ మామగారు.

రా : మామ ఎవరునీకు?

ఆనం : ఆచేతిలోది ఏమిటిరా?

మూ : టెలిగ్రాంరా. ఫారన్‌నుంచి వచ్చిందిరా.

ఆనం : ఏమని?

మూ : డర్బిలో ఆరు లక్షలు నాకు వచ్చినవిరా.

రా : (ఆశ్చర్యంగా) ఆ! ఆ! నిజంగానా!

ఆనం : నాకు తెలుసు. మీ అల్లుడు అదృష్టవంతుడని. మీ ఆస్తికి మూడు రెట్లు ఎక్కువ. తెలుసా!

రా : అయినా నాకు ఆస్తి ఎందుకు? పిల్లలు ఎవరూ లేరుగా. అంతా ఆ పార్వతి భర్తకేగా.

మూ : బీదవిద్యార్థులకు, బీద మనుష్యులకు మూడు లక్షలు దానంచేశాను.

(అంతలో పార్వతి వచ్చును)

పా : నేను కూడా ఒక లక్ష దానం చేశాను నాన్నా.

రా : ఆ! ఆ! దానం చేశావా? ముప్పయి సంవత్సరాలు సంపాదించినది మూడు నిమిషాలలో ఖర్చుచేశావు. ఇంతకూ నిన్ను అని ఏమీలాభంలేదు. నాఖర్మ.

నర్సు !

చ. దినకరుముందు మేల్కొనుట ! దివ్యతలంపుల దీర్థమాడుటల్ !
జనవునరోగులంగనుట ! సానునయంబున బల్కరించుటల్ !
ఘనమగు రోగబాధ లణగార్చుటకై సకలోపచారముల్
జనుల కొనర్చుటల్ ! గనగ సర్వసమత్వ ప్రభాతమీవెయా !

చ. చకచక రోగులంగనుచు సత్వర మౌషధ మందజేయుచున్ !
పకపక లాడుచుం బలుకుపల్కులు పత్యమొసంగుకైవడిన్
వికట ముఖావలోకనము విడ్వడురోగుల దృక్పథంబులన్ !
మకుటమ వీవునర్సు ! ధరమానవకోటి మహత్వమెన్నగన్ !

చ. విసువు జనించు వేసరము ! వేదనదెల్పెడు హావభావముల్
మసలుటగాన మా ముఖము మర్మవిహీనము ! దర్పణంబునౌ !
దొసగు లెరుంగబోని మదితో డొనగూడ పరోపకారిణీ !
ముసిముసి నవ్వులంగులుకు ముమ్మరమౌగద కార్యమగ్నతన్ !

చ. ఎరుగవు హెచ్చుతగ్గులన నేవిధినుండునొ మచ్చుకేని ! యీ
వెరుగవు యేహ్యాభావ మెటులెప్పుడు మానసమందుజేరునో !
యెరుగవు భేదవాదములు నొతగ నాత్మను కించపర్చునో !
అరుదుగ నేనినర్సు ! భువినార్తుల సేవలొనర్చు పట్టులన్ !

శా. బోటీ ! నర్సు ! కుమారికా ! ఋషులు కాబోరెంతయున్నీసముల్ !
పూటారూకలు మౌనులెల్లగనగన్ పూరాణ గ్రంథంబులన్ !
పాటా గొట్టగవచ్చు మానికుల సంబంధాంశమంతన్నదా !
ఝూటాకోరులు మానవోత్తములనన్ జోద్యంబుగాదా భువిన్ !

ఉ. హాస్పటలేగదా గృహము ! అర్భకులే పెనురోగు లాత్మజుల్ !
వాస్తవమౌగదా ! మదిని వాంఛలెరుంగక సేవజేయుటన్ !
ఓస్తవనీయ నర్సు ! ఇలనోర్పున నీకొరులేరు సాటియౌ ?
జాస్తి దయార్ద్ర శీలమది; జాతిపురోగమ నాంశమయ్యెయున్ !

ఉ. పిన్నలు కన్నబిడ్డలట ! పెద్దలు సోదర సోదరీమణుల్
యెన్నగ వృద్ధులౌదురట యేకముఖంబున దల్లి దండ్రు ! లా
పన్నుల గావగన్ వెలయు పావనదైవత మీవెయౌట ! మీ
కన్యులు నాత్మజుల్ గలర ? అర్థవిహీనము లీవిభేదముల్.

—శ్రీ వల్లభనేని

★ సారె ★

శ్రీమతి ఎస్. కె. రాజేశ్వరీ రాణీ

ఏదీ వినిపించలేదు కమలకు! ఒక్క ఐదువందల రూపాయలు అప్పు మాత్రం అవుపడుతోంది. మూడు బండ్లతో వచ్చిన కోడల్ని చూసి రాజమ్మ మురిసిపోయింది. సారె కుండలు తెచ్చిందని. సాగరునిలా ఉప్పొంగి పోయింది. సారె చీరలు ఖరీదైనవే తెచ్చిందని తైతక్క లాడింది. కమలకు దిష్టితీసి లోనికి పిల్చుకోనిపోయింది. హాలుకు ఒకవేపు అన్నిసామానులూ కమల అన్నగారు పరమేశం పెట్టిస్తున్నాడు. కమల తలవంచుకొని వంటింటి గుమ్మందగ్గర నిలుచుంది. "ఈ చీర భలేబావుంది వదినా! ఎంతట?" అన్న పెద్ద ఆడబిడ్డమాటలకూ "ఇలాంటి చీరే నే కావాలన్నది" అని చిన్నాడబిడ్డా అన్న మాటలకూ కమల బలవంతంగా ఒక్క నవ్వునవ్వింది. ఎంతో కష్టం, నష్టం కడుపులో దాచుకొని అన్న ఇన్ని సామానులతో తన్ను అత్తగారింట దింపాడు. రేపు వెళితే ఏం చేస్తాడు? అసలు ఈరాత్రికే బియ్యంలేవు. తమ్ముడికి అందులో జ్వరం. అమ్మ అప్పంటేనే అదరి పోతుంది. అన్న డెబ్బయిరూపాయల జీతంలో సంసారం నడుపుతాడా? అప్పుతీరుస్తాడా? గొప్పసంబంధమని చేశారు. చెల్లెలుసుఖపడుతుందని. కాని తనో? అందులో రామయ్యదగ్గర అప్పు. ఆ శెట్టి మూడు నెల్లకుపైగా వూరుకోడు. ఎవరి మెడలోనూ కాసంత పచ్చనిబంగారం లేదుకదా!

"అదృష్టవంతురాలివి రాజమ్మా! కోడలు సారె బాగా తెచ్చింది" అని ఎదురింటి వెంకాయమ్మ మెచ్చుకొంది. ఆ మెప్పు రాజమ్మగారికి వజ్రకిరీటం. ఆపాళాన ఆవిడ కోడలివేపు గర్వంగా చూసింది. కోడలంటే ఆమెకోదేవతలా అవుపడ్డది సరివారిలో పరువు కాపాడినందుకు. ఆ వీధి అంతా కోడలు తెచ్చిన పిండి వంటలసారె తాలూకు వన్నీ పంచింది. రామమ్మ నేరుగా ఇంటికివచ్చి ప్రశంసించింది. "మొన్న అడ్డాలవారింటికి కోడలొచ్చింది. అయ్యోపాడు! రెండు సారెకుండలు తెచ్చింది. పాపం తులసమ్మ ఇప్పటికీ తలెత్తుక తిరగ లేకపోతోందే రాజమ్మవదినా! నీకోడలు ఎన్ని తెచ్చింది! లడ్డూలు అమృతమే. అత్తిరసాలూ అంతబావున్నాయి. అలాంటిపాకం అందరికీ రాదు. "ఆడ బిడ్డలకు చీరెలు కూడా తెచ్చింది. చూడు ఇవి" అన్నది రాజమ్మ.

కమలకు రాత్రిళ్ళు ఒకటే కలలు. కన్నవారింటిని రామయ్య జప్తు చేస్తున్నట్టు. కట్టు గుడ్డలతోవారు.... .... కమల వులిక్కిపడి లేచేది, కన్నీళ్ళు కార్చేది. అంతకన్న ఆ పిల్ల ఏంచేస్తుంది? రోజులు గడుస్తున్నాయి. కమల వచ్చి అప్పుడే ఆరు నెల్లు కావస్తోంది. పుట్టింటినుంచి ఓ ఉత్తరంకూడా రాలేదు ఈలోపల. కమల రెండు మూడు ఉత్తరాలకు బదులులేదు. ఒకరోజు సాహసించి భర్తనడిగింది. పుట్టింటివారిని చూసి వస్తాను అని. కమల మరునాడు చిన్న మరిదితో బండీ దిగింది.

ఎదురుపడ్డ పరమేశం ముహం చిట్లించుకొని పోయాడు. కమల వులిక్కిపడ్డది. తాను వద్దన్నా ఎందుకు అప్పుచేసి అవన్నీ తీసి చేసిపంపించాడు అన్న?

వదినా ఆఖరికి తల్లీకూడా ముభావంగానే వుండి పోయారు. వడ్డనలో నెయ్యి కమలకు ఆమె మరిదికి ప్రత్యేకించి వడ్డించింది వదిన. చిన్న పిల్లలు నెయ్యి అని అరిచారుగాని వాళ్ళను వురిమి చూసింది కోడలు.

కమలకు తలకొట్టేసినంత పని అయింది.

"వదినా! నేను వెళ్ళివస్తాను" అని మరిది వెళ్ళి పోయేడు. తాను తిరుగుబండికి వెళ్ళినా అత్తగారింట ఏమి అనుకొంటారు? కమల కన్నీటితో తల్లినిచూసింది. ఆరాత్రి అన్నగారి మాటలు విన్నది. ఇంకా ఏది తక్కువైందని మరిదితో వచ్చిం దీవిడ. ఇప్పటికే గుల్లయింది.

కమల అదిరి పడ్డది. నడివీథిలో మానం పోయినట్టనిపించింది. తానొచ్చింది దేనికి? అయినా తానడుగలేదు కద! తాను అత్తింటి కష్టాలు పడితే పడిందని వూరుకోక మెప్పుకోసం ఎందుకు అప్పయినా చేసి ఆర్భాటాలు చేసింది? తానొచ్చిందే తప్పు.

"నే వెళ్ళిపోతున్నానమ్మా!" అన్నది ఆరాత్రి. అమ్మకు కాలులేదు, ఆవిడ మంచంమీదే ఉంది. పరిస్థితులన్నీ ఆవిడతో చెప్పుకొని ఏడ్చేసింది కమల.

"ఎవరి తప్పూ లేదమ్మా. నువ్విప్పుడు అక్కడ మనిషిలా తిరుగుతున్నావంటే సారె బాగా తెచ్చేవనే.

అంతే. మాకష్టాలు నూరుంటవి. నువు నిశ్చితంగావుండు" అన్న తల్లిమాటలు కమలకు చెంపపెట్టునిచ్చింది. తన తల్లేనా ఇలా మాట్లాడడం? "అమ్మా నేనెందుకింత చేదయిపోయాను" అని ఏడ్చింది.

ముసలామె మనసు కరిగింది. మీ అన్న రోజూ అంటున్న మాటవల్ల నా మనసు విరిగిపోయింది. మెప్పు కోసం పోకపోతే ఆడపడుచువి నీ కంటనీరు కారితే వాడి కుటుంబానికే కీడు. నువ్వు పచ్చగా వుంటే అదే పదివేలు. నువు చింతపడబోకు. నామాట విను" అన్నది.

కమలకు మనశ్శాంతి కలగలేదు. మగతగా కన్ను మూసిం దారాత్రి. రాజమ్మ కోడలి నడవడికను గ్రహించ కలిగింది. అడిగింది ఒకనాడు. కమల తన్ను తాను మర్చి పోయింది. కన్నీళ్ళతో జరిగింది చెప్పివేసింది. రాజమ్మ నోరంతా తెరిచి విన్నది. "అలాగటనే" అన్నది.

కమల ఆ తర్వాత భయపడ్డది. రాజమ్మ కోడలితో ఆపైన ఏమీ పలకలేదు. నాలుగురోజులు గడచిపోయినవి. ఒకరోజు అత్తగారు పిలువగనే కమల భయపడుతూ వెళ్ళి నిలుచుంది.

మన కాంతాన్ని మీతమ్మునికి ఇస్తామని రాశానే. మీ అన్నయ్య వప్పుకొన్నాడు." కమల ఆశ్చర్యంతో వింటోంది. "వారం రోజులుంది ముహూర్తం."

కమల తెచ్చిన సారె ఎంతో అంతా కాంతం వెంట పరమేశం ఇల్లు చేరింది. అత్తగారి దివ్యగుణానికి కమల ఏంచెప్పాలో తోచలేదు. పరమేశం కమల దగ్గర "క్షమించు కమలా!" అన్నాడు. "మా అత్తగారికి నమస్కరించు అన్నయ్యా. నాదెంలేదు. అంతా అత్తయ్య గారి చలవే" అన్నది కమల.

కానీ కమలకదిలిపోయింది. కల చెరిగిపోయింది. దిగ్గునలేచి కూర్చొంది. కల! కల! అలా జరిగితెనా. ఇంకేంవుందీ ఆ పైన!

రాజమ్మగారి మాటలు కమల బండీ దిగిందో లేదో అప్పుడే వినిపించింది. "మెప్పు కోసం ఎవరేడ్వ మన్నారు. పుట్టింటి ఆశ వదులుకోవాలి. అవమానపడి తిరుగ మొహం చూపి ఎందుకొచ్చినట్లు?" మరిది అంతా చెప్పాడని గ్రహించింది కమల. మారుపలుకకుండా లోనికి పోయింది. సారె తేని తోటికోడలు మాత్రం కమలని ఓదార్చింది. "నువెందుకు తెచ్చావు సారె?" "మెప్పుకోసము" అని తన్నుతాను ప్రశ్నించుకొందికమల.

"శూన్యాంతరువు"

ఆశా నిరాశల అంతరువు శూన్యము
వెన్నెలలు చీకటులవలె కలిసియుండు
కృష్ణపక్షపు నిరాశాతమస మధికంబు
శుక్లపక్షపు చంద్రికా శోభలే ఆశలు ;

శుక్లపక్షపు మనసు —

ప్రహ్లాద పాథోధి పయనంబు సాగించి
లోకాలకావల శోకాల తెగత్రుంచి
భువన బాంధవియానాదు, భూతిలో హర్షించి
భవము స్వర్గంబంచు బాసాడె, తనియు.

కృష్ణపక్షపు మనసు —

లోకమంతా శోక సాగరపు వెల్లువని
నిస్తేజ నిర్వీర్య నిస్పృహాల మునిగి
బ్రతుకులన్నిమాయ, నీవు నేనూ మిధ్య,
వెట్టి మోహాలతో వెతల సుడులల్లుకొని
కలగి, నలగిన మనసు కాయముల జీర్ణించు.

శూన్యాంతరువులోన —

కలికి పిలిచిన పిలుపు
మదికి రేపిన కోర్కె,
చిటిపాప చిఱునవ్వు,

'ఆఫీసు' కై గంట, పొట్టకూటికి తంట,
యథాలాపములోన సాగిపోవు లోక
మంటె ఇష్టంబాచు, తథాచరణము క్రమము.

ఆశ యెందున మెరసె ! ని
రాశ యెందున క్రుంగె ! !
ఆశా నిరాశల అంతరువు శూన్యము ! !

— "శ్వేతాద్రి"



చిత్రకారులు : శ్రీ రావు. వెంకటరావు సౌజన్యంతో.

పాడి-పంట

శ్రీమతి లక్ష్మీనారాయణమ్మ.

కదురాడినా కవ్వమాడినా కొదువవుండదు అను నానుడి ఆంధ్ర దేశములో చిరపరిచితము. కదురు నేడు రాజకీయవేత్తల సొమ్మయినది. పాడి పంటలలో స్త్రీలకు ఎక్కువగా శ్రద్ధాభిలాషలు గలిగించటమే మా అభిమతము. అవకాశమున్నప్పుడు ఈ శీర్షికలో "పాడి-పంటల" విశేషములు సోదరీమణులకు అందింపగలము.

— సం.

—————:o:—————

మన గ్రామములలో ఒకరినొకరు పునస్సందర్శించు కొన్నప్పుడు "బాగున్నారా ?" అని అడుగు కుశల ప్రశ్నతోపాటు "పాడి ఉందా" యని అడుగుట మామూలు. తెలుగు దేశములోవారికి పాడిమీద ఎంత శ్రద్ధో ఈ అలవాటే చాటుతుంది. కాని నేడు పల్లెవాసులును సోమరులై పాడిమీద తగినంత శ్రద్ధ తీసికొనకపోవుట చాల విచారకరము.

ఏదేశములోనైనను పశు సంపద దేశ సంపదను సూచిస్తుంది. అంతేగాక ఆవు మనకు అనేక కారణముల చేత పూజ్య జంతువు కూడాను. పాలు, పెరుగు మన ఆరోగ్య జీవనమునకు చాల అవసరము. ఆర్థికంగాకూడా పాడి జాగ్రత్తగా చేసిన మనకు చాలా లాభదాయకము.

పిల్లలను పెంచుట కెంత కష్టపడవలయునో పశువులను సక్రమముగా చూచుకొనుటకుకూడా అంత కష్టపడవలయును. కష్టే ఫలే. కష్టమునకు తగిన ఫలము పాడి వలన తప్పక లభించును. పల్లెటూళ్ళలోను, వీలున్న బస్తీలలోను పాడి పెట్టుకొనుట మంచిది. ఇండ్ల మీద ఇండ్లు క్రిక్కిరిసి కట్టుకొను ఈ రోజులలో గొడ్లు కట్టి వేయుటకు తగినంతస్థలము ఇంటికి సమీపముననుండుట అత్యావశ్యకము. అవకాశమున్న ప్రతి గృహిణియు పాడి

పశువులను (ఆవులను గాని, బఱ్ఱెలనుగాని) పెంచుట ఒక హాబీ. (వినోద క్రీడ) గా చేసుకొనిన, వారి కుటుంబమునకు ఎన్నియో విధముల తోడ్పడినవారగుదురు.

అన్ని ఇంటిపనుల వలెనే పాడి పశువుల పనియూ నౌకరులకు వప్ప చెప్పిన ఎట్టి లాభమునూ లేకపోగా ఎంతో కొంత నష్టము కలుగుట తథ్యము. పిల్లలను పెంచు విధముననే పశువులకు ఆ యా నిర్ణీతసమయములకు కుడితి వగైరాలు పెట్టుచున్నదీ లేనిదీ చూచుకొనుచుండవలయును. సాధారణముగా తవుడు శనగపొట్టు ఆవులకు బఱ్ఱెలకు పెట్టవగును. తవుడు పోయుటవలన పాలు చిక్కబడి. పాలు పెరుగులకు మంచి రుచి వచ్చును. శనగపొట్టు పోయుటవలన పాలు కొంచెము పలుచబడి కొలతకు బాగా వృద్ధియగును. కావున తవుడూ, పొట్టూ సమముగా కలిపి కుడితిలో పోయుట మంచిది. ఒక్కొక్క అవుకుగాని, బఱ్ఱెకుగాని రెండు మానికలు చొప్పున తవుడు శనగపొట్టు మిశ్రమము నీళ్ళలో కలిపి దానిలోనే సుమారు ఒక వీశ తెలక చెక్క (కొబ్బరిది గాని, నువ్వులది గాని) వేసి రాత్రే నానబెట్టవలయును. బియ్యముకడుగునీళ్ళు. గంజి. వగైరాలున్న కుడితిలో పోసిన మంచిది. కుడితి బెట్టునప్పుడెల్లా ఒక గుప్పెడు ఉప్పు వేయుట మరువరాదు. ఈ బాగుగ నానిన కుడితిని ఉదయము పాలు పితుకుటకు ముందే పెట్టవలయును. కుడితి త్రాగిన తరువాతనే పాలు పితుకవలయును. కుడితితొట్టిలో, తిరిగి సాయంత్రము కుడితికి వెయ్యవలసిన రెండు మానికల తవుడూ పొట్టు మిశ్రమము వేసి మధ్యాహ్నము వరకు నాన నివ్వవలయును. (ఎన్ని పాడి గొడ్లున్న అన్ని కుడితి తొట్లు అత్యవసరము) ఆవు, బఱ్ఱె ఈనిన రెండు మూడు మాసముల వరకు జొన్నన్నముగాని, సజ్జన్నముగాని పెట్టవలయును. ఇది మధ్యాహ్నము కుడితిలో పెట్టుట మంచిది. ఈ జొన్నన్నము సజ్జన్నము పెట్టుట ఆపివేసినప్పుడు ప్రత్తిగింజలు పెట్టుట ఆరంభించవలయును. సుమారు అరవీశ గింజలు రాత్రి నీళ్ళలో నానబోసి తెల్లవారి రుబ్బి మధ్యాహ్నపు కుడితిలో పోయవచ్చును. ప్రత్తిగింజలు తినిన బఱ్ఱె పాలుపెరుగుల కొకవిధమైన మంచి కమ్మని వాసన, రుచి కలుగును. నెయ్యియూ మంచి సువాసన కలిగి చాల రుచిగా నుండును. ప్రత్తిగింజలు మేసెన బఱ్ఱె యొక్క నెయ్యి పెరుగుల రుచి తిననినే తెలియునుగాని చెప్పిన తెలియదు। పాడి తగ్గి పశువు ఎండిపోవు సమయము సమీపమునకు రాగానే ప్రత్తిగింజలు ఆపివేసి, ఒక సోలెడు ఉలవలు నానవేసి రుబ్బిపెట్టిన పాలు అధికమగును. పైవిధముగా మేత పూటకు రెండు మూడు శేర్లు పాలిచ్చు గొడ్లకు పెట్టవలయును. పచ్చగడ్డిగాని, ఎండుగడ్డిగాని దొరకు స్థలములలో జనపకట్ట, చెఱకు, జొన్నదంట్లు కూడ వేయవలయును: కాని పైవిధముగా కుడితి త్రాగిన పశువులు సాధారణముగా గడ్డిని ఎక్కువగా తినవు.

బఱ్ఱెలకు ఎక్కువగా ఎండ తగలకుండగను, ఆవులు వానలో తడువకుండగను చూచుకొనవలయును. అప్పుడప్పుడు పాడి పశువులకు ఒక్కొక్క కొబ్బరికాయగాని, ఒక అరవీశెడు వంకాయలుగాని పెట్టుచుండవలయును. దూడలకు పాలు లేకుండా పాలన్నీ మనమే పితుకుకొనుట ధర్మముకాదు. దూడలను బహు జాగ్రత్తగా పెంచవలయును. పాలు ఎక్కువ తక్కువ గాకుండా వాటికి విడచిననే అవికోపుగా పెరుగగలవు. ఎండిపోయిన పశువులను మేపుట నష్టమని వాటికేమి తిండి పెట్టకుండా హింసించుట చాల పొరపాటు, ఆ పది నెలలు సరియైన ఆహారమున్ననే అది తిరిగి దూడ నీనిన తరువాత పాలు సరిగాబాగా ఇవ్వగలదు. ప్రతిరోజూ మధ్యాహ్నము పశువులను శుభ్రమైన నీటితో కడుగవలయును. రాత్రిళ్ళు కూడా పశువులను అప్పుడప్పుడు లేచి చూచుకొనుచుండవలయును. వాటికేవైన రోగము వచ్చినట్లు అనుమానము తగలగనే పశువుల వైద్యశాలకు పంపుట మంచిది. నోరు లేని జంతువుల ఆరోగ్యవిషయము మనమే జాగ్రత్త తీసికొనవలయునుకదా।

పాలు పిడకల మీద కాచిననే బాగుగా మీగడ కట్టి పెరుగు చేసినప్పుడు రుచిగా నుండును. పాలు తోడు వేయుట, వెన్న కాచుట ఒక కళయే తగిన వేడి పాలలో తగినంత తోడువేసిననే రుచి శీతోష్ణస్థితిని బట్టి, పాల మొత్తమును బట్టి తోడుకూడ మార్చుకొనవలయును. (ఎక్కువ పాలకు ఎక్కువ తోడు అవసరము లేదు.) ఒక్కటి రెండు చుక్కల తోడు భేదము రుచిలో ఎంతో మార్పుండును. అట్లే నెయ్యి విషయములో—వెన్న కాచుటలో—ఒక్కటి రెండు నిముషములు ఎక్కువ తక్కువలు రుచిలో ఎంతో భేదము గలిగించును. ప్రతి

గృహిణియూ పాలు పితుకుట, పెరుగు తోడు వేయుట, మజ్జిగ చేయుట, నెయ్యికాచుట సంసార బాధ్యత వహించక ముందే నేర్చి యుండవలయును-ధనాపేక్షతో ఇంటిలోని వారికి లేకుండ పాడినమ్ము కొనుట పాడి గాదు.

పాలు, పెరుగు, మీగడ, నెయ్యి మన ఆరోగ్యమున కెంతో అవసరము—వీటితో పాటు పప్పు, కూరగాయలు, పండ్లు తీసి కొనిన మనము బాలెన్సుడు డయట్ భుజించు చున్నట్లే. ప్రపంచములో కంతా మనదేశములోనే పాల ఉత్పత్తి ఎక్కువట కాని ప్రపంచములో ఎచ్చటా పాలింత ఖరీదులేదట। అదీగాక ఎన్ని పాలు ఉత్పత్తయినా మన దేశ జనాభాకు తగినంత లేక పోవుటవల్ల బీదసాదలకు పాలు కొనుక్కొనుట దుర్లభము।

ఇంటిలో పాడి వలన లాభములు—ముఖ్యముగా శుభ్రమైన పాలు మనకు కావలసిన సమయమునకు దొరకును. మనము కొనేపాలకూ (ఇంటివద్ద మనవద్దనే పిండినవూ) మన ఇంటిలోనిగొడ్ల పాలకూ చాలభేద ముండును. పాలు కాగుచుండగనే వాసననుబట్టి భేదము కను గొనవచ్చును. వాటికి పెట్టే ఆహారమే ఇందుకు కారణము. పాలమ్ముకొనువారు పాలురుచిగా నుండుటకు వలయు ఆహారము పెయ్యరు, పాలుసమృద్ధిగా నుండుటకు తగు ఆహారమునూ వేయరు. పశువుల పేడ పల్లెటూళ్లలో రైతులకు అత్యవసరమైన ఎరువుకు ఉపయోగింపబడును. బస్తీలలో పిడకలకు పనికి వచ్చును. ఒక్క ఆవుగాని, బర్రెగాని విలువ మూడునెలల పాడితో సరిపోవును. కావున ఆర్థికంగాను పాడి లాభ దాయకమే.

శ్రద్ధగల గృహిణి అవకాశమున్న, ఓపిక యున్న పాడి పశువులను ఇంటిలో పెట్టుకొనవలసినదే.

వ్యవసాయకేంద్ర వార్త :

పంట

కొబ్బరి నారు ఇసుకలో నిలువచేయబడుట మేలు.

కొబ్బరి నారు బొండములు శ్రేష్ఠతరంగా నిలువ చేయాలీ అంటే, వాతావరణానికి విడిచి పెట్టడంకంటే సన్నని ఇసుకలో పాతిపెట్టడమే మంచిది.

ఒక సాలలో మూడు అంగుళముల ఎత్తున పరచ బడిన సన్నని పొడి ఇసుక పొరపై ముచికలు పైకి ఉండునట్లు కొబ్బరి నారు నమర్చవలెను. పైన యిసుకతో కప్పి నాటుట కవసరము కలుగునందాక బొండముల నలాగే యుంచవలయును.

అధిక సంఖ్యలో నిలువచేయవలెనంటే మొదటి పొరపై నింకొక వరుస పేర్చి అలాగే పొరలు పొరలుగా నుంచవలెను.

నాటుటకు మొక్కలను పైకి తీయునపుడు, నీరులేని కాయలనూ కదపినంతనే డొలకలగు వాటినీ పార వేయవలెను.

(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చి)

కొత్త రకం బెండకాయలు :

మేలిమి తరగతి కాయకూరలజాతి.

కొత్త ఢిల్లీలోని ఇండియన్ వ్యవసాయ పరిశోధనాలయములో ఒక ఎకరమునకు 200-250 మణుగులు ఫలించు ఒక మేలు రకపు బెండకాయను సృష్టించేరు.

దీనిని పూసామఖ్మాలీ అంటారు. ఈ కాయ 6-8 అంగుళముల పొడవున వంకరలేక నున్నగా ఆకర్షణీయమైన పశిరిక వర్ణము కలిగియుండును. ఈ రకము బెండ వేసవికాలములోను వర్షాకాలములోను కూడా పెంచ వచ్చును.

వేసవి సాగున ఇది ఏబది దినములలో పండుచున్నది. కాని వర్షాకాలమున కోత కెదుగుటకు పదిరోజు లధికము కావలసియున్నది.

ఎక్కువ శీతకాలంగాయుండే ఉత్తర హిందూదేశంలో పూసామఖ్మాలీ విత్తులు ఫిబ్రవరి మాసాంతమున నాట వచ్చును. విత్తులు జూలై మధ్యవరకూ నాటవచ్చును. ముఖ్యముగా వేసవి సాగునకు మార్చిసరికి నాటుట పూర్తికావలెను. వర్షకాలపు పంటకు వర్షములు ప్రారంభించుటకు ముందుగానే మొదలిడి జూన్ మధ్యకో ఇంకా ముందుగానో పూర్తికావలెను.

ఉష్ణప్రాంతములగు దక్షిణ, పశ్చిమ భాగములలో జనవరి మాసమునకు ముందుగానే నాటినవిగాక తక్కిన ముఖ్యమైనసాగుల కీవిధముగనే విత్తనములు నాటవలెను.



ఎస్. కె. రాజేశ్వరీరాణి

ఊరుగాయ

నిమ్మకాయల్ని కాయలు కాయలుగా పెయ్యడం కొందరికి తెలియదను కుంటాను. ఈ ఊరుగాయ చాలా బావుంటుంది. చిన్నసైజు కాయల్ని ఏరుకోవడంముఖ్యం కళాయిగిన్నె పొయ్యిమీద పెట్టి కాయల్ని నూనె వేసి మగ్గించాలి. కాయ బాగా వేగిందను కోవడానికి గుర్తుబాగా సొట్టలు పడడం.

ఏబయి కాయలకి కారం. నూనె ఇస్తున్నాను. పది హేను పలాలు నూనె పొయ్యవచ్చు అరపలం ఇంగువ వేయించుకొని పొడుం కొట్టాలి. అరచిట్ట మెంతులు వేయించక పొడి కొట్టిపెట్టుకోవాలి. మూడు చిట్లు అంటే అర్ధశేరు మిరపకారం ఆవాలు ఒక చిట్టి పచ్చిదేకొట్టి మెత్తగా పొడుం చేసుకోవాలి. కారం మెంతులు. ఆవాలు, ఇంగువ పొడుం వేసి గుచ్చెత్తి కారంవేసి పైన వాసెన కట్టాలి. నూనెలో వాడ్చింది గనక త్వరలోనే నిమ్మకాయ ఆవకాయని వాడుకోవచ్చు. చాలాబావుంటుంది ఈఆవకాయ. ఇరవై అయిదు కాయలువేసుకొనే వారు ఈ పద్దుకి సగం తగ్గించి నూరుకాయల్ని వేసుకొనేవారు పద్దుకి రెట్టించి వెసుకోవాలి.

చిక్కుడు వరుగులు

బీన్సు బాగా ముదిరినవి తీసుకొని లోని పప్పుల్ని వలచివేయాలి. ఈ పప్పుల్ని పులుసులోనయినా, పప్పులోనయినా వేసుకోవచ్చు. ఆ తొపకల్ని కొందరు పారబోస్తారు. కానీ ఆతొపకలవరుగులు ఎంతరుచిగావుంటాయో?

పుల్లపెరుగులో నారాగిరా లేకుండా ఆ తొపకల్ని సమంగా ఉప్పువేసి నానపెట్టాలి. తొపకకి ఉప్పుసరిగా అంటితే మజ్జిగలో నానవెయ్యడం మానాలి. తొపకవిరిస్తే టపుక్కున విరిగేటట్టు ఎండపెట్టి నూనెలో వేయించుక తింటే ఎంతో బావుంటుంది. అన్నంలోకి ఆదరువుగా వుంటుంది. లేదా నంజుకోవడానికి కూడా పనికి వస్తుంది.

మండీబాత్

మండీబాత్ : ఈ వంట మహారాష్ట్రలది అయినా తెలిసినవారు అప్పుడప్పుడు చేసుకొని తింటూంటారు.

వుర్లగడ్డలు : ¼ వి
జీడిపప్పు : 5 ప.
బియ్యం : 3 తవ్వలు. (అర్ధశేరు)
పచ్చిమిరపకాయలు 0—1—0
నెయ్యి : 5 ప.
తగినంత ఉప్పు
తగినంత చింతపండు
కందిపప్పు : 1 తవ్వ.

పొయ్యిమీద పెద్ద కళాయిగిన్నె పెట్టి కందిపప్పుని బాగా వుడకనిచ్చి దించిపెట్టుకోవాలి. తర్వాత ఎసరుపెట్టి బియ్యం శుభ్రంగా కడిగి వెయ్యాలి. (కళాయిగిన్నె వుండాలిసుమా) వుర్లగడ్డల్ని వేరుగా వుడకపెట్టి తొక్కలు తీసివుంచుకోవాలి. అన్నంముప్పాతికభాగం వుడుకుపట్టిన తరువాత కందిపప్పునీ, వుడికిన వుర్లగడ్డల్నీ వెయ్యాలి. ఐదునిమిషాల తర్వాత పులుసు పొయ్యాలి. తగినంత ఉప్పు వేసి మూతపెట్టాలి. నీళ్ళు ఎక్కువ తక్కువలు కాకుండా సరిపోయేటట్టుండాలి. ఒకరవ్వ ముద్దగావస్తుందీ కుంపటిమీద బాణలిపెట్టి అందులో నెయ్యిపోసి జీడిపప్పు, సన్నగా తరిగిన పచ్చిమిరపకాయల్ని వేసి ఆ నెయ్యితో కూడా ఇవితీసి ఈ పొయ్యిమీద గిన్నెలోనికి వంచాలి. బాగుగా కలయపెట్టి దించిపైన ఒకతట్టలో నిప్పులుపోసి పెట్టాలి. ఈ మండీబాత్ చాలాబావుంటుంది. నెయ్యి ఇంకాస్తకూడా పోసుకోవచ్చు. కారం ఎక్కువ కావాలనుకునేవాళ్ళు ఇంకాసిని మిరపకాయలు వెయ్యవచ్చు.

[12 వ పేజీ తరువాయి]

జీవితమునిరర్థకము నారాజ ధర్మువును నాకీయవా'' అని అతిదైన్యముతో దేవేంద్రుని ప్రార్థించినాడు.

"నీ మిత్రుడైన రాజధర్మువు బ్రహ్మదేవునకు కూడ మిత్రుడేనని తెలియదా? నీవు విచారించకు! ప్రతిదినము బ్రహ్మదర్శనమునకు అతడు పోవుట బ్రహ్మ వాంఛించును. ఇట్టి విపరీతము తరుచు అతడుపోక పోవుటచే సంభవించెను. అతని కళేబరమునకు అగ్ని సంస్కారముచేసి ఎంతయో మేలొనర్చినావు. తరువాత ఏమిజరిగినదో చెప్పెదను విను. నీ వట్లు దహనము చేసివచ్చిన తరువాత ఆచితి సమీపమున కొకగోవు వచ్చి నిలిచినది. దానిదూడ చనుగుడిచి పాలు త్రాగుసమయమున దూడనోటిలోని పాలనురగ గాలికిఎగిరి వచ్చి ఆచితిమీద పడినది. వెంటనే నాడీజంఘునికి ప్రాణమువచ్చినది. ఎప్పటి ఆకారము, రూపు సౌందర్యము తిరిగివచ్చినవి. దీనికంతకు ఆ బ్రహ్మదేవుని దివ్యచిత్తము యొక్క మాహాత్మ్యమే కారణము అదిగోచూడు! నీ నాడీజంఘుడే తిరిగి వచ్చుచున్నాడు'' అని ఇంద్రు డనెను.

ఆవిధముగా బకపతి తిరిగి కన్నుల ఎదుటపడినాడు. దానవరాజు ఆనందమునకు మేరలేక పోయినది. ఇంద్రుడా నీచ బ్రాహ్మణుని కట్లు విడిపించినాడు. నాడీజంఘుడా బ్రాహ్మణుని దుస్థితి చూచినాడు. తనమూలమునగదా అతనికీ దీనదశ ప్రాప్తించినది. అందుకు తాను సహించలేక పోయినాడు. బ్రాహ్మణుని విడిచిపెట్ట వలసినదని ఇంద్రుని ప్రార్థించి వరము వేడుకొన్నాడు.

ఆ సమయమున బ్రహ్మ సత్కృపాన్వితుడై ఉండుట దివ్యదృష్టిని చూచి, ఇంద్రుడు నాడీజంఘుని కోరిక తీర్చినాడు. బ్రాహ్మణుడు విముక్తి పొందినాడు. రాజు అనుమతిపై అతని ధనరాశులు అతనికి తిరిగి ఇచ్చివేసినారు. బకరాజు ఔదార్యము అందరు మెచ్చుకొన్నారు.

బ్రాహ్మణుడు ధనపు సంచులు తిరిగి భుజమున వేసుకొని మోసికొని పోవుచూ, తిరిగి తిరిగి వెనుకకు చూచుచు, భయ సంభ్రమములతో తనదారిని పోయినాడు. ఇంద్రుడు తన త్రివిష్టపమునకు వెళ్ళిపోయాడు. నాడీజంఘుడు సంతుష్టాంతరంగుడై తన స్వస్థానమును చేరుకన్నాడు.

ఇదీకథ. దీనిని మహాభారత యుద్ధానంతరము అంపశయ్యపై పరుండి మరణమునకై మంచి దినము కొరకు నిరీక్షించుచున్న భీష్ముడు ధర్మరాజాదులతో చెప్పినాడు. "బ్రహ్మ ఘాతికైన నిష్కృతి ఉన్నదికాని, మిత్ర ఘాతికి మాత్రమున్లేదు

ఆరయ మిత్రద్రోహము
దారుణమగు పాతకము కృతఘ్నత కంటెన్
వైరముగొని విడువవలయు
నారెండు తెరగులవారి నాప్తులనైనన్

మిత్రుడూ, ధనమూ వీనిలో మిత్రుడేఎక్కువ అని ప్రాజ్ఞులు మెచ్చుకుంటారు కృతఘ్నత, మిత్రద్రోహము అధికమైన పాతకములు సన్మిత్రుని పాలించుట శుభము!''

ఆంధ్ర మహిళా సభ హాస్టల్

మల్లమదేవి మహిళా మందిరముయొక్క వార్షికోత్సవం ఫిబ్రవరి 15 వ తేదీన శ్రీమతి పర్వతవర్ధనిగారి అధ్యక్షతను జరిగింది. ఆ సందర్భమున వార్డెన్ శ్రీమతి వెంకుబాయమ్మగారు సమర్పించిన నివేదికను ప్రచురిస్తున్నాం.

ఆంధ్ర మహిళా సభ హాస్టలుకు నేటితో మరొక సంవత్సరము పూర్తి అయినది. దైవదనుగ్రహము వలన ఎట్టి ఆటంకములూ, ఒడుదుడుకులూ లేకుండా తన కార్యక్రమమును సఫలీకృతము చేసుకో గలుగుతోంది.

మల్లమదేవి మహిళా మందిరము శ్రీ బొబ్బిలిరాణీగారి చేతి చలువవల్ల ఉద్భవించి ఆంధ్ర మహిళాసభ విద్యార్థినులకు, వుపాధ్యాయినీ వర్గమునకు, యీ నగరములో యితర సంస్థలలో పనిచేయుచున్న సోదరీమణులకు ఆశ్రయమిచ్చి వారి పురోభివృద్ధికి తోడ్పడుతోంది.

మద్రాసులో స్త్రీలకు ప్రత్యేకంగా హాస్టల్సు చాలా తక్కువ. ఆవున్నవాటిలో కెల్ల ఆంధ్ర మహిళా సభ హాస్టలు క్రమ శిక్షణకు, ఆరోగ్యకరమైన భోజనమునకు, స్వల్ప ఖర్చులకు పేరెన్నికగన్న విషయం మనందరికీ గర్వదాయకం.

యీ సంవత్సరంలో ముఖ్యంగా మనం చెప్పుకోదగ్గ విషయం— నుయ్యి త్రవ్వించి, ఎలక్ట్రిక్ పంపు సహాయంతో నీటిని పుష్కలంగా సహాయం చేయగలుగుతున్నాం. దానికి మహిళా సభ కార్యనిర్వాహక వర్గానికి కృతజ్ఞత తెలియబర్చుకుంటున్నాము.



ఆంధ్ర మహిళా సభ హాస్టల్ విద్యార్థినులు. దేశ్‌ముఖ్ దంపతులతో.

ఆంధ్ర మహిళా సభ హాస్టల్

ఈ సంవత్సరంలో భోజనం ఫీజును రు 28 లకు తగ్గించ గలిగాం. కాఫీ, టిఫినూ నిర్బంధంలేదు. ఈ సదుపాయానికి చాలామంది విద్యార్థినులు సంతోషించారు.


ఈ సంవత్సరంలో జరిగిన యింకోవిషయం— హాస్టలుకు వెల్లా రంగులూ వేయించాము.

సభయొక్క కార్యకలాపాలలో హాస్టలు నివాసు లందరూ యెంతో వుత్సాహంతో పాల్గొన్నారు. దసరా సందర్భంలో యేర్పరచిన ఎగ్జిబిషన్‌యొక్క విజయానికి హాస్టల్ గూడా ముఖ్యమైన కారణం అని చెప్పాలి. విద్యార్థినులేగాక సభ హాస్టలులో వుండే 'గెస్టులు' గూడా ఆంధ్ర మహిళా సభ తమ స్వంత సంస్థయే అనుకుని కార్యక్రమ విజయానికి యెంతో తోడ్పడ్డారు. వారికి ప్రత్యేకంగా మా అభివందనాలు అందజేస్తున్నాము.

ఈ నివేదిక ముగించేముందు డాక్టర్ అవధానిగారికి మా కృతజ్ఞతా వందనాలు మనవి చేసుకోడం మా విధి. మా హాస్టల్ నివాసుల యోగక్షేమాలు వారిమీదే యెక్కువగా ఆధారపడివున్నాయి. ఆంధ్ర మహిళాసభపై ఆయన కున్న ఆదరాభిమానమువల్లనే వారియొక్క సేవ మాకు లభించింది. స్వంతడాక్టరుగా, లోకల్ గార్డియనుగా ఎప్పుడు కబురంపుతే అప్పుడు వచ్చి మాకు తగు మెడికల్ ట్రీట్‌మెంట్ యిచ్చి మమ్మల్ని కాపాడు తున్నారు. వారికి మాకృతజ్ఞతాభివందనములు సమర్పిస్తూ వారికి భగవంతుడు ఆయురారోగ్యములిచ్చి కాపాడ వలెనని ప్రార్థిస్తున్నాం.




1956 మార్చి నెలలో జరుగనున్న బెనారెస్ మెట్రిక్ పరీక్షకు వెళ్ళుచున్న ఆంధ్ర మహిళాసభ విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, కార్యదర్శినులు గూడ వున్నారు.



తారాపథములో ప్రకాశించుచున్న ఉత్తమ నటి - భానుమతి

ఫిలింఫాన్స్ సంఘంవారు యేర్పరచిన బాలట్‌లో యెన్నికైన ఉత్తమ తెలుగునటి శ్రీమతి భానుమతి. (విప్రనారాయణ చిత్రంలో) వీరికి మొన్న మద్రాసు మ్యూజియం థియేటరులో నృత్య భంగిమలోనున్న ఒక విగ్రహాన్ని బహూకరించారు.





తారాపథమును అందుకుంటున్న నటి-జమున


ఫిలింఫాన్స్ సంఘంవారు యేర్పరచిన బాలట్‌లో యెన్నికైన ఉత్తమ తెలుగు సహాయనటి కుమారి జమున. ([illegible] చిత్రంలో) వీరికి మొన్న మద్రాసు మ్యూజియం థియేటరులో జరిగిన బహుమాన ప్రదానోత్సవంలో ప్రశంసాపత్రము బహూకరించారు.

భారతమాత దత్తపుత్రుడు కులపతి

జయరామ కజిన్సు

ఎక్కడ పుట్టుక ఎక్కడ గిట్టుట! చిత్రము ఐర్లాండులో పుట్టి భారతదేశమునకువచ్చి భారతదేశమునే తన మాతృదేశముగా గ్రహించి అపారసేవచేసి మొన్న తనువు చాలించారు. రెండు సంవత్సరముల క్రితమే వీరి సతి మార్గరెట్ కజిన్సు దీర్ఘకాలము పక్షవాత రోగపీడితురాలై మరణించారు. వెనువెంటనే ఈయన ఆమెను అనుసరించారు. జీవితాంతమువరకు మన దేశమునకు సేవచేసిన అపూర్వ ఆదర్శ దంపతులు వీరు.

డాక్టరు కజిన్సు గొప్ప విద్యావేత్త. కవి, కళావేత్త, రాజకీయవేత్తగాపరిగణింప వీలులేకపోయినా. ఆయన ఉత్తమశ్రేణికిచెందిన రాజకీయవేత్తల నెందరినో తయారుచేశారు.



శ్రీ కజిన్స్ 1873 సం॥లో జూలై 22 న ఐర్లండులోని బెల్‌ఫాస్ట్ నగరంలో జన్మించారు. వీరి బాల్యదశ, విద్యార్థిదశ ఐర్లండులోనే! బ్రిటిష్ వాఙ్మయంలో ప్రజ్ఞ గడించారు. 1915 లో భారతదేశంలో అడుగిడినారు.... భారతీయుడుగా మారిపోయేరు. డాక్టరు అనీబెసెంట్ అధ్వర్యంతో నడుపబడే 'న్యూఇండియా' అనే పత్రికలో సంపాదకులుగా నియమింపబడ్డారు. 1922 నుంచి 1928 వరకూ. అడయార్ బ్రహ్మవిద్యాశ్రమంలో ప్రిన్సిపాలుగా పనిచేశారు. తదుపరి, మదనపల్లి థియోసాఫికల్ కాలేజీలో ప్రిన్సిపాలుగా పనిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయమున వీరు సెనేటు సభ్యులుగాను. అకడెమిక్ కవున్సిల్ సభ్యులుగాను, బోర్డు ఆఫ్ స్టడీస్ లలితకళాశాఖలోను పనిచేశారు అంతేకాక అడయారు, అంతర్జాతీయ కళాసభ ఉపాధ్యక్షుడుగాను పనిచేశారు. 1924 సం॥లో మైసూరులో భారతీయ చిత్రకళాశాలను, 1925 సం॥లో తిరుపనంతపురంలో భారతీయ చిత్రకళాశాలను స్థాపించారు. తిరువాన్కూరు విశ్వవిద్యాలయ స్థాపనకు సహాయకారిగా నుండి, అచటి లలితకళలు, ఇంగ్లీషు శాఖల ఉన్నతాధికారిగానున్నారు. తిరువాన్కూరు ప్రభుత్వపు కళా విషయక సలహాధ్యక్షుడుగా 1934 సం॥ నుండి 1948 వరకు నియమితులైయున్నారు. జపానులోని ఓటానీ విశ్వవిద్యాలయంలో వీరు ఇంగ్లీషుపోయెట్రీ ప్రొఫెసరుగా పనిచేసిరి. అప్పటిలోనే వీరి అపారవిజ్ఞానం శ్లాఘింపబడి గొరవ డాక్టరేటు బిరుదముతో ఆ యూనివర్సిటీ వీరిని గౌరవించింది. ఒక సంవత్సరం న్యూయార్కులో కాలేజీ లెక్చరరుగా పోయెట్రీపై ఉపన్యాసములు ఇచ్చిరి.

దక్షిణ భారత ఉపాధ్యాయ సంఘమునకు అధ్యక్షుడుగానుండిరి. ఆ సందర్భముననే వీరు 'కులపతి' 'టీచర్ ఆఫ్ స్టూడెంట్సు' అనే బిరుదాలతో సత్కరింపబడిరి. 1937 లో తిరువనంతపురం, పద్మనాభస్వామి ఆలయంలో దేవపూజానుమతినికోరినప్పుడు "జయరామ్" అని నామకరణం స్వీకరించారు.

పద్యకవిత్వము, నాటకములను గూర్చిన వీ రచనలను కళాక్షేత్రమువారు సేకరించి ప్రచురించిన 2 గ్రంథములును, కళలు. విద్య. వేదాంతము మున్నగు విషయములనుగూర్చిన అనేక గ్రంథములును వారి కళాప్రియత్వమును, కవితాశక్తిని, అపారమైన జీవితానుభవములను వ్యక్తపరచుచున్నది.

వారి జీవితకాలమున దాదాపు సగము మన భారతీయుడుగామారి, భారతజాతి కపూర్వమైన సేవయొనర్చి మన భారత వాఙ్మయములో కలసిపోయిరి - భారతమాత తన పెంపుడుబిడ్డను కోల్పోయింది.


కీ॥ శే॥ శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రిగారు



భాషోద్ధారక, కళాప్రపూర్ణ శ్రీ వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులుగారు 9-2-1956 గురువారము రాత్రి 12 గంటలకు మదరాసులోని వారి స్వగృహములో పరమపదించిరని తెలుపుటకు మిక్కిలి చింతించుచున్నాము. వారు 'వావిళ్ళ' సంస్థ వ్యవస్థాపకులు, భాషోద్ధారకులు, త్రిలింగ సంపాదకులు, బహుభాషాకోవిదులు, ప్రముఖ వక్తలు, గ్రంథకర్తలునూ. రాజకీయ సాంఘిక ఆర్థిక వాణిజ్య ధార్మిక, విద్యారంగములలోనూ, స్థానిక పరిపాలనా క్షేత్రము అందును పాల్గొని అత్యుత్సాహముగా ప్రజాహిత కార్యరంగమున బహుముఖకృషి సల్పిరి.

శ్రీ శాస్త్రులుగారు వ్యక్తిగతముగా బహుస్నేహపాత్రులు. వీరు త్రిలింగ సంపాదకులుగానుండి పత్రికలలో, వ్యాఖ్యలలో ప్రసంగములలో నిష్పక్షపాతము, నిర్మొగమాటము, కూలంకషవిషయ పరిశీలనము, సువిమర్శ ప్రదర్శించుచుండిరి. అనేక ధర్మ సంస్థలకు ప్రజాహితకార్యములకు వేలాదిధన మొసంగినవితరణశీలురు.

శ్రీశాస్త్రులుగారికి ఆంధ్రులు భాషోద్ధారక బిరుదిచ్చి గౌరవించిరి. మొన్ననే ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి గౌరవించిరి. వారి ఆత్మకు శాంతి సంప్రాప్తమగుగాక.



తెలుగు విద్యార్థి

బందరులో శ్రీ కొల్లూరి కోటేశ్వరరావుగారి సంపాదకత్వము క్రింద ప్రకటింపబడు మాసపత్రిక. సాలు చందా రూ.— 3—0—0

పెక్కు విజ్ఞాన దాయకమగు రచనలతో ముచ్చటగా మూడవ సంక్రాంతి సంచిక వెలువడినది. ప్రశ్నలు— సమాధానాలు (శ్రీ మామిడిపూడి వారిది) ఈ పత్రిక ప్రత్యేకతయని చెప్పక తప్పదు. కాని అన్ని రచనలను ఏదో ఒక కోణమునుండి ప్రత్యేకతను ప్రదర్శించుచున్నవి. తెలుగు విద్యార్థులందరు తప్పక చదువ వలసిన పత్రికే.

భారత జాతీయజెండా చరిత్ర

రచయిత :— పింగళి పరశురామయ్యగారు —

మూల్యం అర్థరూపాయి. — ప్రాప్తిస్థానము : గ్రంథ పేటిక, గోపాలరెడ్డిరోడ్డు — బెజవాడ 2. అని వ్రాయాలి.

ఈ చిన్ని పొత్తము మనజాతీయ జెండా యొక్క పుట్టుపూర్వోత్తరాలు వివరిస్తూ వ్రాసినది. 1901 లగాయతు 1947 వరకు గల పతాకచరిత్రను వివరించిన ఈ గ్రంథకర్తగారి కృషి ప్రశంసింప తగినది. ఇది ప్రతి ఆంధ్రుడు చదివి, తమజాతీయజెండాయొక్క పవిత్రతను దానియందుగల త్రివర్ణములోని అంతర్ధామును ఆది ఉపయోగించునప్పుడు గమనింపవలసిన సాంప్రదాయములను తెలుసుకొనవలసి యున్నది.

జయశ్రీ

రచయిత :— సామవేదం వేంకట శార్ఙపాణిగారు. మూల్యం. 1. రూపాయి. ప్రాప్తిస్థానము. ఎస్. వి యస్. అయ్యంగారు. పొన్నూరు. గుంటూరుజిల్లా.

ఇది పద్యసంపుటి జాతీయనాయకుల మీదను — భారతీయ సమస్యలమీదను అప్పుడప్పుడు కవిగారికి కల్గిన భావోద్వేగమునకు ప్రతిబింబితములై యొప్పుచున్న యీ పద్యరత్నములు మిక్కిలి హృద్యములై యున్నవి. ఈ చిన్ని గ్రంథమును అమరజీవి పొట్టి శ్రీరాములుగారికి అంకితము చేయబడినది. అందరూ చదివి ఆనందించ తగియున్నది.

ఆంధ్ర చేంబర్ ట్రేడ్ డెలిగేషన్ నివేదిక

ఆంధ్ర చేంబర్ ఆఫ్ కామర్సువారు ప్రచురించారు. 1955 సం లో శ్రీ జె. వి. సోమయాజులుగారి నాయకత్వాన జపాను మొదలైన ప్రాగ్దేశాలలో పర్యటించివచ్చిన ప్రతినిధి సంఘమువారు తయారు చేసిన నివేదిక ఇది. ఇండియాలో తయారైన వస్తువులు అమ్మకమునకు బజారులున్నూ అయాదేశాలతో వ్యాపారాభివృద్ధికి గల అవకాశములను జపానువంటి దేశములలో జరిగే సన్నకారు వస్తూత్పత్తి మనదేశములో ప్రవేశపెట్టుటకు కావలసిన సాధకములు మున్నగునవి. ఈ నివేదికలో కూలంకషముగ్గా చర్చించ బడినవి. ప్రాచ్యదేశములోని వర్తక వ్యాపారములు దీనివల్ల చక్కగా తెలియగలవు.

వెల : 2—5—0 — ఆంధ్ర చేంబర్ ఆఫ్‌కామర్సు.
మద్రాసు — 1.

—గాడేపల్లి సుందరీశంకరం.

భారత సేవక సమాజము

మహిళాశాఖ – గుంటూరు

1. భారతసేవక సమాజము : మహిళాశాఖ ద్వారా వికలాంగులైన బిడ్డలకు అనగా కుంటి, గ్రుడ్డి, మూగ, చెవుడు, వికలత్వములు కలిగియున్న బిడ్డలకు శరణాలయము నడుప బడుచున్నది అందు 12 లేక 14 సంవత్సరముల లోపు బిడ్డలకు అవకాశ మివ్వబడును. వారికి అచ్చటనే, అన్నవస్త్రములు, సాధారణ విద్య, వృత్తి విద్యా సౌకర్యములు ఏర్పాటులు చేయబడినవి. కులమత విచక్షణ లేమియులేవు. ఇందు జేర్పింపగోరు వారు ఈ క్రింది అడ్రసునకు దరకాస్తులు పెట్టుకొనవచ్చును.

2. ఈ సమాజమునందు స్త్రీలకు కుట్టు పని, అల్లిక పనులు మొదలగునవి నేర్పబడును.

3. ఈ సమాజమునందు శైపుసంస్థ స్త్రీలకు ప్రత్యేకముగా నడుపబడుచున్నది. వివరములు ఈ క్రింది అడ్రసునకు వచ్చి తెలుసు కొనవచ్చును.

అడ్రసు :—, కన్వీనరు

భారతసేవక సమాజము – మహిళాశాఖ

పండరీపురం— గుంటూరు.

ఇరకం బాల సంఘం

సూళూరుపేట – నెల్లూరు

నెల్లూరుజిల్లా సూళూరుపేట తాలూకా ఇరకం ద్వీప గ్రామంలో యీ 17–2–1956 5 గంటలకు బాలసంఘ మహాసభ జరిగెను. సభకు కేంద్రసమాజ శ్రేయోసంఘ ఆంధ్రరాష్ట్ర నిర్మాణకుర్తాలు, శ్రీమతి డి. సుబ్బలక్ష్మి గారు అధ్యక్షత వహించిరి.

శ్రీ న్యాయపతి రాఘవరావుగారు శ్రీ కె. మోసస్ మరికొందరు మాట్లాడినారు. శ్రీ సి. షన్ముఖమొదలిగారు బాలబాలికలు జాతీయగీతములు పాడినారు.

సదరు బాలసంఘ నిర్వాహమునకు శ్రీ న్యాపతి రాఘవరావుగారిని శ్రీమతి న్యా॥ కామేశ్వరమ్మగారిని పోషకులుగాను డా॥ బి. ఆర్. కన్నయ్య నాయుడుగారిని అధ్యక్షుడుగాను ఉ. రామకృష్ణమొదలి, ఎమ్. కె. నాగప్ప మొదలి గార్లను ఉపాధ్యక్షులుగాను శ్రీ కె. మోసన్, ఎమ్. ఆర్. సోమసుందరం గార్లను కార్యదర్శులుగాను శ్రీ ముత్తు ముద్దు కృష్ణయ్యగారిని కోశాధ్యక్షుడుగాను యింకా యేడుగురు సభ్యులను యెన్నుకొనిరి—


మార్చి
9
విడుదల
శ్రీ రాజరాజేశ్వరీ
ఫిలిం కంపెనీ వారి
నాగపంచమి
అంజలి · ఎస్.వరలక్ష్మి · కన్నాంబ · నాగయ్య నటించిన
(తెలుగు)
పతివ్రతకధ.....
దర్శకుడు · కె.బి.నాగభూషణం



"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

మార్చి 1956

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
•	•	•	•	1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	31

10. మహాశివరాత్రి. 12. అమావాస్య. 26. హోలీ పూర్ణిమ. 27. వసంతోత్సవం. 30. గుడ్ ఫ్రైడే.

ANDHRA MAHILA SABHA

MYLAPORE : : MADRAS 4

Edited, Printed & Published by Mrs. K. Lakshmi Raghuram, B.A., at the Andhra Mahila Press, Mylapore, Madras 4.